www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 197 | ఆదివారం | 6 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



టిఆర్‌ఎస్‌కు స్వీట్ సిక్స్‌టీన్



తెలంగాణ రాష్ట్ర సమితికి లోక్‌సభ ఎన్నికల్లో 16 సీట్లు ఖాయం : విడిపి సర్వే

ఓట్లు

టిఆర్ఎస్	44.4%
కాంగ్రెస్	31 %
బిజెపి	11.4%
ఎంఐఎం	4%
టిడిపి	3%

సికింద్రాబాద్‌లో ఓడిపోనున్న బిజెపి



ఎన్‌డిఎ	225
యుపిఎ	167
ఇతరులు	150
బిజెపి	200
కాంగ్రెస్	110
కూటమి	60

మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో ఒక్కటి మినహా మిగిలినవన్నీ టిఆర్‌ఎస్ కైవశం అవుతాయని, ఆ ఒక్క స్థానాన్ని ఎంఐఎం గెల్చుకుంటుందని విడిపి అసోసియేట్స్ తన ఒపినియన్ పోల్ సర్వేలో వెల్లడించింది. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో టిఆర్‌ఎస్ 44.4% మేర ఓట్లను పొందుతుందని పేర్కొంది. కాంగ్రెస్ సహా మిగిలిన పార్టీలకు కనీసం ఒక్క సీటు కూడా రాదని పేర్కొనింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను అంచనా వేసి ఒపీనియన్ పోల్ సర్వే నిర్వహించిన ఢిల్లీ కేంద్రంగా పనిచేసే విడిపి అసోసియేట్స్ తెలంగాణలో సైతం డిసెంబరు 20 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు సర్వే నిర్వహించింది. దేశంలోని మొత్తం 543 పార్లమెంటు నియోజకవర్గాల్లో 98 చోట్ల ఈ సర్వే నిర్వహించినట్లు పేర్కొనింది. మొత్తం 2646 పోలింగ్ బూత్‌ల పరిధిలో పట్టణ ప్రాంతాల్లో 41%, గ్రామీణ ప్రాంతాల్లో 59% ఓటర్లు ఉండేలా నమూనాను ఎంపిక చేసుకున్నట్లు తెలిపింది. మొత్తం 15,116 మంది నుంచి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఈ అంచనాకు వచ్చినట్లు ఆ సంస్థ తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొనింది. కులాలు, వయసు, విద్యార్హతలు, ఆదాయం, ఉద్యోగం, వృత్తి తదితర పలు అంశాలను ప్రామాణికంగా తీసుకుని సర్వే కోసం ఎంపిక చేసుకున్నట్లు స్పష్టం చేసింది. తెలంగాణలోని మొత్తం పదిహేడు లోక్‌సభా నియోజకవర్గాల పరిధిలో సర్వే నిర్వహించిన ఈ సంస్థ ఏయే వర్గాల నుంచి ఏ పార్టీకి ఎక్కువ మద్దతు ఉందనే అంశాన్ని కూడా అంచనా వేసింది. రాష్ట్రంలో మరే పార్టీకి లేనంత అధికంగా 44.4% మేర ఓట్లు టిఆర్‌ఎస్‌కు పడతాయని, కాంగ్రెస్‌కు 31% ఓట్లు పడతాయని అంచనా వేసింది. గత ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి గెలిచిన బిజెపి ఈసారి ఆ స్థానంలో గెలిచే అవకాశం లేదని, 11.4% ఓట్లు పొందినా ఒక్క సీటు కూడా గెల్చుకోలేదని స్పష్టం చేసింది. తెలుగుదేశం పార్టీకి కేవలం 3% ఓట్లు మాత్రమే వస్తాయని, ఒక్క స్థానంలో గెలిచే ఎంఐఎం 4% ఓట్లు పొందుతుందని పేర్కొనింది. రాష్ట్రం మొత్తం మీద 4% ఓటర్లు ఎటూ తేల్చుకోలేకపోయారని, అందువల్ల దాని ప్రభావం ఇప్పుడే చెప్పలేమని పేర్కొంది. రాష్ట్రంలో ఒక్క స్థానం ఎంఐఎం గెల్చుకుంటుందని, మిగిలిన 16 స్థానాలూ టిఆర్‌ఎస్ గెల్చుకుంటుందని తరువాయి 6లో

తెలంగాణ పట్ల

కేంద్రం వివక్ష

మోడీపై కెటిఆర్ ఫైర్

- బిజెపి పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం... తెలంగాణకు మరో న్యాయమా?
- విభజన హామీలను నెరవేర్చాలి
- బయ్యారం నెలకొల్పి తీరుతాం
- మిషన్ భగీరథ, కాకతీయకు నిధులెందుకివ్వలేదు?
- పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి డిపాజిట్లు కూడా రావు



మన తెలంగాణ/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ విధానాలపై టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని, దీన్ని రాష్ట్ర ప్రజలు ఎంత మాత్రం సహించరని తరువాయి 6లో

17నుంచి అసెంబ్లీ

- 4 రోజుల సమావేశాలు
- ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహమ్మద్‌ఖాన్(ఎంఐఎం)
- 17న ప్రమాణ స్వీకారాలు
- 18న స్పీకర్ ఎన్నిక
- 19న గవర్నర్ ప్రసంగం



ముంతాజ్ అహమ్మద్ ఖాన్

మన తెలంగాణ /హైదరాబాద్

రాష్ట్ర నూతన శాసనసభ తొలి సమావేశాలు ఈ నెల 17వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. గత నెల 7వ తేదీన శాసనసభ ఎన్నికలు జరిగిన తర్వాత 11వ తేదీన ఫలితాలు వెలువడడంతో కొత్తగా ఎన్నికైన సభ్యులు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయాల్సింది. ఇందుకోసం ప్రోటెమ్ స్పీకర్ ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. అఖిల భారత మజ్లిస్ పార్టీకి చెందిన చార్మినార్ శాసనసభ్యుడు తరువాయి 6లో



ఆదివారం అనుబంధానికి బదులుగా
కొత్త సంవత్సర క్యాలెండర్
నేటి సంచికతో అందుకోండి
\- ఎడిటర్

మే 3 నుంచి 9 వరకు ఎంసెట్

టిఎస్ఎంసెట్ (జెఎన్‌టియుహెచ్)

3,4,6 తేదీల్లో (ఇంజనీరింగ్)	8,9 తేదీల్లో (అగ్రికల్చర్)




మన తెలంగాణ/హైదరాబాద్

ఇంజనీరింగ్, ఫార్మసీ, న్యాయవిద్య, ఉపాధ్యాయ విద్య తదితర కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ టి.పాపిరెడ్డి శనివారం ప్రవేశ పరీక్షల వివరాలను వెల్లడించారు. మే నెల 3 నుంచి 9 వరకు ఎంసెట్, మే 11న 'ఇ సెట్', మే 20న పిఇ సెట్, మే 23, 24 తేదీల్లో 'ఐ సెట్', మే 26న 'లా సెట్', మే 27 నుంచి 29 వరకు 'పిజి సెట్', మే 30, 31 తేదీల్లో 'ఎడ్ సెట్' పరీక్షలను నిర్వహించనున్నట్లు షెడ్యూలు వివరాలు తెలియజేశారు. ఈ ఏడాది ప్రవేశ పరీక్షలు నిర్వహించే యూనివర్సిటీ వివరాలతో పాటు, పరీక్ష తేదీలను కూడా పేర్కొన్నారు. నీట్, జెఇఇ, కెసెట్ (కర్నాటక సెట్), జీమ్యాట్ తదితర జాతీయ పరీక్షల తేదీలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా, ఆ పరీక్షలు రాసే అవకాశం కోల్పోకుండా రాష్ట్రంలోని 'సెట్'ల పరీక్షల షెడ్యూల్ ఖరారు చేసినట్లు తెలిపారు. పిఇసెట్ మినహా అన్ని పరీక్షలు రెండవసారి ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు రెండవ సెషన్ ఉంటుంది. మే 3వ తేదీ నుంచి 9 వరకు ఎంసెట్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని ప్రవేశ పరీక్షలు మే నెలలోనే పూర్తి కానున్నాయి. మే 3న సెంట్ ప్రారంభం కానుండగా, మే 31న ఎడ్‌సెట్‌తో ప్రవేశ పరీక్షలు పూర్తి అవుతాయన్నారు. మే 3,4,6 తేదీలలో ఇంజనీరింగ్ స్ట్రీమ్, మే 8,9 తేదీలలో అగ్రికల్చర్ తరువాయి 6లో

కుంచెపోటు



15 రోజుల్లో నాన్‌బోర్డర్స్ హాస్టల్స్ ఖాళీ చేయాలి -ఒయు విసి 7



కాలిఫోర్నియా కాల్పుల్లో ముగ్గురు మృతి 15



బలవంతపు ఏకగ్రీవాలు చెల్లవు - ఎస్ఇసి నాగిరెడ్డి 6

చిన్న పంచాయతీలపై పార్టీల నజర్

- ఏకగ్రీవం కోసం ముమ్మర యత్నాలు
- 300 కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాలు 25
- 500లోపు జనాభా ఉన్న పంచాయతీలు 851
- 15వేలకుపైగా జనాభా ఉన్న పంచాయతీల సంఖ్య రెండు
- 2వేల జనాభా ఉన్న గ్రామ పంచాయతీలే కీలకం

మన తెలంగాణ/హైదరాబాద్ : త్వరలో జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో చాలా పంచాయతీలు ఏకగ్రీవం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అతి తక్కువ జనాభా ఉన్న గ్రామాలు గణనీయ సంఖ్యలో ఉండడంతో వాటిని ఏకగ్రీవంగా దక్కించుకునే ప్రయత్నాలు మొదలయ్యాయి. రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసం, ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలను పునర్విభన చేసింది. వాటి సంఖ్యను 12,751కు పెంచింది. ఇందులో కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీల సంఖ్య 4,380 కాగా, ఏజెన్సీ ప్రాంతాల్లో 1,311 పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల సంఖ్య భారీగా పెరిగినప్పటికీ చాలా పంచాయతీల్లో గ్రామ జనాభా 300 కూడా మించలేదు. మొత్తం గ్రామ జనాభానే 300 కంటే తక్కువగా ఉండడంతో ఓటర్ల సంఖ్య 210 నుంచి 230 వరకు ఉంటారు. ఇలాంటి పంచాయతీలు రాష్ట్రంలో 25 వరకు ఉన్నాయి. 300లోపు జనాభా ఉన్న చోట పంచాయతీలను 5 వార్డుల చొప్పున ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఒక్కో వార్డుల్లో ఓటర్ల సంఖ్య 50 మందికి మించే అవకాశం కూడా లేదు. అలాగే 500 జనాభా ఉన్న పంచాయతీల సంఖ్య 851 ఉన్నాయి. **300** నుంచి 500 వరకు జనాభా ఉన్న పంచాయతీల్లో 7 వార్డుల చొప్పున ఏర్పాటు చేశారు. దీంతో చిన్న పంచాయతీలతో పాటు అతి తక్కువ ఓటర్లు ఉన్న వార్డులను దాదాపుగా ఏకగ్రీవంగా చేసుకోవాలని రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ దృష్టి సారించాయి. ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికలను కూడా సిద్ధం చేసుకున్నాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా పంచాయతీల విభజన చేశారు. జనాభా 500 నుంచి 1000 వరకు ఉన్న పంచాయతీలు 4,197 ఉండగా, జనాభా 1001 నుంచి 2వేల వరకు ఉన్న పంచాయతీలు 4,564 ఉన్నాయి. అంటే 500 లోపు జనాభా నుంచి 2 వేల జనాభా ఉన్న గ్రామాల్లో సుమారుగా 10 వేల పంచాయితీలు ఉన్నాయి. దీంతో రాజకీయ పార్టీల దృష్టంతా ఈ పంచాయతీల పైనే కేంద్రీకృతమైంది. ఈ పంచాయతీలు అన్ని రాజకీయ పార్టీలకు కీలకంగా మారనున్నాయి. రెండు వేల నుంచి **3**వేల వరకు జనాభా ఉన్న గ్రామాల్లో 1,797 పంచాయతీలు ఏర్పాటు కాగా, 3001 నుంచి 4వేల వరకు జనాభా ఉన్న గ్రామాల్లో 714 పంచాయతీలు, 4,001 నుంచి 5వేల వరకు జనాభా ఉన్న గ్రామాల్లో 300 పంచాయతీలు, 5,001 నుంచి 6 వేల జనాభా ఉన్న గ్రామాల్లో 143 పంచాయతీలు, 6,001 నుంచి 7 వేల వరకు జనాభా ఉన్న గ్రామాల్లో 69 పంచాయతీలను ఏర్పాటు చేశారు. ఇక 7,001 నుంచి 8వేల వరకు జనాభా ఉన్న గ్రామల్లో 31 పంచాయతీలు, 8,001 నుంచి 9 వేల జనాభా ఉన్న గ్రామాల్లో **37** పంచాయతీలు, 9,001 నుంచి 10 వేల జనాభా ఉన్న గ్రామాల్లో 14 పంచాయతీలు, 10,001 నుంచి 11వేల జనాభా ఉన్న గ్రామాల్లో 7 పంచాయతీలు, 11,001 నుంచి 12 వేల జనాభా ఉన్న గ్రామాల్లో 9 పంచాయతీలు, 12,001 నుంచి 13 వేల జనాభా ఉన్న గ్రామాల్లో 10 పంచాయతీలు, 13,001 నుంచి 14 వేల జనాభా ఉన్న గ్రామాలను 5 పంచాయతీలు , 14,001 నుంచి 15 వేల జనాభా ఉన్న గ్రామాలను ఒక పంచాయతీగా, 15వేలకు పైనున్న జనాభా గల గ్రామాల్లో 2 పంచాయతీలుగా ఏర్పాటు చేశారు.



17న సహకార ఎన్నికలకు నోటిఫికేషన్!

- ఫిబ్రవరి రెండో వారంలో ప్రాథమిక సంఘాలకు పోలింగ్
- వచ్చే నెల 25వ తేదీకల్లా డిసిసిబిలు, డిసిఎంఎస్‌లు, టెస్కాబ్‌కు ఎన్నిక పూర్తి
- మొత్తం 12 వేల బూత్‌లు, 40 వేల మంది సిబ్బంది

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 17వ తేదీన నోటిఫికేషన్‌ను విడుదల కానుంది. ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖ రంగం సిద్ధం చేసింది. పంచాయతీ ఎన్నికలు ముగియగానే ఫిబ్రవరి రెండో వారంలో ఒకే రోజున 906 ప్యాక్స్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా)లకు ఎన్నిక నిర్వహించాలని నిర్ణయించింది. అదే రోజున ఓట్ల లెక్కింపును కూడా చేపట్టి గెలుపొందిన కమిటీని ప్రకటించనున్నారు. ఆ తరువాత వెంట, వెంటనే తొమ్మిది డిసిసిబిలు, తొమ్మిది జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలతో పాటు టెస్కాబ్‌లకు ఎన్నిక పూర్తి చేయనున్నారు. ఈ ప్రక్రియనంతా ఫిబ్రవరి 25వ తేదీకల్లా ముగించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కంటే ముందే ముగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణపై మెంబర్ల ఓటర్ల జాబితాను కూడా తుది దశకు చేరుకుంది. రెండు జిల్లాలు మినహా మిగతా అన్ని జిల్లాల నుంచి ఓటర్ల జాబితా ఎన్నికల అథారిటీకి అందింది. ఇందులో మొత్తం 18 లక్షల పైన ఓటర్లు ఉన్నారు. ఇంకా రెండు జిల్లాల నుంచి కూడా జాబితా వస్తే మొత్తం ఓటర్ల సంఖ్య 20 లక్షలకు చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. సహకారం సంఘంలో ఏడాది, అంతకంటే ఎక్కువ కాలం మెంబర్‌గా కొనసాగిన వారికే ఓటరుగా గుర్తించనున్నారు. పూర్తిస్థాయిలో అన్ని జిల్లాల నుంచి ఓటర్ల జాబితా రాష్ట్ర సహకార శాఖ రిజిస్ట్రార్ ఆమోదంకు పంపాల్సి ఉంటుంది. వీటన్నింటిపై రాష్ట్ర స్థాయిలో సహకార శాఖ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనుంది. ఆ తరువాత తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. రాష్ట్రంలో ఉన్న ప్యాక్స్‌లకు పర్సన్ ఇంఛార్జీలు పాలక వర్గాలుగా కొనసాగుతున్నారు. వాస్తవానికి గత ఏడాది జనవరిలో కొన్ని, ఫిబ్రవరిలో కొన్ని ప్యాక్స్‌లకు పదవీకాలం ముగిసింది. దీంతో ఫిబ్రవరి రెండోవారంలో ఎన్నికలను నిర్వహించే సమయానికి పర్సన్ ఇంఛార్జీల పాలనకు సరిగ్గా ఏడాది పూర్తవుతుంది. 50 మంది కంటే తక్కువ ఓటర్లు ఉన్న సొసైటీలకు చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా భద్రాచలం ప్యాక్స్‌కు చేతులెత్తే విధానంలోనే ఎన్నిక నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది.

12 వేల బూత్‌లు.. 40 వేల మంది సిబ్బంది

ప్యాక్స్ ఎన్నికలకు 12 వేల బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇందు కోసం దాదాపు 40 వేల మంది సిబ్బందిని వినియోగించుకోనున్నారు. వివిధ శాఖల ఉద్యోగుల ప్యాక్స్ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్నారు. ఎన్నికల ఏర్పాట్ల కోసం పంచాయతీ ఎన్నికల్లో తమ శాఖ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని ఇప్పటికే సహకార శాఖ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరింది.

శబరిమలలో మహిళలను అడ్డుకోవడం సిగ్గుచేటు


రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

మన తెలంగాణ/హైదరాబాద్: చట్టాలను గౌరవించి, మహిళా హక్కులను గుర్తించాలని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ (భారత జాతీయ మహిళా సమాఖ్య) ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం అభిప్రాయం వ్యక్తం చేసింది. హిమాయత్‌నగర్‌లో శనివారం ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో 'చట్టాలను గౌరవిద్దాం, మహిళా హక్కులను గుర్తిద్దాం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం రాష్ట్ర అధ్యక్షురాలు కళావతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మూకలు కావాలని శబరిమల ఆలయం విషయంలో రాద్ధాంతం చేస్తున్నారని వారు ఆరోపించారు. సుప్రీంకోర్టు శబరిమలలో మహిళలకు అనుమతి ఇచ్చినప్పటికి మతోన్మాద శక్తులు అడ్డుకోవడం సిగ్గుచేటని వారు విమర్శించారు.

న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ నేత

వీరభద్రం అరెస్ట్

ఎస్ఎల్ఆర్, తూటాలు, ల్యాప్‌టాప్ స్వాధీనం



మనతెలంగాణ/మహబూబాబాద్ ప్రతినిధి: న్యూడెమోక్రసీ పెద్ద చంద్రన్న గ్రూప్ అజ్ఞాత దళ నేత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యుడు సింగరబోయిన వీరభద్రంను శనివారం అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్‌పి నంద్యాల కోటిరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాలులో ఆయన మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో వివిధ ప్రాంతాల్లో అజ్ఞాతంలో పనిచేసి 4 హత్యకేసులు 2 పోలీసు ఎదురు కాల్పుల కేసులు, అనేక బలవంతపు వసూళ్ళ, కాంట్రాక్టర్లను బెదిరించిన కేసుల్లో నేరస్థుడుగా వీరభద్రం ఉన్నారన్నారు. బయ్యారం మండలం బాలాజీపేటకు చెందిన సింగరబోయిన వీరభద్రం అలియాస్ రామన్నపై 6 ప్రధాన కేసుల్లో నిందితుడన్నారు. శనివారం ఉదయం డోర్నకల్ మండలం వెన్నారం గ్రామం చెరువు కట్ట వద్ద అశోక్, బెజ్జం ప్రతాప్, ఇతర దళ సభ్యులతో కలిసి తుపాకులు దాచిపెట్టి సాధారణ దుస్తులతో వచ్చి గ్రామ పంచాయితీ ఎన్నికల గురించి కొంత మంది ఎన్‌డి పార్టీకి చెందిన గ్రామస్తులను పిలిపించుకుని సమావేశమయ్యారు. సమాచారం మేరకు డోర్నకల్ పోలీసులు సిఐ శ్యాంసుందర్, ఎస్ఐ ఎ.రవీందర్ సిబ్బంది స్పెషల్ పార్టీతో వెళ్ళి రామన్నను అరెస్ట్ చేయగా మిగతావారు పరారైనట్లు ఎస్‌పి తెలిపారు. త్వరలోనే పరారైనవారిని కూడా పట్టుకుంటామని ఆయన తెలిపారు. రామన్నను పట్టుకున్న సిఐ శ్యాం సుందర్, ఆయన బృందం, అలాగే ఇన్వెస్టిగేషన్‌లో సహకరించిన సిఐ ముత్తిలింగయ్య స్పెషల్ పార్టీ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్‌పి అభినందించారు. వారికి తగిన బహుమతి ఇవ్వనున్నట్లు ఎస్‌పి ప్రకటించారు.

జనశక్తి దళ సభ్యుడి అరెస్టు



మనతెలంగాణ/జగిత్యాలటౌన్: జనశక్తి చెందిన ఓ దళ సభ్యుడిని శనివారం జగిత్యాల పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఓ పిస్టల్‌తో పాటు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా అడిషనల్ ఎస్‌పి మురళీధర్ వెల్లడించారు. శనివారం పూడురు వద్ద వాహనాల తనిఖీలో భాగంగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని విచారించామన్నారు. సిరిసిల్లలోని గణేష్‌నగర్‌కు చెందిన వావిలాల సాయికుమార్ అలియాస్ భరత్, అలియాస్ మహేష్ జనశక్తి పార్టీలో దళసభ్యుడిగా పని చేస్తున్నాడని తెలిపారు. ఫిస్టల్‌తో బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేయడం కోసం భరత్ జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. భరత్‌పై సిరిసిల్లలో ఒక కేసు నమోదైందన్నారు. సమా వేశంలో డిఎస్‌పి వెంకటరమణ, మల్యాల సిఐ నాగేందర్ గౌడ్ తదితరులున్నారు.



అర్థవంతమైన శబ్దమే 'అక్షరం'

చినజీయర్ స్వామీజీ

మనతెలంగాణ, సిటీబ్యూరో : తిరుప్పావై 5 పాశురాలు ఒక భాగం, 5 పాశురాలు మరో భాగంగా ఆండాళ్ విభజించారని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చిన జీయర్ స్వామీజి వెల్లడించారు. నగరంలోని నందినీ హిల్స్‌లో మైహోం గ్రూపుల అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు నివాస ప్రాంగణంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో జీయర్ స్వామీజి తన ప్రవచనాలతో ఆద్యాత్మిక భావాలను వెల్లడించారు. భగవంతుడిని చేరడానికి పెద్దలు చేపే మార్గాన్ని ఉపదేశించే ఆచార్యుడు, ఆచార్యుడు అందించే మంత్రం, ఆ మంత్రం యొక్క అర్థం, భగవంతుడిని మనం సేవించే ముందర ప్రసన్నం చేసుకునేందుకు చేసే పురుష కార్యమును ఆండాళ్ ఐదు పాటల్లో వివరించినట్టు ఆయన తెలిపారు. మరో ఐదు పాటల్లో భగవంతుడిని శరణాగతుడిని చేసుకునేది తెలియపరిచనట్టు ఆయన చెప్పారు. భగవంతుడిని తెలియచేయడానికి ఆచార్యుడు మూడు మంత్రాలను ఉపదేశించాడని, అవి ''తిరు మంత్రం, ద్వ్యయ మంత్రం, చరమ శ్లోకమ''నేవి మూడు మంత్రాలున్నాయని ఆయన వెల్లడించారు. తిరు మంత్రం ఎలా దాని తత్వ అర్థాని తెలియజేస్తుందని, అంబరమే అనేటువంటి పాశురం, ద్వయమంత్రంలో పూర్వ భాగాన్ని వివరించారని, ఉందుమలగిత్త అనే పాశురంలో వివరించినట్టు, ద్వయమంత్రమంటే... రెండు మంత్ర భాగముల కలియకనే ద్వయమంత్రమని, ఇందులో రెండు వాక్యాలుంటాయి. మొదటి వాక్యం.. స్వామియొక్క పాదములనే ఉపాయమని ఆశ్రయిస్తున్నా.. ''శ్రీమన్నారయణ చరణవు, శరణం పరపతియే..'' ''శ్రీమతే నారాయణాయ నమ:'' ఇవి రెండు వ్యాక్యాలని ఆయన వెల్లడించారు. వీటిలో మొదటిది సాధనమేమిటని, రెండవది సాధించేదిమిటనేది తెలియపరుస్తుందని ఆయన పేర్కొన్నారు. మంత్రాలను వేదాలు అందిస్తాయని, ద్వయ మంత్రం, అష్టాక్షర మంత్రం కూడా వేదాల్లోనివేనని, 'ఏతద్వై నారాయణస్య అష్టాక్షరం పదం' అని



వెల్లడించారు. 'ఓం నమ: నారాయణేతి' ఇదీ అష్టాక్షర మంత్రమని జీయర్ స్వామీజి తెలిపారు. ఓంకారం ఎన్ని అక్షరాలంటే 'అ ఉ మ్' ఈ మూడు అక్షరాలు కలిపి ''ఓం'' అని ఆయన స్పష్టంచేశారు. పదమంటే.. స్వతంత్రంగా ఒక అర్థమివ్వగలిగేదని అర్థమని, 'అక్షరం' అనేది అర్థవంతమైన శబ్దమే 'అక్షరం' అని, 'వాక్యం' అంటే.. పరస్పరం ఏర్పడే ప్రశ్నలకు ఒకదానికొకటి సమాధానాన్ని అందించుకుంటూ ఒక కూర్పులో ఉండే పదముల సముదాయం అని ఆయన విశదీకరించారు. ఓంకారంలో ఆ అనేది ఒక పదం, 'ఉ' అర్థాన్నివగలిగే పదం, 'మ్' అనేది ఒక పదం వీటి కలయికతో వచ్చినదే 'ఓం'ను అక్షరం అనవచ్చని, పదం, వ్యాఖ్యం అని కూడా అనవచ్చని జీయర్ స్వామీజి తెలిపారు. భగవద్గీతలో 'ఓం' వేదంను చెప్పుతుందని, 'ఓం' అంటే జీవుడు అని, ఓంకారం మంత్రమేనని కూడా ఆయన తెలిపారు. ప్రతి అక్షరం మన చుట్టూ ఉండే ప్రకృతి మీద ఆధిపత్యం ఉంటుందని, ప్రకృతిలో ఏది జరిగినా దాని ప్రభావం ఆ ప్రకృతిలో ఉంటుందని ఆయన తెలిపారు. ఓంకారానికి ఒక శబ్ధం ఉన్నదని, దానిని ఎలా వాడాలో ఒక పద్ధతి ఉందని, 'ఓం' ఒక మాత్ర, రెండు మాత్రలు, మూడు మాత్రల మేరకు మాత్రమే పలుకాలని వేదం చెప్పిందని, ప్రకృతిలో ఉండే శబ్ధాలు మారవని, ఒక సారి చిటికె వేసే కాలాన్ని ఒక మాత్ర, రెండుసార్లు సాగదీస్తే రెండు మాత్రలని, మూడు సార్లుగా సాగదీస్తే మూడు మాత్రలని. ఓకి మాకి మధ్య మాత్రలను దాటి సాగదీయరాదని, ఓంకారా నాదాన్ని సాధన చేయాలని, మకారం తర్వాత ఉండే నాదాన్ని సాధన చేయాలని జీయర్ స్వామీజి విశదీకరించారు.



16 ఎంపి స్థానాలూ టిఆర్ఎస్‌వే

డాక్టర్ రాకేష్ చిరుమిల్ల

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో స్వార్థ రాజకీయాలకు, కుట్రలకు కేరాఫ్ అడ్రస్ అయిన చంద్రబాబును జాతీయ స్థాయిలో 'పప్పు' రాజకీయం చేస్తున్న రాహుల్‌గాంధీకి తెలుగు ప్రజలు మరోసారి బుద్ధిచెప్పడానికి సిద్దంగా ఉన్నారని రాష్ట్ర టెక్నాలజి సర్వీసెస్ ఛైర్మన్ డాక్టర్ రాకేష్ చిరుమిల్ల అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శనివారం ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఆయన మీడియాతో మాట్లాడుతూ పై విధంగా వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజల మనసును గెలిచి రెండవసారి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన కెసిఆర్‌ను ఢీకొట్టే సత్తా ఎవరికీ లేదని అన్నారు. కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరు వినగానే జాతీయ పార్టీలకు భయం పట్టుకుందని, ముఖ్యంగా ఇటీవల జట్టు కట్టిన చంద్రబాబు, రాహుల్ గాంధీకి కునుకులేకుండా చేస్తోందని పేర్కొన్నారు. చంద్రబాబుది బాబాయ్ కాంగ్రెస్, రాహుల్‌గాంధీది అబ్బాయ్ కాంగ్రెస్‌లా మారిందని ఆయన అభివర్ణించారు. బాబాయ్ కాంగ్రెస్, అబ్బాయ్ కాంగ్రెస్‌ను తెలుగు ప్రజలు తిరస్కరిస్తారని, వారికి ఘోర పరాభవం తప్పదని అన్నారు. అన్ని జాతీయ సంస్థల సర్వేల్లో టిఆర్ఎస్ పార్టీ 16 లోక్‌సభ స్థానాలు గెలుస్తుందని చెబుతున్నారని పేర్కొన్నారు. తమ అధినేత కెసిఆర్ ప్రారంభించిన ఫెడరల్ ఫ్రంట్ జాతీయ స్థాయిలో సంచలనం కాబోతుందని డాక్టర్ రాకేష్ వ్యాఖ్యానించారు.

రైతు సమితుల సభ్యుల రాజీనామాలు!

సర్పంచ్‌లుగా పోటీకి సిద్ధమవుతున్న కొందరు

భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకూడదనే రాజీనామా

మన తెలంగాణ/హైదరాబాద్: రైతు సమన్వయ సమితుల సభ్యులు కొందరు ఆ నామినేటేడ్ పదవుల సభ్యత్వానికి రాజీనామా చేసేందుకు సిద్ధపడుతున్నారు. వారి రాజీనామాలను ఆమోదించాలని ఆదేశిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారధి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు శనివారం ఆదేశించారు. పలువురు సభ్యులు పంచాయతీ ఎన్నికలలో పోటీకి నిలుస్తుండటం, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇతర పార్టీలలో చేరడంతో రాజీనామా చేసేందుకు ముందుకు వస్తున్నట్లు తెలిసింది. గత ఏడాది రైతుల్లో చైతన్యం తీసుకువచ్చి, గ్రామాల్లో రైతులకు పలు రకాలుగా ఉపయోగపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసింది. గ్రామ, మండల, జిల్లాల వారీగా రైతు సమన్వయ సమితుల్లో సభ్యులను ఎంపిక పద్ధతి ద్వారా తీసుకున్నారు. గ్రామ రైతు సమితుల్లో 15 మంది, మండల, జిల్లా సమన్వయ సమితుల్లో 24 మంది చొప్పున సభ్యులను ఎంపిక చేసి నియమించారు. సంబంధిత నియోజకవర్గాల ఎంఎల్‌ఏలు సూచించిన వారి పేర్లనే, జిల్లా కలెక్టర్లకు పంపి ఆమోదించేలా చేశారు.ఇందులో పట్టాదారులైన రైతులకే స్థానం కల్పించారు. గ్రామ రైతు సమితుల్లో ఎంపిక చేసిన సభ్యులను మండల, జిల్లా రైతు సమితులకు ఎంపిక చేశారు. వీరిలో చాలామంది అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారు. వారిలో కొందరు ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లుగా పోటీకి దిగుతున్నారు. అందులో భాగంగానే నామినేటేడ్ పోస్టులో ఉండి బరిలోకి దిగితే భవిష్యత్‌లో ఏమైనా ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశ్యంతో వారితో రాజీనామా చేయిస్తున్నట్లు తెలిసింది. కొన్నిగ్రామాల్లో ఇప్పటికే రైతు సమితి సభ్యులు, కో ఆర్డినేటర్‌గా ఉన్నారని మళ్లీ వారికే సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే ఎలా అని అడుగుతుండటంతో ఈ రకంగా చక్కబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే వీలైనన్ని గ్రామాలు ఏకగ్రీవం చేయాలని టిఆర్ఎస్ భావిస్తోంది. కొన్నిచోట్ల రెబల్స్‌గా పోటీలో దిగాలనుకునే వారికి రైతు సమన్వయ సమితి నామినేటేడ్ పోస్టును ఇచ్చే క్రమంలో కొందరితో రాజీనామాలు చేయిస్తున్నట్లు సమాచారం. మండల వ్యవసాయాధికారి గ్రామ రైతు సమన్వయ సమితి సభ్యులు, కో ఆర్డినేటర్ రాజీనామాలు ఆమోదించి, ప్రొసిడింగ్స్ జారీ చేయాలని వ్యవసాయ శాఖ ఆదేశించింది. అలాగే సహాయ వ్యవసాయ సంచాలకులు మండల సమన్వయ సమితి సభ్యులు, కో ఆర్డినేటర్‌ల రాజీనామాలు, జిల్లా వ్యవసాయాధికారి జిల్లా సమన్వయ సమితుల సభ్యుల రాజీనామాలు ఆమోదించి ప్రొసిడింగ్స్ ఇవ్వాలని పేర్కొన్నారు.



టిఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కెటిఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర టిఆర్ఎస్ నేత, వైశ్యఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా



రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ శనివారం నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవితను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు

ఇతర దేశాలకు పండ్లు, కూరగాయలు : పార్థసారథి

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రం నుంచి ఇతర దేశాలకు పండ్లు, కూరగాయల ఎగుమతికి అవసరమైన చర్యలు తీసుకోవడంపై ఉద్యాన శాఖ దృష్టిసారించింది. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉన్న సమీకృత ప్యాక్ హౌస్‌లో ఆధునిక సదుపాయాల కల్పన, అప్‌గ్రేడ్ చేయడంపై సమీక్షించారు. రాష్ట్రం నుండి ఇతర దేశాలకు పండ్లు, కూరగాయలు, పూలు ఎగుమతి చేయటానికి వేపర్ హీట్ ట్రీట్మెంట్ అవసరమని భావించారు. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ సంచాలకులు ఎల్. వెంకట్రామ్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జానారెడ్డి, షబ్బీర్ ఆలీకి ఇంటెలిజెన్స్ నోటీసులు

మన తెలంగాణ/హైదరాబాద్ః రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు జానారెడ్డి, షబ్బీర్ ఆలీకి రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ విభాగంఅధికారులు శనివారం నోటీసులు జారీచేశారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు ఉపయోగించున్నందుకు నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన రూ. 9.86 లక్షలను చెల్లించాలని తెలంగాణ ఇంటెలిజెన్స్ వింగ్ అధికారులు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో వారిద్దరూ తమకు ఉన్న ప్రోటోకాల్ ప్రకారం ప్రభుత్వం కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వెహికల్ వినియోగించుకున్నారని, ప్రయాణించిన దూరం, డ్రైవర్‌కు ఇవ్వాల్సిన అలవెన్సులన్నీ కలుపుకుని లెక్కగట్టినట్లు పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న జానారెడ్డి 83 రోజుల పాటు (11,152 కి.మీ.) బుల్లెట్ ప్రూఫ్ ఫార్చునర్ (నెం. టిఎస్ 09పిఎ 1653) వాహనాన్ని వాడినందుకుగాను ఒక్కో కిలోమీటర్‌కు రూ. 37 చొప్పున, డ్రైవర్‌కు రోజువారీ అలవెన్స్ (బత్తా)రూ. 100 చొప్పున మొత్తం 4,20,924 చెల్లించాలంటూ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఐజి ఈ నెల 2వ తేదీన రాష్ట్ర పిసిసి కార్యదర్శికి జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఎంఎల్‌సిగా ఉన్న షబ్బీర్ ఆలీ 90 రోజుల పాటు (12,728 కి.మీ.) ఫార్చునర్ బుల్లెట్ ప్రూఫ్ వాహనం (నెం.టిఎస్ 09పిఎ 1654) ఉపయోగించినందున కిలోమీటర్‌కు రూ.37. చొప్పున, డ్రైవర్ బత్తా రూపంలో రోజుకు రూ. 100 చొప్పున మొత్తం రూ.4,79,936 చెల్లించాలని ఆ నోటీసులో తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు జానారెడ్డి, షబ్బీర్ ఆలీ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు వాడారు అధికారులు పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలి



- టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్
- బిఎల్ఆర్ ఫౌండేషన్ ద్వారా చెక్కుల పంపిణీ
- సంఘటిత కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు

మన తెలంగాణ/హైదరాబాద్: అన్నార్తులు, పేదలు, కులవృత్తుల్లో జీవించేవారిని సమిష్టిగా ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అమలుచేసిన ఏ పథకమైనా మానవీయ కోణంలో ప్రజాసంక్షేమం ప్రతిబింబించే విధంగా ఉంటాయని చెప్పారు. రైతుబంధు, ఆసరా పింఛన్లు, రైతు బీమా తదితర పథకాలన్నీ ఇలాంటి స్వభావంతో కూడుకున్నవేనని గుర్తుచేశారు. భువనగిరి ఎంపి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ పార్లమెంట్ సభ్యుడిగా తన నియోజకవర్గ అభివృద్ధికి పాల్పడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందువరసలో ఉన్నారని కెటిఆర్ ప్రశంసించారు. బిఎల్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పలు ప్రమాదాల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలకు కెటిఆర్ చేతుల మీదుగా చెక్కుల పంపిణీ జరిగింది. ఎంపి బూర నర్సయ్యగౌడ్ తన తల్లి దండ్రుల పేరుమీద స్థాపించిన ఈ ట్రస్టులో లక్షా 17 వేల సభ్యులు ఉన్నారు. ఇప్పటివరకు 60 మంది ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో మరో 10 మంది రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు తలా రూ.5 లక్షల చొప్పున చెక్కులను కెటిఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ మానవీయ కోణంలో ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపు ఇచ్చారు. బూర నర్సయ్య ఎప్పటికప్పుడు నవీన ఆలోచనలతో ముందుకు వస్తారని ప్రశంసించారు. గీత కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన విజ్ఞప్తి మేరకే ప్రమాదవశాత్తు మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షలు ప్రభుత్వం అర్థిక సహాయం చేస్తోందని చెప్పారు. తన నియోజకవర్గ పరిధిలోని బీబీనగర్‌లో ఎయిమ్స్ వచ్చిందంటే దాని వెనక జరిగిన కృషిలో సింహభాగం బూరనర్సయ్యగౌడ్‌దేనని గుర్తుచేశారు. ప్రభుత్వం అసంఘటిత రంగంలో ఉన్న డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, కర్షకుల కుటుంబాలకు ప్రమాద బీమా ఇస్తుందని గుర్తుచేశారు. పార్టీ కార్యకర్తలకు ప్రమాద బీమా వర్తించే విధంగా పార్టీపరంగా కార్యక్రమాలు రూపొందించిన అంశాన్ని ఆయన గుర్తుచేశారు. కుటుంబంలోని పెద్ద చనిపోతే ఆ కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను మానవీయ కోణంలో నిర్వహిస్తోందని చెప్పారు. ఇటీవల ఎంపి బూర నర్సయ్య 'నీరా' పరిశ్రమపై ఇచ్చిన ఆలోచనను అమల్లోకి తీసుకువచ్చేవిధంగా చర్చలు జరుగుతున్నాయన్నారు. నీరా పరిశ్రమను ఏర్పాటు చేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడక ముందు శాసన సభ్యుడిగా సిరిసిల్ల నేతన్నలను ఆదుకున్న విషయాన్ని గుర్తుచేశారు. కెసిఆర్ ఫౌండేషన్ ద్వారా నేతన్నలను ఆదుకున్నానని కెటిఆర్ గుర్తుచేశారు. రైతు బీమా పథకం దేశానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. రైతు బీమాను 38 నుంచి 40 లక్షల రైతులకు వర్తిస్తుందన్నారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తెలంగాణ దేశంలో అగ్రగామిగా నిలిచిందని గుర్తు చేశారు. టిఆర్ఎస్ నాయకుడు వేముల వీరేశంతో కలిసి కెటిఆర్ 'ఉద్దీపన లక్ష్యం' క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

కన్నా! నేనున్నాను గదరా..



గీత కార్మికుడైన తండ్రిని కోల్పోయిన ఒక చిన్నారి తెలంగాణ భవన్‌లో కొద్దిసేపు అందరి దృష్టిలో పడ్డాడు. స్వయంగా కెటిఆర్ ఆ చిన్నారిని ఎత్తుకుని కొద్దిసేపు ముద్దుముద్దు ముచ్చట్లతో ముంచెత్తారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని చిన్నరావులపల్లి గ్రామానికి చెందిన కాసుల వర్షిత్‌రెడ్డి అనే ఏడేళ్ళ చిన్నారి కొన్ని నెలల క్రితం ఒక ప్రమాదంలో తన తండ్రిని కోల్పోయాడు. కుటుంబ పెద్దగా ఉన్న తండ్రి చనిపోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న ఎంపి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ తన తల్లిదండ్రుల పేరు మీద నిర్వహిస్తున్న 'బిఎల్ఆర్ ఫౌండేషన్' ద్వారా ఆ చిన్నారి తల్లికి ఐదు లక్షల రూపాయల మేర చెక్కు రూపంలో ఆర్థిక సాయం అందించారు. ప్రతీ ఏటా ఈ తరహా సాయం చేస్తున్న ఎంపి నర్సయ్యగౌడ్‌ను అభినందించడంతో పాటు వర్షిత్ అనే ఏడేళ్ళ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు. కెటిఆర్ స్వయంగా తన మొబైల్ ఫోన్‌లో ఆ చిన్నారితో సెల్ఫీ దిగారు. ఆ చిన్నారి ఇష్టాయిష్టాలను తెలుసుకుని కొద్దిసేపు సంతోషపెట్టారు. చిన్నారి చదువుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని భరించే విషయంలో ఎంపి బూర నర్సయ్యగౌడ్‌కు కెటిఆర్ కొన్ని సూచనలు చేశారు. వర్షిత్ తల్లితో సైతం మాట్లాడిన కెటిఆర్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నల్లగొండ శాసనసభ్యుడితో పాటు నకిరేకల్ మాజీ ఎంఎల్‌ఏ వేముల వీరేశం, ఆ జిల్లాకు చెందిన పలువురు పార్టీ కార్యకర్తలందరి సమక్షంలో వర్షిత్‌తో కెటిఆర్ ముచ్చట్లాడడం ఆసక్తికరంగా మారింది

'గో'దిత్యనాథ్ పశుసుంకం!

సంపాదకీయం

తలకు రోకలి చుట్టమన్న పిచ్చివాడికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్య నాథ్‌కు తేడా లేదనిపిస్తున్నది. ఆయనలో మతోన్మాదం శృతిమించిపోయింది. గో పిచ్చి పరాకాష్ఠకు చేరుకున్నది. గోవధ నిషేధం ద్వారా వట్టిపోయి నిరుపయోగంగా మారిన వీధి ఆవుల బెడదను అపరిమితంగా సృష్టించిన ఆయన ప్రభుత్వం ఇప్పుడు ఆ వ్యర్థ గో సమూహాలకు ప్రత్యేక షెడ్‌లు, షెల్టర్ల నిర్మాణం కోసం రూ. వంద కోట్లు కేటాయించి గో రక్షణ సుంకం ద్వారా దానిని జనం పళ్లూడగొట్టి వసూలు చేయాలని నిర్ణయించింది. ఆ విధంగా అసలే పేదరికంలో మగ్గుతున్న యుపి ప్రజల మీద చెప్పనలవికాని భారాన్ని మోపింది. ప్రజల బాగోగులు చూడవలసిన ప్రభుత్వం ఆ బాధ్యతను గాలికి వదిలి పశువుల సేవలో నిమగ్నం కావడం ప్రజాస్వామ్య విరుద్ధ నిర్వాకమని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు.

హిందుత్వ ప్రయోగ శాలలో కొత్తకొత్త అమానుష పోకడలకు పురుడు పోయడంలో ఆరితేరిన మతోన్మత్త సంస్థలు భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో సృష్టిస్తున్న విద్వేష వాతావరణం గురించి వివరించనవసరం లేదు. మనుషుల కంటే మతాచార, సంప్రదాయాలకు అందుకు సంబంధించిన అంధ విశ్వాసాలకు విశేష ప్రాధాన్యమిస్తున్నాయి. ఇందుకోసం సాటి మనుషులను చంపడానికి కూడా వెనుకాడని హంతక మూకలు బయలుదేరి నెత్తుటి నాట్యం చేస్తున్నాయి. నిస్సహాయులయిన దళితులను, మైనారిటీలను బలి తీసుకుంటున్నాయి. అయినా కేంద్రంలోని, రాష్ట్రాలలోని పాలక కమలనాథులు పల్లెత్తు మాట అనడం లేదు. దీనివల్ల దేశంలో ప్రతి పౌరుడికి గల జీవన హక్కు ఎంతగా బలయిపోతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు యుపిలో యోగి ఆదిత్య నాథ్ ప్రభుత్వం విధించిన గో రక్షణ సుంకం మధ్య యుగాల నాటి ముస్లిం పాలకులు వసూలు చేసిన జిజియా పన్నును గుర్తు చేయడం సహజం. ముస్లిమేతరుల నుంచి వారు ఆ పన్నును వసూలు చేసి తీవ్ర వ్యతిరేకతను చవిచూశారు.

గో వధ నిషేధం వల్ల కబేళాలు మూతపడి ఆ వ్యాపారం మీద ఆధారపడి బతుకుతూ వచ్చిన వారంతా వీధిన పడ్డారు. వ్యవసాయదారులు వాటిని వధ్యశాలలకు అమ్ముకునే వీలులేక, పోషించే స్థోమత కరువై వీధిలో వదిలిపెడుతున్నారు. అవి పెరుగుతున్న పచ్చని పంటలను కూడా మేసేస్తున్నాయి. రైతులకు కష్టాలు కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని రెండు గ్రామాల ప్రజలు వీధి ఆవులను పట్టుకొని పాఠశాలల్లోకి పంపి తాళాలు వేయడం ప్రారంభించారు. అందుకోసం అక్కడ చదువుకుంటున్న పిల్లలను బయటకు తరిమేశారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తెస్తూ పశ్చిమ యుపి ప్రజలు ఇటీవల వారం రోజులపాటు ఆందోళన నిర్వహించారు. దీనితో ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఈ సుంకం విధించడానికి నిర్ణయం తీసుకున్నది. గత మంగళవారం నాటి మంత్రి వర్గ సమావేశంలో మద్యం సహా అనేక వస్తువులపై, వ్యాపారాలపై 0.5 శాతం గో రక్షక సుంకాన్ని యుపి ప్రభుత్వం వేసింది. దారి పన్ను మీద, మార్కెట్ యార్డుల మీద కూడా సుంకం విధించింది.

విద్య మీద ప్రభుత్వాలు స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) లో 4 శాతం కంటే తక్కువ, ఆరోగ్యంపై 1 శాతం మాత్రమే ఖర్చుపెడుతున్న దేశంలో ప్రజల పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో స్పష్టపడుతున్నది. ఉత్తరప్రదేశ్‌లోనైతే విద్య, వైద్యరంగాలు అత్యంత దారుణ స్థితిలో ఉన్నాయి. అటువంటి నేపథ్యంలో పశువుల రక్షణకంటూ కోట్లాది రూపాయలు కేటాయించడంలోని విజ్ఞత ఎంతైనా ప్రశ్నించదగినది. హిందుత్వ ఓటు బ్యాంకును పెంచుకోడం ద్వారా కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ సంపాదించుకున్న ఎదురులేని అధికారాన్ని రుచి మరిగిన బిజెపి పాలకులు, వారి వెన్నుదన్ను ఆర్‌ఎస్‌ఎస్ అదే వ్యూహాన్ని తుదికంటా అవధులు మీరి ప్రయోగించడం వల్ల రాజకీయంగా మరింత లాభపడవచ్చునని అనుకుంటున్నట్టు ఆదిత్య నాథ్ ప్రభుత్వం విధించిన గో రక్షక సుంకం వెల్లడిస్తున్నది. అయితే ఎంత మత మౌఢ్యం పేరుకుపోయిన ప్రజలైనా తమ బతుకులకు, ప్రాణాలకు అగ్రతర ప్రాధాన్యమిచ్చి ఆ తర్వాతే విశ్వాసాలకు విలువ ఇస్తారు. ఈ సూక్ష్మాన్ని గ్రహించలేక అవధులు మీరిన మత పిచ్చిని రెచ్చగొట్టడం వల్ల బిజెపి ఎదురు దెబ్బలు తినకతప్పదు. ఇటీవల చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఎన్నికలలో చావు దెబ్బతిన్న తర్వాత కూడా దానికి జ్ఞానోదయం కలగలేదని యుపి ఉదంతం చాటుతున్నది.

రైతుకు ప్రాంతీయ పార్టీల ఊరట


ఎన్నికలు వచ్చిన ప్రతిసారి భారతదేశంలో సగటు మనిషి మహారాజైపోతాడు. కామన్ మ్యాన్ అనే వాడే దేశానికి వెన్నెముక అన్నట్లు పార్టీలు మాట్లాడ్డం మొదలవుతుంది. కాని ఇదంతా మున్నాళ్ళ ముచ్చటే. ఎన్నికలు ముగిసిన తర్వాత పార్టీలు ఓటర్లను మరిచిపోతాయి. ఓటర్లు మళ్ళీ ఎన్నికల కోసం ఎదురుచూపుల్లో గడిపేస్తాడు. ఇప్పుడు మళ్ళీ ఎన్నికల సీజను వచ్చింది. ఓటర్లను ఆకర్షించడానికి రాజకీయ పార్టీలు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ భారీగా రుణాల మాఫీ ప్రణాళికలతో ముందుకు పోతోంది. మరోవైపు ఎన్‌డిఎ పెద్దన్న బిజెపి కూడా భారీ సంక్షేమ పథకాలు, ఓటర్లను ఆకర్షించే తాయిలాలు సిద్ధం చేస్తున్నట్లువార్తలు వస్తున్నాయి. అచ్ఛేదిన్ వచ్చేసినట్లే కనబడుతున్నాయి.

వ్యవసాయరంగానికి అచ్ఛేదిన్ చాలా చాలా అవసరం. నిజానికి ఆక్సిజన్‌పై నెట్టుకు వస్తుంది వ్యవసాయ రంగం. వ్యవసాయ సంక్షోభం, రైతు సమస్యలే ఉత్తరాది మూడు రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వాలను కుప్పకూల్చాయి. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వాలు ఇచ్చిన హామీ ప్రకారం రుణాలు రద్దు చేస్తుంటే, ఎన్నికలను ఎదుర్కోవలసిన ప్రభుత్వాలు కొత్త స్కీములు ఆలోచిస్తున్నాయి. నిజానికి రుణమాఫీలు ఒక రాజకీయ డైలమాలా తయారయ్యాయి. రుణాలు రద్దు చేయడం వల్ల పెద్దగా ప్రయోజనమేమీ లేదు. దాని వల్ల రైతుల సమస్యలు పరిష్కారం కావు. కాని రుణమాఫీ ప్రకటించకపోతే రైతు వ్యతిరేక ప్రభుత్వం అనే ముద్ర పడుతుంది.



రైతులను దూరం చేసుకుంటే రాజకీయంగా ఎంత నష్టమో ఇప్పుడు పార్టీలకు బాగా అర్థమయ్యింది. అందువల్ల సార్వత్రిక ఎన్నికలకు ముందు అటు కాంగ్రెస్, ఇటు బిజెపి రెండు పార్టీలు రైతు అనుకూల విధానాలు, రైతు సంక్షేమ పథకాలతో ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. అయితే ఈ జాతీయ పార్టీల కన్నా కొన్ని ప్రాంతీయ పార్టీలు రైతు సంక్షేమానికి అద్భుతమైన పథకాలు అమలు చేసి చూపిస్తున్నాయి.

అన్నింటికన్నా ముందు చెప్పుకోవలసింది తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు పథకం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మిగిలిన నాలుగు రాష్ట్రాల్లో పాలకపక్షం ఓటమి చవిచూసింది కాని తెలంగాణాలో తెరాస ప్రభుత్వం మరింత మెజారిటీతో గెలిచింది. రైతు సంక్షేమ పథకాలు ఎలాంటి గొప్ప విజయాలు సాధిస్తాయో చెప్పడానికి తెలంగాణ మంచి ఉదాహరణ. ఆగస్టు 2018లో ఈ స్కీమును ప్రవేశపెట్టారు. ప్రారంభంలో కొంత అయోమయం కొనసాగినా తర్వాత ఈ స్కీము గొప్పగా అమలైంది. సాగుబడికి కావలసిన ప్రాథమిక పెట్టుబడి రైతు చేతికి దొరికే పథకమిది. ఎకరానికి 4000 రూపాయలు రైతుకు అందజేయడం ప్రారంభించారు. దీనివల్ల విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు వగైరా ఖర్చులకు అప్పు చేయవలసిన అవసరం లేకుండా పోయింది. ఈ సహాయం అందజేసే ముందు రైతుకు సహాయం అవసరమా? ఏ పంట వేస్తున్నాడు? ఎంత వేస్తున్నాడు? వగైరా ప్రశ్నల తతంగమేమీ లేకుండా ప్రత్యక్షంగా రైతు చేతికి సొమ్ము అందేలా చూశారు. ఇది నిజానికి రైతుకు కనీస ఆదాయ పథకం వంటిది. గిట్టుబాటు ధర సరిగా నిర్ణయిస్తే రైతుకిక కావలసిందేమీ లేదు. రైతును అన్ని సమస్యల నుంచి బయటపడేయడమే అవుతుంది.



తమిళనాడులో అన్నాడిఎంకె ప్రభుత్వం అవినాషి అథికదవు ఇర్రిగేషన్ స్కీము ప్రారంభించింది. ఇది ఆరు దశాబ్దాలుగా రైతుల డిమాండ్. రైతుల సాగునీటి అవసరాలను తీర్చే ఈ స్కీము వల్ల చాలా సమస్యలు పరిష్కారమైనట్లేనని రైతు సంఘాలు భావిస్తున్నాయి. రానున్న ఎన్నికల్లో అన్నాడిఎంకె పార్టీకే తమ మద్దతు ఉంటుందని రైతు సంఘాలు కొన్ని ఇప్పటికే ప్రకటించాయి. కేంద్ర ప్రభుత్వ సహాయం లేకపోయినా స్వంతంగా ఈ భూగర్భ జలాల పథకాన్ని తమిళనాడు ప్రభుత్వం ప్రారంభించింది.

ఒడిశా ప్రభుత్వం కూడా పదివేల కోట్ల రూపాయల సమగ్ర రైతు అభివృద్ధి పథకాన్ని ప్రకటించింది. ఆసక్తికరమైన విషయమేమంటే ఇందులో రైతు రుణాల మాఫీ లేదు. రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులందరి సంక్షేమానికి ఈ పథకం ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. ఈ పథకం పేరు కాలియా (KALIA) కృషక్ అసిస్టెన్స్ ఫర్ లైవ్లీ హుడ్ అండ్ ఇన్‌కం ఆగ్మెంటేషన్ స్కీమ్. ఒడిశాలోని 32 లక్షల మంది రైతుల్లో 92 శాతం మందికి ఈ పథకం ప్రయోజనాలు లభిస్తాయని ముఖ్యమంత్రి తెలియజేశారు.

కేరళలో రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటైంది. ఢిల్లీకి చెందిన ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ రూపొందించిన పథకమిది. కేరళలో వామపక్ష ప్రభుత్వం ఉన్నప్పుడు ముఖ్యమంత్రి అచ్యుతానందన్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. పంజాబ్‌లో స్వాతంత్ర్యానికి ముందు సర్ చోటు రామ్ కమిషన్ సిఫారసుల ప్రేరణతో ప్రవేశపెట్టిన పథకం ఇది. రైతులు, న్యాయనిపుణులు, వ్యవసాయ ఆర్థిక వేత్తలు, రాజకీయ నేతల బృందం ఒక ఊరి నుంచి మరో ఊరికి ప్రయాణం చేసి అక్కడి రుణాల సమాచారం సేకరిస్తుంది. ప్రతి రైతుకు అవసరమైన వ్యక్తిగత ఆర్థిక సహాయాన్ని లెక్కిస్తుంది. చిన్న, సన్నకారు రైతులు ఐదెకరాల కన్న తక్కువ భూమి ఉన్న, వార్షికాదాయం రూ. 2 లక్షలు దాటని రైతులకు మాత్రమే ఈ సహాయం లభిస్తుంది. దీని వల్ల 2018లో 11 వేల మంది రైతులకు ప్రయోజనం లభించింది. 11 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం పంపిణీ అయ్యింది. ఆ తర్వాత కేరళలో రైతు ఆత్మహత్యలు తగ్గిపోయాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయరంగంపై శ్వేతపత్రం ప్రకటించారు. వ్యవసాయ ఆదాయం రెట్టింపు చేసినట్లు ప్రకటించారు. పది శాతానికి మించి వృద్ధిరేటు సాధించినట్లు చూపారు. రుణ విమోచన, సాయిల్ హెల్త్ కార్డులు, యాంత్రీకరణ, జీరో బడ్జెట్, సహజ వ్యవసాయం, పురుగు మందులు, ఎరువుల వాడకాన్ని తగ్గించడం, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకంలో ప్రభుత్వ సహాయం, విత్తన పార్కులు, సబ్సిడీలు వంటి చర్యలతో ఈ వృద్ధి సాధించారు.

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా కృషక్ బంధు స్కీం ప్రవేశపెట్టారు. ఈ పథకం ప్రకారం ఎవరైనా రైతు చనిపోతే కుటుంబానికి వెంటనే రూ. 2 లక్షల సహాయం లభిస్తుంది. ఏటా ప్రతి రైతుకు రెండు పంటలకు ఎకరానికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం ప్రభుత్వం ఇస్తుంది. ఇది తెలంగాణ రైతు బంధు పథకం కనీస ఆదాయ గ్యారంటీతో పాటు ఇన్సూరెన్స్ సదుపాయం కూడా ఇస్తున్న స్కీం. ఇవన్నీ రైతులు సాగుబడి ప్రారంభించడానికి ముందే వారికి అవసరమైన సహాయం అందించే పథకాలు. అందువల్లనే ఈ పథకాలు విజయవంతమయ్యాయి. కాబట్టి కేవలం రుణమాఫీల వంటి పథకాల కన్నా ముందే అవసరమైన ఆర్థిక సహాయం ఇచ్చి రైతులను ఆర్థికంగా నిలబెట్టే పథకాలు, ప్రణాళికలు నేడు ఎంతైనా అవసరం.

✻ అరిందం దే (డైలీ ఓ)

రామానుజమ్, కేసీయారిజమ్



రమేశ్ హజారి
9390919090

మొన్నటి ఎన్నికల్లో కేసీఆర్ సారు గెలిస్తే గడ్డం తీస్తనని యాదగిరి నర్సన్నకు మొక్కుకున్న. పొద్దుగాల లేశీ గుట్టకు పోయిన ఇచ్చిన మాట నిలవెట్టుకున్న.. సారు ప్రమాణ స్వీకారం చేసే టయానికి తిరిగి వచ్చిన. నువ్వు నాస్తికునివి గానే.. మల్ల గిదేంది.. అని కొంతమంది మిత్రులు నన్ను నిలదీసే ప్రయత్నం చేసింద్రు. అయితే నా స్టయిల్లో నీను వాళ్లను సమాధానపరిచిన్ననుకో(ని... అది వేరే విషయం.

నాస్తికత్వమా, ఆస్తికత్వమా అనే దాని కంటే గూడా.. ప్రజల త్యాగాలు, కేసీయార్ పోరాట పటిమ రాజనీతిజ్ఞత దార్శనికతతో మనుగడలోకి వచ్చిన తెలంగాణ స్వయం పాలనను నిలవెట్టుకోవడమే నేటి వర్తమాన ప్రధాన లక్ష్యం. వచ్చిన తెలంగాణ ఎక్కుతున్న నిచ్చెన మెట్ల మీంచి జారిపడకుంటా చూస్కోవా లె., కాలానుకూల నిర్దిష్ట కార్యాచరణను చేపట్టాలె. అందుకు అనుసరించవలసిన అన్ని మైన్ స్ట్రీమ్ మార్గాలనూ అనుసరించాల్సిందే. సిఎం కేసీయార్ అదే చేస్తున్నరు.

మందులు కనిపెట్టే మల్టీనేషన్ కంపినోల్లు ముందుగాల వాటిని ఎలుకల మీద ప్రయోగాలు చే స్త రు. అనేక రాజకీయ సిద్ధాంతాలను పట్టుకొచ్చిన ఆంధ్ర ఆధిపత్య వ్యవస్థలు అట్లనే తెలంగాణ ప్రజలను ప్రయోగశాలలో ఎలుకలుగా మార్చినయి. దశాబ్దాలపాటు తెలంగాణ సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక ప్రయోగాలకు బలి చేసిన్రు. ఇంకా ఆగకుండా అటువంటి విఫలయత్నం చేస్తనే వున్నరు. అయినా చింతాకు మందం పురోగతిలేదు. కారణమేందంటే వాల్ల ప్రయోగాలకు నిర్దిష్టత లోపించడం. సామాజిక వైరుధ్యాలను అంచనావేయడంలోని వారి అవగాహన రాహిత్యం, విప్లవాన్ని(మార్పు) సాధించేందుకు, నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్ట కార్యాచరణ చేపట్టడంలో విఫలమవడం.

వేల ఏండ్ల నించి కొనసాగుతున్న సనాతన ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకుపోయిన మత ధర్మకర్తల సిద్ధాంతకర్తల పాటి కూడా ఈ దేశీయ అధునాతన విప్లవకారులు తమ విప్లవ కార్యాచరణను ప్రజల్లోకి తీసుకపోలేక పోయిన్రు. వారి వారి ఫ్యూడల్ స్వీయ మానసిక ధోరణుల చుట్టూ విప్లవ సిద్ధాంతాలను తిప్పింద్రు. అది మార్పును అడ్డుకునేందుకు పనిచేసిందే తప్ప మార్పుతేలేక పోయింది.

నాటి సామాజిక విలువల ప్రకారం, పై వర్గాలకే పరిమితమైన ఆధ్యాత్మిక చింతన కింది కులాలకూ విస్తరించాలని భావించిన రామానుజుడు తన తాత్వికతను కిందికులాలకు అందించే కార్యాచరణకు పూనుకున్నరు. ఉత్పత్తిలో భాగమయ్యే సకలజనులు ముక్కు, మూతి మూసుకుని జపం చేస్తూ కూసుంటే కుదురదు కావట్టి...వారి భౌతిక జీవితానికి ప్రాధాన్యతనిస్తూనే ఆధ్యాత్మిక దైవ చింతనను అలవాటు చేయాలనుకున్నడు. దైనందిన భౌతిక జీవన గమనాన్ని ఆధ్యాత్మికతకు అనుసంధానించనిదే మానవ మనుగడకు పరమార్థం దొరకదు అనే జ్ఞానంతోని వేయి సంవత్సరాల క్రితం దక్షిణ భారతాన విశి ష్టాద్వైత సిద్ధాంతాన్నీ ప్రారంభించి దేశవ్యాప్తంగా విస్తరింప చేసిండు రామానుజుడు. నేడు ఆయుధాల తో చేసే విప్లవ కార్యాచరరణ ఎంతటి రాడికల్ చర్యో నాడు రామానుజుని కార్యాచరణ కూడా అంతే. అది నాటి ప్రజలను విశేషంగా ఆకట్టుకొని రామానుజుని పథాన నడిపించింది. ప్రజల ఆదరణ పొందింది. దీని ద్వారా మనం ఏమి అర్థం చేసుకోవాలంటే ...మార్పు కావాలంటే నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్ట కార్యాచరణ చేపట్టాలె.. అని.

జీవం జీవి వేరుకారు రొండు వొక్కటే అనీ, జగము మిథ్య అనీ (పాశ్చాత్య దేశాల్లో కాంట్, హెగెల్ విశ్లేషించిన 'IDEAL' అనే భావన వలే) అద్వైత దర్శనాన్ని ముందుకు తెచ్చిన ఆది శంకరుని సిద్ధాంతం తర్వాతి కాలంలో తీవ్ర వక్రీకరణకు గురై నది. 'మిథ్య' అంటే 'శూన్య' 'భ్రమ' అనే తప్పుడు భావన ప్రచారంలోకి వచ్చిన నేపథ్యంలో, శంకరానంతర అద్వైతం, దైనందిన భౌతిక జీవనాన్ని విస్మరించి ధ్యానానికి పెద్ద పీట వేసింది. అంతా వుత్తదే అనే భావన మనిషిని బైరాగిని చేసి ప్రాపంచిక వ్యవహారాలనుంచి దూరం చేసి..వొక (ఉతోపియన్) ఊహాజనిత లోకాన్ని సృష్టించింది.

అట్లాకాదు., తన గమ్యాన్ని చేరుకునేందుకు వాహిక భౌతిక శరీరమే..దాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదు... భౌతిక శరీరం ద్వారా మాత్రమే ఆధ్యాత్మిక అలౌకికతత్వాన్ని చేరుకోవాలె...అందుకు కొన్ని సన్మార్గాలను అనుసరించాలె, కుల, మత సారస్యతను పాటించాలని చెప్తుంది రామానుజుని విషిష్టాద్వైత సిద్ధాంతం. To reach the goal, the means and its proper practice..also important అనే అంతస్సారమే విశిష్టాద్వైతంలో ఇమిడివున్నది. ఆత్మ శరీరం వొక్కటే అనే భావన మాత్రమే సరిపోదు. శరీరం(కార్యం) ద్వారా ఆత్మను(ఆచరణ) సమన్వయపరుచుకొని పరమాత్మను (గమ్యాన్ని) చేరాలె..ఇదీ గమ్యాన్ని చేరే రామానుజుని మార్గం. వక్రీకరణకు గురైన శంకరుని అద్వైతాన్ని, దాన్ని కాళ్ళపై నిలబెట్టే ప్రయత్నంలో భాగంగా 'విశిష్టఅద్వైతాన్ని' రామానుజుడు సరికొత్త సామాజికఆధ్యాత్మిక విప్లవంగా ముందుకు తీసుకోచ్చాడు. అదే తీరులో తెలంగాణాలో రకరకాల రూపాల్లోని మార్క్సిజం, వివిధ అస్తిత్వ ఉద్యమాల సారాన్ని సమకాలీన సామజిక, రాజకీయ పరిస్థితులకు సృజనాత్మకంగా కెసిఆర్ అన్వయించారు. రామానుజుడి విశిష్టాద్వైతం లాగా వివిధ మార్క్సిస్ట్, అస్తిత్వ ఉద్యమాల అంతస్సారాన్ని సమకాలీన పార్లమెంటరీ ప్రజాస్వామ్య యుగంలో వినూత్న రూపంలో 'కేసీయారిజం'గా నేడు అవతరించింది.



శంకరుని అద్వైతం, గుణాత్మకంగా రూపాంతరం చెంది కుల, మత సామరస్యతను బోధించే, సామాజిక అసమానతలను తిరస్కరించే రామానుజుని విశిష్టాద్వైత రూపంలో సమాజానికి ఆనాడు విముక్తి మార్గం చూపించింది. అదే తీరులో నేడు కేసీయారిజం తెలంగాణ సమాజానికే కాదు దేశానికే ఒక వెలుగు బాటగా నిలిచింది. తెలంగాణ రావాలని అందరూ కోరుకున్నరు కానీ ఎట్లా వస్తదో., వచ్చినంక ఎట్లా నిలబడుతదో...కేసీయారిజమ్ చూయించింది.

తెలంగాణ ఉద్యమానికి.. గమ్యం తెలుసు (తెలంగాణ సాధన) అదెట్ల వస్తదో తెలుసు (పార్లమెంటులో బిల్లు పెట్టడం ద్వారా) కానీ అందుకు సంబంధించిన కార్యాచరణ (ఎన్నికల్లో పాల్గొనే పార్లమెంటరీ పంథా) మాత్రం కెసీఆర్ కు పూర్వం నిర్దిష్టితకు విరుద్ధంగా సాగింది.ఎన్నికల బహిష్కరణ విధానాన్ని అట్లనే అనుసరిస్తే ఈ దేశంలో తెలంగాణ రాష్ట్రం వచ్చేదా.? అందికే కేసీయార్ ఉద్యమంలోకి అడుగుపెట్టినంకనే తెలంగాణ దిశగా గమ్యాన్ని చేరుకునే దారి సుగమం అయింది.

Kcr practiced a proper practice to reach targeted goal., and achieved it. దీన్నే కారల్ మారక్స్ ఏమంటదంటే... నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్ట కార్యాచరణ అని చెప్తడు. కానీ దాన్ని విస్మరించి.. కమ్యూనిజంలోనే అంతావున్నదనే మంత్రాన్ని పఠిస్తూ వర్తమాన దైనందిన జీవనానికి సంబంధించిన నిర్దిష్ట కార్యాచరణను విప్లవ మేధావి వర్గం నిర్లక్ష్యం చేసింది.. అది వేరే విషయం. ఈ రెంటినీ పోల్చడం లో ప్రధాన ఉద్దేశ్యం.. అనుసరణీయం అయిన పంథా అవసరాన్ని తెలిపేందుకే.

శంకరుని అద్వైతం., గుణాత్మకంగా రూపాంతరం చెంది కుల, మత సామరస్యతను బోధించే , సామాజిక అసమానతలను తిరస్కరించే రామానుజుని విశిష్టాద్వైత రూపంలో సమాజానికి ఆనాడు విముక్తి మార్గం చూపించింది. అదే తీరులో నేడు కేసీయారిజం తెలంగాణ సమాజానికే కాదు దేశానికే ఒక వెలుగు బాటగా నిలిచింది. తెలంగాణ రావాలని అందరూ కోరుకున్నరు కానీ ఎట్లా వస్తదో., వచ్చినంక ఎట్లా నిలబడుతదో...కేసీయారిజమ్ చూయించింది.రేపు దేశానికి కూడా దశ దిశను చూయించబోతున్నది. జై రామానుజమ్, జయహో కేసీయారిజమ్

ఈ పేజీకి రచనలు పంపవలసిన మెయిల్ :
editor@manatelangana.org

విద్యార్థులకు దండన సమంజసమా?



వాసిలి సురేష్
9494615360

ఉపాధ్యాయులు క్రమశిక్షణ పేరుతో విద్యార్థులు చేసిన చిన్న తప్పులకు కూడా పెద్ద శిక్షలు వేయడం తరచుగా మనం గమనిస్తున్నాం. విద్యార్థులు సరిగ్గా చదవలేదని, హోంవర్క్ రాయలేదని, పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని, ఫీజులు సకాలంలో చెల్లించలేదని, టై బెల్టు షూ యూనిఫాం లాంటివి ధరించలేదని మొదలయిన చిన్న చిన్న విషయాలకు ఉపాధ్యాయులు ఆవేశపడి విద్యార్థులను ఎండలో నిలబెట్టడం, బెత్తంతో కొట్టడం, బట్టలు ఊడదీసి నిలబెట్టడం, గోడ కుర్చీలు వేయించడం, మోకాళ్ళపై కూర్చోబెట్టడం లాంటివి చేస్తున్నారు. చిన్నచిన్న తప్పులకు ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షలు వేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఇటువంటి సందర్భాలలో ఉపాధ్యాయులు తొందరపడి నిర్ణయాలు తీసుకోకుండా విద్యార్థులతో చర్చించాలి, విద్యార్థులు చేసిన తప్పులకు కారణాలను వెతకాలి, దానికి పరిష్కార మార్గాలను విశ్లేషించాలి, విద్యార్థి తన తప్పులను సరిదిద్దుకునే అవకాశం కల్పించాలి అప్పటికీ ఆయా విద్యార్థులు తమ తప్పులను సరిదిద్దుకోలేకపోతే ఉపాధ్యాయులు విద్యార్థులను హెచ్చరించాలి. తర్వాత విద్యార్థుల తల్లిదండ్రులను, సంరక్షకులను సంప్రదించి తగు జాగ్రత్తలను తీసుకోమని చెప్పాలి. అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ప్రధానోపాధ్యాయులకో, విద్యాశాఖ అధికారులకో ఫిర్యాదు చేయాలి కానీ విద్యార్థులను ఉపాధ్యాయుడు ఎటువంటి దండనలకు, శిక్షలకు గురి చేయకూడదు.

ఉపాధ్యాయులు తొందరపడి విద్యార్థులను శారీరకంగా హింసించడం దుర్మార్గమైనది, చట్ట విరుద్ధమయినది. ఉపాధ్యాయులు క్రమశిక్షణలో ఉంచడం కోసమే, విద్యార్థులను అదుపులో ఉంచడం కోసమే దండించామని చెబుతుంటారు. అందులో నిజమెంత? క్రమశిక్షణలో ఏకైక ఉద్దేశం ఏమిటంటే మనకు కావలసిన ప్రవర్తనను విద్యార్థులకు నేర్పడం, విద్యార్థులు తమ అనుచిత ప్రవర్తనను గుర్తించుకొనేలా, సరైన మార్గంలో పయనించేలా చేయాలి. ఇది దండనల ద్వారా సాధ్యమవుతుందా అన్న విషయాన్ని బేరీజు వేసుకోవాలి.

ఉపాధ్యాయులు ఏమి చేయకూడదు అనే దానిని విశ్లేషిస్తే పిల్లల్ని కొట్టడం, గుంజీళ్లు తీయించడం, గోడ కుర్చీలు వేయించడం, చెంప దెబ్బలు వేయించడం, పరిగెత్తించడం, ఎండలో నిలబెట్టడం, జుట్టు పట్టి లాగడం, కర్రతో లేదా ఇతర వస్తువులతో కొట్టడం ఇటువంటి పనులన్నీ శారీరక దండన కిందకు వస్తాయి. విద్యార్థులను శారీరక దండనలకు గురి చేయకూడదు. అదే విధంగా పిల్లలను మానసికంగా హింసించడం అంటే పిల్లలను తిట్టడం, కించపరచడం, ఆటలలో, పాటలలో పాల్గొనడానికి అవకాశం ఇవ్వకపోవడం, తరగతి గది నుంచి ఇంటికి పంపించి వేయడం, తల్లిదండ్రులను వారితో రప్పించి వారి ముందు తిట్టడం, ఇతరులతో పోల్చడం, అవమానించడం, తరగతి గదిలోకి అనుమతించకపోవడం, చీదరించుకోవటం, పేర్లు పెట్టడం, తల్లిదండ్రులు చేసే పనిని, కులాన్ని అపహాస్యం చేయడం, ఆరోగ్య స్థితిని, లావుగా, బక్కగా ఉన్నావ్ అని వెక్కిరించడం, గేటు ముందు నిలబెట్టడం, వైకల్యాన్ని వెక్కిరించడం ఇలాంటివన్నీ మానసిక దండన కిందకు వస్తాయి, ఇలాంటి వాటిని కూడా చేయకూడదు. కుల, మత, భాష, రంగు, జాతి, లింగ, ప్రాంతం మొదలైన వాటిలో తేడాలుతో చూడటం వివక్షగా చెప్పవచ్చు. ప్రస్తుత పరిస్థితులలో జీవితంలో లైంగిక వేధింపులకు గురికాని బాలికలు అరుదుగా ఉన్నారు. బాలురపైన వేధింపులు ప్రస్తుతం మనం చూస్తున్నాము. విద్యార్థులను ఎటువంటి వివక్షకు, లైంగిక వేధింపులకు గురిచేయకూడదు.

ఉపాధ్యాయులు విద్యార్థులను దండనలకు గురిచేయడంలో కారణాలు విశ్లేషిస్తే పని ఒత్తిడి, పాఠశాల యాజమాన్యం లక్ష్యాలను నిర్దేశించడం దాన్ని చేరుకోవడంలో ఒత్తిడికి లోనుకావడం, విద్యార్థులపై తల్లిదండ్రుల ఆకాంక్షలు పెరిగిపోవడం తదనుగుణంగా విద్యార్థి స్థాయిని గమనించకుండా విద్యార్థిని ఒత్తిడికి గురిచేయడం, ముఖ్యంగా ప్రైవేట్ స్కూలు విద్యలో అనుసరిస్తున్న వ్యాపార ధోరణులు, ఉపాధ్యాయులలో తగిన శిక్షణ లేకపోవడం, విద్యార్థుల మనస్తత్వాన్ని అర్థం చేసుకోకపోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడం, సరైన అధ్యయనం చేయకుండా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయలేక దండించడం, ఉపాధ్యాయులలో ఉన్న అసహనం ఇవన్నీ కారణమవుతున్నాయి.

చట్టాలు ఏం చెబుతున్నాయి? ఉచిత నిర్బంధ విద్య బాలల హక్కు చట్టం 2009 సెక్షన్ 17 ప్రకారం శారీరకంగా శిక్షించడం, మానసికంగా వేధించడం నిషేధించబడినది. ఏ బాలుడు, బాలిక కూడా శారీరక శిక్షలకు, మానసిక వేధింపులకు గురికాకూడదు. దీనికి విరుద్ధంగా ప్రవర్తిస్తే, దీనిని అతిక్రమిస్తే ఉద్యోగ నియమాల ప్రకారం క్రమశిక్షణా చర్యలకు గురవుతారు. దండిస్తేనే చదువు వస్తుందని నమ్మడం, తమకు అలాగే చదువు వచ్చింది కాబట్టి తాము బోధించే వారికి కూడా అలాగే బోధించడం సరైనదని భావించడం అనేది ఒక అపోహ. పిల్లలు భయ పెట్టినప్పుడు క్రమశిక్షణతో ఉంటారని భావించడం లాంటి అపోహలను ఉపాధ్యాయులు విడనాడాలి.

పిల్లలు బాగా చదవాలని కోరికతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని ఒత్తిడికి గురి చేయడం వల్ల ప్రతికూల స్వభావం ఏర్పడుతుంది కానీ ఆశించిన ఫలితాలు నెరవేరవు. దండన అనేది మనం ఏమి ఆశించి విధిస్తున్నాం? దండనకు అభ్యాసనానికి మధ్య సంబంధం ఏమిటి? అనే విషయాలు తెలుసుకోవాలి. పిల్లల్లో అభ్యాసనం అనేది వారికి కల్పించిన బోధనాభ్యసన ప్రక్రియలు, కల్పించిన అవకాశాలు, నైపుణ్యాలు, ఆసక్తులు, వైఖరులు మొదలైన వాటిని బట్టి ఆధారపడి ఉంటుంది. పిల్లలను నియంత్రించడం ద్వారా, దండనలు ద్వారా అభ్యాసనం సాధ్యం కాదు. భయపూరిత వాతావరణంలో అభ్యాసనం జరగదు.

పిల్లల్లో ఆశించిన అభ్యాసనం, సామర్థ్యాలు రాకపోతే అందుకు కారణాలను అన్వేషించి, పరిష్కార మార్గాలను అన్వేషించి అమలు చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా విద్యార్థుల స్వేచ్ఛను హరించడం, వారిని దండనలకు గురి చేయడం ఎంతమాత్రం తగదు. పిల్లల స్వభావానికి వ్యతిరేకమైన విధానాలను అవలంబించకుండా ఇంట్లోనూ, పాఠశాలలోను పిల్లల స్వభావాన్ని అర్థం చేసుకొని బాల్యాన్ని ఒక నిర్మాణాత్మక దశగా గుర్తించాలి. భయరహిత వాతావరణాన్ని కల్పించాలి. అటువంటి సందర్భాలలో మాత్రమే ఆశించిన ఫలితాలను సాధించవచ్చు.

ఎలాంటి దండనలు, వివక్ష లేకుండా ఉండటం, విద్యార్థుల భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశాలు కల్పించడం, అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, ఒత్తిడి లేకుండా లక్ష్యాలను సాధించడం వంటివి భయరహిత వాతావరణంలోనే సాధ్యమవుతుంది. అటువంటి భయరహిత వాతావరణానికి, విద్యార్థుల స్వేచ్ఛా వ్యక్తీకరణకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు పాటుపడాలి.



ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం
మన తెలంగాణ
మన
మనపేజీ
మనందరిపేజీ
www.manatelangana.news
హైదరాబాద్ | ఆదివారం | 6 జనవరి | 2019

పద్మశాలీల ఆశ్రితులు

ఇంద్రజాల కళాకారులు సాధనా శూరులు

తెలంగాణలోని అరుదైన ఆశ్రిత కళారూపాల్లో సాధన శూరులు ఒకటి. వీరు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ,చల్లూరు గ్రామంలో ప్రస్తుతం ఉన్న కళాకారుల నాల్గవ తరం వారు వచ్చి స్థిరపడ్డారు. అప్పటినుండి ఈ గ్రామంలోనే ఉంటూ ,తమ తమ కట్టడి గ్రామాలకు ప్రదర్శన నిమిత్తం వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ 100 కుటుంబాలు , ఆరు ప్రదర్శనా బృందాలు ఉన్నాయి .ఇదే జిల్లాలోని ఎల్కతుర్తి మండలం ,వల్లభాపూర్ గ్రామంలో కూడా ఒక బృందం ఉంది .అయితే వీరు కూడా పూర్వం చల్లూరు గ్రామంలోనే ఉండేవారని చెప్తారు. పూర్వం వీరు రాజమండ్రి లోని గుంటుపల్లి భాస్కర బ్రాహ్మణుని వద్ద తమ ముత్తాత చింతకింది లచ్చయ్య ఇంద్రజాల విద్యలు నేర్చుకున్నాడని,అప్పటి నుండి ఈ విద్య నే వృత్తి గా స్వీకరించి పద్మశాలీల ను ఆశ్రయించి ప్రదర్శిస్తున్నామంటారు. ఆశ్రిత కళారూపాలలో ఒకే కులాన్ని మాత్రమే హక్కుగా ఆశ్రయించి, ప్రదర్శించే కళారూపాలు బీరప్పలు ,విప్రవినోదులు, సాధనా శూరులు . సాధనా శూరులు ప్రదర్శించే విద్యలను ఇంద్రజాల విద్యలని ,కనికట్టు విద్య లని అంటారు . ప్రదర్శనలో కళాకారులు కంటికి కనిపించే వస్తువును మాయం చేయడం దాని స్థానంలో మరొక వస్తువును సృష్టించడం, ప్రేక్షకులను ప్రదర్శనలో భాగం చేసి ,వారితోనే ఆశ్చర్యం గొలిపే పనులు చేయిస్తూ, మాయలు మంత్రాలు ఉన్నట్టు భ్రమింప చేయడం వీరి ప్రత్యేకత .

వీరి ప్రస్తావన శ్రీ హర్షని రత్నావళి నాటకం, పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక వంటి ప్రాచీన కావ్యాల్లో కనిపిస్తుంది.

సాధనా శూరులు అనే పదానికి సాధన అంటే మల్ల విద్య అని ,శూరుడు అనే పదానికి ధైర్యం కలవాడు, బలం కలవాడు, పరాక్రమము కలవాడు అని అర్థాలు ఉన్నాయి. నిజానికి వీరు ధైర్యం కలవారు .ఎందుకంటే పద్మశాలి కులాన్ని రక్షించడం కోసం ధైర్యంతో సాహసం చేసి వారిని హింసించిన రాజును సంహరించడంతో సాధన శూరులుగా పద్మశాలి వారితో పిలువ పడ్డారు. వీరు సాధనా శూరులు గా ఎట్లా అయ్యారనడానికి ఒక మౌఖిక కథను వినిపిస్తారు. పూర్వం శ్రీకృష్ణ గంధర్వ రాజు పొట్ల చెరువు ప్రాంతంలో 56 రాజ్యాలను ఏకఛత్రాధిపత్యంగా పరిపాలిస్తుంటాడు .ఆ రాజు ఎవరి చేత మరణం లేకుండా ఉండేందుకు కాళికా దేవిని పూజించగా, ఆమె అందుకు ప్రతిఫలంగా ప్రతిరోజు ఒక మనిషికి కొత్త బట్ట కట్టించి అతని తల నరికి దానిపై కూర్చుండి 12 సంవత్సరాలు పూజ చేయాలనికోరుతుంది. రాజు అందుకు సమ్మతించి ,ప్రజలకు చెప్పకుండా రాజ్యంలోని పద్మశాలీలు ప్రతిరోజు కొత్తబట్టలు ఇవ్వాలని, మిగతా కులాల వారు ఇంటికి ఒకరిని చొప్పున ప్రతిరోజు కొలువు కు పంపియ్యాలని,చాటింపు వేయించి,ఆ ప్రకారంగా కొన్ని సంవత్సరాలు రాజు కాళికాదేవిని పూజిస్తాడు. ఇట్లా కొన్ని సంవత్సరాల తర్వాత రాజ్యంలో పద్మశాలి కులం తప్ప మిగతా కులాల వారు ఇంటికి ఒకరు చొప్పున రాజు కొలువుకు వెళ్ళటం జరుగుతుంది. రాజు తిరిగి మళ్ళీ ఇంటికి ఒకరిని పంపియ్యమని చాటింపు వేయడంతో మిగతా కులాల వారంతా ఏకమై ఈసారి మేమే కొత్తబట్టలు ఇస్తామని పద్మశాలి వారిని ఇంటికిఒకరిని పంపమని కోరుతారు.ఆ రాజు అందుకు సమ్మతించి ఆ విధంగా చాటింపు వేయించగా,దానికి పద్మశాలీలు వ్యతిరేకించి ముందు మీరు తీసుకువెళ్లిన మనుషుల్ని ఏం చేస్తున్నారో చెప్పండని నిలదీయగా ,వారందరినీ చెరసాలలో బంధిస్తాడు. అయితే పద్మశాలీలు 5 రోజులు చెరసాలలో స్నాన సంధ్యలు లేకుండాచెర శాలలో ఉన్నామని, పూజ చేసుకొని తిరిగి వస్తామని కాపలా దారున్ని నమ్మించి బయటకు వస్తారు. పద్మశాలీలు ప్రతి రోజు పూజ చేసుకునే మార్కండేయ గుడిలో ఏకమై ,రాజు మన వంశాన్ని నిర్వీర్యం చేయడానికి కంకణం కట్టుకున్నాడని,ఎలాగైనా రాజును సంహరించాలని నిర్ణయించుకుంటారు . ఆరాజు ఉండేది ఉక్కుకోట ,మధ్యలో ఒంటి స్తంభం మేడ, ఆ మేడ చుట్టూ ముస్సానది. కాపలాగా కోట ముందు కాళికాదేవి ఉంటుందని,ఆ రాజు అర చేతిలో వుండే కత్తితో చంపితేనే చస్తాడని , అప్పుడే మన వంశం నిలుస్తుందని తీర్మానించుకుంటారు.

ఒక బంగారు పళ్లెంలో కత్తి పెట్టి ఆ రాజును సంహరించడానికి వచ్చేవారు ఆ కత్తిని ముట్టుకోవాలని కోరగా, పద్మశాలీల లోని గంజి, బండారి ,ఆడెపు, భీమనపల్లి , వంగరి ,చింతకింది ఇంటి పేరు గల వారు ముందుకు వస్తారు. వీరికి పెళ్లి లో మొదటి బొట్టు అని ,అంతే కాకుండా విజయం సాధించిన వారిని ప్రతి సంవత్సరం ఆయా గ్రామాలకు పిలిచి ఇంటింటికి రూపాయిపావల ,1016 ఇవ్వాలని ,56 దేశాల పద్మశాలీల ముందర తీర్మానం చేసుకుంటారు. వీరంతా కర్ర సాము కత్తి సాము సాధన చేయడమే గాక రాజు కోట చుట్టూ భూతాలు ప్రేతాలు కాళికాదేవి కాపలా ఉంటుంది కాబట్టి ,మంత్ర తంత్ర విద్యలు కూడా నేర్చుకోవాలని గొల్ల కేతమ్మ దగ్గర ఆ విద్యలన్నింటినీ నేర్చుకొని ఆమె మంత్రదండం కూడా తీసుకొని రాజును సంహరించడానికి బయలుదేరుతారు.ఆమె మంత్రదండంతో ముస్సానది దాటి కోట చేరుకోగానే, కాళికాదేవి వీరిని అడ్డగించి నన్ను ప్రసన్నం చేసుకోవాలంటే మీరు మందు మాంసంముట్టాలని కోరుతుంది .ఆ ప్రకారంగా పద్మశాలీలు కాళికాదేవి చెప్పినట్టుగా నడుచుకొని ఒంటి స్తంభం మేడ మీద ఉన్న రాజును సంహరించి ,వీరులుగా తిరిగి వస్తారు .పద్మశాలీలు ఒప్పందం చేసుకున్న దాని ప్రకారం వీరిని గౌరవించాలి కాబట్టి మామూలుగా వెళ్లకుండా సాధన చేసిన విద్యలు గొల్ల కేతమ్మ కాళికాదేవి దగ్గర నేర్చుకున్న మంత్ర తంత్ర విద్యలను ప్రదర్శించి ప్రతిఫలం పొందటం మొదలుపెట్టారు.

ప్రదర్శనలో సాధనా శూరులు జలస్తంభన, వాయు స్తంభన , అగ్నిస్తంభన తో పాటుగా మరి కొన్ని విద్యలు ప్రదర్శిస్తారు. ప్రేక్షకుల ముందు ప్రదర్శించేటప్పుడు కళాకారులు నాటకీయ ఫక్కీలో హాస్యం భయానకం వంటి అంశాలతో ప్రేక్షకులను ప్రదర్శనాద్యంతం రంజింప చేయడం వీరి ప్రత్యేకత. ప్రదర్శన ప్రారంభంలో కాళికాదేవి పూజచేసిన గురువు బృందం లోని సభ్యులందరికీ మంత్రించిన తావిత్తులు కడతాడు. ఆ తర్వాత అష్టదిక్పాలకులను బంధించి ప్రదర్శన మొదలు పెడతారు. ప్రారంభంలో నగారాలు వాయిస్తుండగా



మొదట బృందం సభ్యులు ఒక్కొక్కరుగా గురువు ఆదేశాన్ని బట్టి కర్ర సాము ప్రదర్శిస్తారు. ప్రదర్శనలో కళాకారులు నీటిని స్తంభింపచేసి తమ ఆధీనంలోకి తెచ్చుకొని ఆ తర్వాత నియంత్రించుకుని ప్రదర్శనాంశానికి అనుకూలంగా మార్చుకుంటారు. దీనినే జలస్తంభన అంటారు. ఇందులో భాగంగా ముక్కు రంధ్రాలలోని ఒక రంధ్రం నుండి నీటిని పంపి మరొకరు రంధ్రం నుండి నీటిని బయటికి తీయడం, అలాగే నీటిలో పసుపు కుంకుమ కలిపి వాటిని యధావిధిగా బయటికి తీసి ప్రేక్షకులను ఆశ్చర్య పరుస్తారు. అలాగే ప్రదర్శనలో కళాకారులు అగ్నిని స్తంభింపజేసి ప్రదర్శించే అంశాలు ప్రత్యేకమైనవి. ఇటు వంటి అంశాలలో కాగితం మరియు దారాన్ని కాల్చి మళ్లీ సృష్టించడం ,మనిషి తల పై పొయ్యిపెట్టి పూరీలు చేయడం ,అగ్గి లో కాల్చిన పారని చేతితో పట్టుకోవడం ప్రధానమైనవి.వీరు ప్రదర్శించే కీలకాంశాల్లో తల మీద పొయ్యిపెట్టి పూరీలు చేయడం, ఇందుకోసం ప్రేక్షకుల నుండి ఒక వ్యక్తిని పిలిచి అతని తలపై మట్టితో చేసిన పోయిన ఉంచి దాని మీద మూకుడు పెట్టి పూరీలు కాలుస్తారు .ఈ ప్రదర్శనాంలో ప్రేక్షకులకు కలిగే సందేహాలను గురువును అడుగుతూ నేను చేస్తానని ,ప్రగల్భాలు పలుకుతూ హాస్యాన్ని పండిస్తూ రక్తి కట్టిస్తాడు.

సాధనా శూరులు నీటిని ,అగ్నిని తమ ఆధీనంలోకి తెచ్చుకొని ప్రదర్శించినట్లు గానే, గాలిని కూడా స్తంభింపచేసి, చిలక కట్టడం చొప్పల పల్లకిలో కూర్చుని ఊరేగడం వంటి అంశాలు ప్రదర్శిస్తారు. ఇందులో చిలుక కట్టుట ప్రదర్శనా ంశంలోమొదట గురువు ప్రదర్శించే అంశాన్ని ప్రేక్షకులకు వివరించిన తర్వాత బృందంలోని వ్యక్తి ఒకరు వెదురు కర్రను తీసుకువచ్చి భూమిపై నిలబెట్టి పట్టుకుంటాడు. ఆ తర్వాత ఒకరు చెక్కతో చేసిన చిలుక బొమ్మను తీసుకువచ్చి దాని నడుము భాగాన్ని కర్రపై ఉంచి కదలకుండా పట్టుకుంటాడు. అప్పుడు ఒక కావిడి బద్ద ను తీసుకువచ్చి దానికి రెండు వైపులా బరువులు వేసి ఆ కావడిని చిలక పై భాగంలో ఉంచుతారు. గురువు చిలుక పై మంత్రించిన నీళ్లు చల్లి వేదం తో మూడు సార్లు మంత్రించి కర్రపై చిలుకను పట్టుకున్న వ్యక్తిని వదిలి వేయ మంటాడు. అప్పుడు ఏ ఆధారం లేకుండా చిలుక ఒక కర్రను ఆధారం చేసుకొని ,బరువు గల కావడిని మోస్తుంది. ఈ రకంగా గురువు చిలక ముక్కు మీద అట్లాగే చిలక తోకను మాత్రమే కర్రకు ఆనించి కావడిని మోపించటం ప్రేక్షకులు మంత్రమో తంత్రమో తెలియక సాధనా శూరుల మాయ అంటూ ఆశ్చర్యానికి లోనవుతారు. వీరు ప్రదర్శించే విద్యల్లో చొప్పల పల్ల కి చాలా ప్రత్యేకమైంది. చాలా సున్నితంగా ఉండే చొప్పబెండ్లతోకూర్చునేలా పల్లకి తయారు చేసుకొని ,దాని మీద గురువు కూర్చుండగా బృందం సభ్యులు ప్రేక్షకుల మధ్యలో తిప్పుతారు. అలా తిరుగుతున్నపుడు హాస్యగాడు తనదైన శైలిలో హాస్యం పండిస్తూ ఉంటాడు .అలాగే ప్రదర్శనలో భాగంగా ఛాతీపై బండను పెట్టుకొని పగలగొట్టించుకోవడం ,కరెంటు బుగ్గలను నోట్లో వేసుకొని నమలడం, మాయ బొమ్మకు చేసిన అలంకరణ గుడారంలో కట్టేసిన వ్యక్తి కి కనిపించడం వంటి విద్యలను అదృశ్యకరణ విద్యలని ప్రదర్శిస్తారు. అంతేకాకుండా వీరు ప్రదర్శించే విద్యలో అద్భుతం గా చెప్పుకునే ది గుడారంలో ఒక స్తంభానికి కట్టేసిన వ్యక్తి మిగతా స్తంభాలకు మారటం ,ఈ అంశాన్ని ప్రదర్శించేటప్పుడు ప్రేక్షకులే వ్యక్తికి బేడీలు వేసి చేతులకు కాళ్ళకు కట్లుకట్టి ఆ తర్వాత అతన్ని గుడారంలో గుంజకు కూడా విప్పు కోవడానికి వీలు లేకుండా కడతారు .అయినప్పటికీ వ్యక్తి గుడారంలో ఏ గుంజకు మారమంటే ఆ గుంజకు మారటం విశేషంగా చెప్పుకోవచ్చు .ఇవే కాకుండా మరొక అద్భుతమైన అంశం గుడారంలోకి వెళ్లిన వ్యక్తి వికృత రూపంలో బయటికి రావడం, గురువు బృందంలోని సభ్యులు ప్రేక్షకులు చూస్తుండగానే గుడారంలోకి మామూలుగా పంపించి పరదాకప్పేస్తాడు .ఆ తర్వాత తన చేతిలో ఉన్న వేదం చే మంత్రించి కాళికాదేవి ని తలచుకొని వేపాకు గుడారం పై చల్లి గుడారం మీది పరదా తీయ మంటాడు. అప్పుడు గుడారంలోకి వెళ్లిన వ్యక్తి మాయమై ప్రేక్షకుల మధ్యలో వికృత రూపంలో ప్రత్యక్ష మై ,అందర్నీ చెల్లా చెదురు చేస్తూ భయాన్ని కలిగిస్తాడు. అలాగే మరొక అద్భుత అంశం లో దేవతల విగ్రహాలను సృష్టించడం ,గురువు ముందుగా ఒక వ్యక్తిని గుడారంలోకి పంపి గుడారం పరదా కప్పేస్తాడు .ఆ తరువాత గురువు బయటనుండి రాళ్లను పసుపు బియ్యాన్ని మంత్రించి గుడారంలోకి పంపగా, రాళ్లన్నీ దేవతల విగ్రహాలుగాను, పసుపు బియ్యం పులిహోర గాను మారుతుంది. ఇవే కాకుండా గాలిలో నిమ్మకాయలు ఎగురవేసి కత్తితో ముక్కలు చేయడం ,కడుపు మీద జిల్లేడు ఆకులు వేసుకుని ముక్కలు చేయడం, బండికి కత్తి కట్టి తలతో నెట్టటం ,రేకుపళ్ళాలు గాల్లో ఎగిరి కొట్టుకోవడం మొదలైన అంశాలను ప్రేక్షకులను అలరిస్తూ ,హాస్యాన్ని జోడించి ప్రదర్శిస్తారు. ఈ కళారూపంలో ని కనికట్టు విద్యలు ప్రదర్శించడానికి కళాకారులు 10 నుండి 12 మంది వరకు ఉంటారు .వీరిలో ఒక్కొక్కరు ఒక్కొక్క కనికట్టు విద్యలో నైపుణ్యం కలిగినవారు. ప్రదర్శన మొత్తం రక్తికట్టించడానికి ఒకరు గురువు మరొకరు హాస్యగాడు ప్రముఖ పాత్ర వహిస్తారు. ప్రదర్శనమొత్తం గురువు ఆధీనంలోనే జరుగుతుంది .ఇతనికి ప్రదర్శన అనుభవంతో పాటు కనికట్టు విద్యలు సంపూర్ణంగా తెలిసి ఉంటాయి .బృందంలోని ఇతర సభ్యులు ప్రదర్శనలో తప్పు చేస్తే రహస్య భాషా పదాలను ఉపయోగిస్తూ ప్రదర్శన కు అంతరాయం కలగకుండా ప్రయత్నిస్తాడు .వీరు ఉపయోగించే రహస్య భాషా పదాలలో ఉదాహరణకు పచ్చ పసుపు, ‘మిల్క్ పెట్టె’ అగ్గిపెట్టె ,పాండ్యాలు నీళ్లు, మస్కా లు విగ్రహాలు, పొల్లు ఇటుక పొడి, దారు కందారం ,పత్రులు రాళ్లు ,మొకిరలు పూరీలు తైరు నూనె ,సోర్ అన్నం, పచ్చతావిత్తు, పొంత పొయ్యి,మీటకంసంభావన, తెల్లోడు సుద్ధ మొదలైన పదాలను ఉపయోగిస్తూ ఒకరికొకరు ప్రదర్శనలో సహక రించుచుకుంటూ ప్రదర్శిస్తారు.

ప్రదర్శనలో గురువు తర్వాత ప్రదర్శనను రక్తికట్టించడంలో ,ప్రేక్షకులను ఆనందింప చేయడంలో ,సిద్ధహస్తుడు హాస్యగాడు. ఇతని వేషధారణ హావభావాలు ప్రేక్షకులకు ఆనందాన్ని కలిగిస్తాయి. అంతేగాకుండా ప్రేక్షకులకు కలిగే సందేహాలను తీరుస్తూ ,అవసరమైతే గురువు చేత దెబ్బలు తింటూ నటిస్తాడు. ప్రదర్శనలో పూర్తి స్వేచ్ఛతో బృందం సభ్యులను గురువును అవసరమైతే ప్రేక్షకులను కూడా సమాజంలోని సంఘటనలను గుర్తు చేస్తూ తిట్టడం లేదా పొగడటం ఇతని నైజం. కళాకారులు ప్రదర్శనాద్యంతం రక్తి కట్టించడంలో రెండు నగారాలను వాయిస్తూ బృందం సభ్యులకు ,ప్రేక్షకులకు ఉత్సాహాన్ని కలిగిస్తారు. వీరు చేతిలో అధర్వణ వేదం పట్టుకొని దీన్నే మంత్రదండం అంటారు. దీనితో మాయమంత్రాలు ఉన్నట్టు భ్రమింపచేస్తారు కానీ మాయలు మంత్రాలు లేవని చెట్ల క్రియలు ఉన్నాయి కాబట్టే ఇంద్రజాల విద్యలు చేయగలుగుతున్నామని అంటారు .అందుకే గ్రామాల్లో విద్యలు ప్రదర్శించే సందర్భంలో ఆ గ్రామంలో మంత్రగాళ్ళు ఉంటే మేం చేసే విద్య లకు అంతరాయం కలిగించమని ధైర్యంగా సవాలు విసురుతూ ఉంటారు.

ఒక గ్రామంలో ఒకానొక సందర్భంలో కళాకారుడు ఒకరు సాయంత్రం మంత్రగా నిగా చెప్పుకునే ఒకరి ఇంటికి వెళ్లి ,చుట్ట అంటించుకోవడానికి నిప్పు కావాలంటే ,అతను తువ్వాలలోతెచ్చి ఇచ్చాడట, దాన్ని అతను చేతిలో పట్టుకొని చుట్ట అంటించుకున్నాడట, అప్పుడు ఆ మంత్ర గాడు కళాకారుని గొప్పతనం చూసి నా కంటే గొప్పవాడని రూ.1016 ఇచ్చి కాళ్ళు కూడా మొక్కాడట, ఈ రకంగా గ్రామంలో వీరిని చూసి మంత్రగాళ్ళు గా చెప్పుకునే వారు కూడా భయపడతారంటారు. కళాకారులు ఆధునిక మెజిషియన్స్ కి దీటుగా , నేటి కాలంలో కూడా సంప్రదాయ పద్ధతిలో, నాటకీయ ఫక్కీలో పద్మశాలిని ఆశ్రయించి ప్రదర్శించినప్పటికీ ,ఆ గ్రామంలోని ఇతర కులాలన్నింటినీ తమ ప్రదర్శనతో కట్టిపడేసి అలరిస్తారు. తరతరాలుగా సంక్రమించిన తమ కళ , కలగా కాలగర్భం లో కలిసిపో కూడదని నేటి ఆధునిక కాలంలో కూడా ప్రేక్షకులను రంజింప చేస్తూ వస్తున్నారు. ప్ర భుత్వం నుంచి ఎటువంటి ఆదర ణ లేదని, పింఛన్ కల్పించలేదని వాపోతున్నారు. అయినప్పటికీ తమ కళను ఆదరిస్తున్న ప ద్మ శా లీల దగ్గర ఆత్మగౌరవం తో ప్రదర్శిస్తూ మనుగడ సాగిస్తు న్న కళాకారులు నిజంగా సాధనా శూరులే.



డా.బాసని సురేష్
తెలంగాణ యూనివర్శిటీ
99894 17299

వెలిని ఎదిరించిన వీరుడు

‘విలువండి’ అయ్యంకాళి

తరతరాల అంటరానితనం అనే దాస్యంలో మగ్గి అనేక రకాల వెలివేతలకు, వివక్షకు గురై కనీసం అగ్రకుల వీధుల్లో నడవడంపై కూడా నిషేధం ఉన్న రోజుల్లో ఆ వీధుల్లో బండి నడిపి భారతదేశ చరిత్రలోనే మానవ హక్కుల మొదటి సమరగాథకు శంఖం పూరించిన యోధుడు మహాత్మా అయ్యంకాళి... అతను సాగించిన ఈ ఆత్మ గౌరవ యాత్రకు నూట ఇరవై అయిదేళ్ళు.

అయ్యంకాళి వంటి మట్టి యోధుల చరిత్ర అగ్రకుల చేతి రాతల్లో చరిత్ర గర్భంలో కప్పివేయబడ్డా, కేరళలోని వెంగనూరు ప్రాంతంలో నేటికీ ప్రజల నానుడిలో సజీవంగా ఉంది. భారతదేశంలో అక్షరాస్యతలో అగ్రభాగాన ఉండి అభ్యుదయ రాష్ట్రంగా పేరొందిన కేరళ రాష్ట్రం ఒక శతాబ్దికి ముందు అసమానతలకు నిలయంగా ఉండేది. సమాజంలో కులోన్మాదాన్ని ప్రత్యక్షంగా సందర్శించిన వివేకానందుడు ఈ ప్రాంతాన్ని ఉన్మాదుల ప్రదేశం అని విమర్శించాడు. అంటరాని తనమే కాక, బానిస విధానం ప్రబలంగా ఉండేది. దళితుడైన పులయాలు కట్టుబానిసలుగా పరిగణింపబడేవారు. ఇప్పటి కేరళ రాష్ట్రం దక్షిణ ట్రావన్కూరు ఉత్తర మలబారు, మధ్య కొచ్చి ప్రాంతాల కలయిక హైదరాబాదు సంస్థానంలా గానే ట్రావన్కూర్ సంస్థానం రాజు ఆధీనంలో రాజ్యమున్నా, అగ్రకుల, నంబూద్రి, నాయర్‌ల కనుసన్నులలో సమాజముండేది.



చాతుర్వర్ణ వ్యవస్థ కన్నా సమాజం నిట్టనిలువుగా రెండు వర్గాలుగా ఉండేది. ఒకవైపు అగ్రకుల నంబూద్రి, నాయర్‌లు మరోవైపు బ్రాహ్మణేతర ఎజవ, పులయా, పరయాలు, అధికారాన్నీ అగ్రకులాలవే. దళితులు వ్యవసాయ కూలీలుగా ఉండేవారు. పులయా స్త్రీలు కూడా ఆధిపత్య కులాల దాష్టీకానికి గురయ్యేవారు. పులయా పురుషుల్ని 6 నుంచి 10 రూపాయలకు, స్త్రీలను 12 రూపాయలకు కొని వారితో వెట్టి పని చేయించేవారు. ఈ పరిస్థితి 19వ శతాబ్ది వరకు కొనసాగింది. ట్రావెన్కూర్‌లో మిషనరీలు, బ్రిటీష్ ప్రభుత్వ చొరవ వల్ల మహారాజు 1843లో బానిస విధానాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినా అగ్రకులాలు దాన్ని ఖాతరు చేయలేదు. అన్ని కులాల వారు రహదారుల్లో నడవడానికి, బండ్లు నడపడానికి 1863లో చేసిన ఆజ్ఞలు కూడా ఆధిపత్య కుల అహంకారం ముందు నిలవలేకపోయాయి. సమాజంలోని అసమానతలను, దళితుల దీన స్థితిని మార్చడానికి ఏ సంఘ సంస్కర్తలూ ముందుకురాని తరుణంలో దళితుల ఆత్మగౌరవ పోరాటానికి అయ్యాంకాళి పూనుకున్నాడు. ఆకాలంలోనే శూద్ర కులాలైన ఎజవల అభ్యున్నతికై బ్రాహ్మణేతర పోరాట ఆద్యుడు శ్రీ నారాయణ గురు సంస్థలేర్పర్చి ప్రజలను చైతన్యపర్చాడు. అయ్యంకాళి అంటరాని కులాలుగా పేర్కొనే పులయా కుటుంబంలో ట్రావెన్కూరు సమీపంలోని వెంగనూరులో అయ్యన్, మాల దంపతులకు 1963 ఆగస్టు 28న జన్మించాడు, దళితులకు విద్యావకాశాలు లేని కారణంగా, అయ్యంకాళి చదువుకోలేదు. కానీ చిన్నతనం నుండే కుల వివక్షను ఎదిరించాడు. స్ఫురద్రూపి, బలశాలి అయిన అయ్యంకాళి తనదైన శైలిలో అస్పృశ్యతపై పోరాటాన్నెంచుకొన్నాడు. నాటకాల ద్వారా దళితుల్ని చైతన్య పర్చేవాడు. స్వతహాగా ధైన్యశాలి అయిన ఈతడు అన్యాయం ఎక్కడ ఎదురైనా ప్రశ్నించేవాడు. హింసకు ప్రతి హింస సమాధానమని నమ్మేవాడు. అయ్యంకాళి సాగించిన అనేక పోరాటాల్లో మొదటిదీ, ప్రధానమైనదీ చరిత్రాత్మక విలువండి యాత్ర. ప్రధాన రహదారుల్లో దళితులు నడవడం, ఎడ్లబండి నడపడంపై అప్పటివరకు ఆధిపత్య కులాలు విధించిన నిషేధాన్ని ఉల్లంఘించి, ప్రజాస్థలాలపై హక్కు సాధించాలని నిశ్చయించుకున్నాడు అయ్యంకాళి. దీనికోసం రెండుఎ తెల్లని ఎడ్లను, ఒక బండిని కొని అగ్రకులాలకు విన్పించేలా ఎద్దుల మెడలో గంటలు కట్టాడు. దళితులు శుభ్రమైన వస్త్రాలు ధరించరాదనే నిషేధాన్ని ధిక్కరించి తెల్లని యాత్రకు ఉపక్రమించాడు. తనతో బాటు బలశాలురైన యువ బృందాన్ని తయారుచేశాడు. ఆయన బృందానికి ‘అయ్యంకాళి పరు’లని పేరుండేది.

అది 1893వ సంవత్సరం, తెల్లవారు జామున బండి మీద ఎక్కి పగ్గాలు పట్టుకొని బండిని వెంగనూరు అగ్రకుల వీధుల్లో పరిగెత్తించాడు అయ్యంకాళి. వెంగనూరు నుండి అరకుముడు వరకు సాగిన ఈ యాత్రను అడుగడుగునా అగ్రకులాల వారు ఆటంకపర్చారు. కర్రలు, రాళ్ళతో దాడి చేశారు. తన ప్రాణాలను సైతం లెక్కచేయక మానవహక్కుల కోసం అయ్యంకాళి సాగించిన ఈ యాత్ర కేరళ చరిత్రలోనే కాక, భారతదేశ చరిత్రలో తొట్టతొలి సమర యాత్ర అని చెప్పవచ్చు. బండి బలరామపురం, చళియా బజారుకు చేరేసరికి అది అగ్రకులాల, దళితుల ప్రత్యక్ష యుద్ధంగా మారింది. రక్త సిక్తమైన దేహంతో అయ్యంకాళి యాత్ర సాగించాడు. చరిత్రలో ఇది తిరుగుబాటు ‘చళియా వీధి ఘర్షణ’గా ప్రసిద్ధికెక్కింది. చళియా ఘర్షణల తర్వాత అనేక యాత్రల్ని అయ్యంకాళి సాగించాడు. స్వేచ్ఛకొరకు నడకగా దీనిని పేర్కొన్నారు. ఈ యాత్ర తర్వాత అయ్యంకాళి దళితుల తిరుగులేని నాయకుడైనాడు.

అయ్యంకాళి స్ఫూర్తితో ఉత్తేజితులైన దళిత యువత అనేక ప్రాంతాల్లో కులవివక్షను ధిక్కరించ ప్రారంభించారు. ట్రావెన్కూరు శివారు ప్రాంతాలైన మనక్కాడు, కెళకూట్టు, కణియాపురం, మరుక్కంపుర, కజక్కట్టర లాంటి ప్రాంతాల్లో అగ్రకుల వీధుల్లో నడక సాగించారు. 1912 నెడుంమంగళంలో దళితుల మార్కెట్ ప్రవేశపోరాటాన్ని అయ్యంకాళి ముందుండి నడిపాడు. అయ్యంకాళి మొదలుపెట్టిన స్వేచ్ఛ కోసం నడక తర్వాత కాలంలో వారి స్వాతంత్ర్యాన్ని, హక్కులను సాధించే పోరాటాలుగా రూపాంతరం చెందింది. 1904లో దళిత బాలికల పాఠశాల స్థాపించిన అయ్యంకాళి సాధుజన పరిపాలన సంస్థ ద్వారా దళితుల్ని సమాయుత్తం చేసాడు. 1913లో పుల్లాట్టులో దళిత బాలల పాఠశాల ప్రవేశానికై చేసిన వ్యవసాయ కూలీల సమ్మె, 1915లో భూస్వాములకు వ్యతిరేకంగా పుల్లాట్లు అల్లర్లు, 1917లో దళిత స్త్రీల ఆత్మాభిమానానికై చేసిన కల్లుమాల ఉద్యమం అయ్యంకాళి సాగించిన సాహస పోరాటాలు. వీరి నాయకత్వాన్ని గుర్తించిన రాజుచే శ్రీమూలం ప్రజాసభకు ప్రతినిధిగా 1911లో ఎన్నుకోబడి దాదాపు 28 సంవత్సరాలు దళితుల విద్య, స్కాలర్‌షిప్పులు, భూపంపిణీ తదితర హక్కుల సాధనకై కృషిచేసాడు. కేరళలో కమ్యూనిజం వేళ్ళూనని కాలంలో అయ్యంకాళి చేసిన మొట్టమొదటి వ్యవసాయ కూలీల సమ్మె చరిత్రాత్మకం. అయ్యంకాళి జీవితం పోరాటాల సమాహారం. కేరళ సవర్ణ సమాజం గుండెలపై ఎడ్లబండి పరిగెత్తించి, అణగారిన కులాల హక్కులకు రాజబాట వేసిన సాంఘిక విప్లవ యోధుడు అయ్యంకాళి అని ప్రముఖ ఉద్యమకారుడు, బొజ్జా తా రకం ప్రస్తుతించారు. ఆ విలువండి యాత్ర నేటికీ సమాజంలో కులవివక్ష వ్యతిరేకతకు సాక్షీభూతమైందనిపిస్తుంది.



ప్రొ|| ఇ.సుధారాణి
డా||బి.ఆర్.అంబేద్కర్
సార్వత్రిక విశ్వవిద్యాలయం
9912319439







శనివారంనాడు తెలంగాణ భవన్‌లో టిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ బిజీబిజీగా గడిపారు. ఆయనకు పార్టీ నేతలు, కార్యకర్తల నుంచి అభినందనలు, శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కెటిఆర్‌ను కలిసిన వారిలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఉన్నారు.



అందమైన భాష తెలుగు

సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం

మనతెలంగాణ/హైదరాబాద్ : భారతీయ భాషల్లో తెలుగు భాష అత్యంత సౌందర్యమైన భాష అని, దాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిదని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. శనివారం తెలుగు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాహిత్య రంగంలో విశేశ కృషి చేసిన 10 మందికి బుర్రా వెంకటేశం సాహితీ పురస్కారాలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బుర్రా వెంకటేశం, విశిష్ట అతిథిగా ప్రముఖ సినీనటులు, దర్శకులు, నిర్మాత ఆర్.నారాయణమూర్తిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, ప్రస్తుతం పిల్లలు మాతృభాషకు దూరమై, అన్య భాషలతో ఏదోసాధిస్తామని వెంపర్లాడుతున్నారని పేర్కొన్నారు. తమిళులు, కన్నడిగులు తమ భాషను ప్రేమించినంతగా తెలుగు వారు తమ మాతృ భాష పట్ల అభిమానం చూపలేకపోతున్నారని ఆదేవన వ్యక్తం చేశారు. సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ, దోపిడీకి గురైన పీడిత ప్రజల పక్షాన నిలబడ్డవారే అసలు సిసలు కవులుగా రాణిస్తారని అన్నారు. వ్యక్తుల మధ్య అహకారం ఉండకూడదని, అది మానవ సమాజాన్ని దహించి వేస్తుందని చెప్పారు. పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఎస్.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, దశాబ్దాలపాటు సాహిత్యరంగంలో బహుముఖీనంగా కృషి చేసిన సాహిత్య వేత్తలను గుర్తించి పూర్తి పారదర్శకంగా పురస్కార గ్రహీతలను ఎంపిక చేశామని తెలిపారు. వచ్చే ఉగాది నాటికి అన్ని ప్రమాణాలతో సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనువుగా ఉండే విధంగా ఆరు బయట రంగస్థలాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. పద్యకవిత విభాగంలో డాక్టర్ ఆయాచితం నటేశ్వరశర్మ, వచన కవితలో అన్నవరం దేవేందర్, బాల సాహిత్యంలో చొక్కాపు వెంకటరమణ, కథ/కథానికలో డాక్టర్ ఎం.ఎం.వినోధిని, నవల విభాగంలో అక్కినేని కుటుంబరావు, సాహిత్య విమర్శలో జి.లక్ష్మి నర్సయ్య, నాటకంలో శంకరమంచి పార్థసారథి, అనువాదంలో ఐతా చంద్రయ్య,వచన రచనలో డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణలు సాహితీ పురస్కారాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ అలేఖ్య పుంజాల, విస్తరణ సేవావిభాగం ఇంఛార్జ్ రింగు రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టిఆర్ఎస్‌కు స్వీట్ సిక్స్ టీన్

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేసింది. తాజాగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం టిఆర్ఎస్ గెలుస్తుందని, ఎక్కువ ఓటు బ్యాంకును ఆకట్టుకుంటుందని విడిపి అసోసియేట్స్ సంస్థ చెప్పింది. టిఆర్ఎస్‌కు కనీసంగా 65 స్థానాలు, 38010% మేర ఓట్ల వాటా ఉంటుందని చెప్పగా దానికంటే ఎక్కువే వచ్చింది. తెలంగాణలో అందరికంటే ఎక్కువగా కెసిఆర్‌కు ప్రజాదరణ ఉన్నట్లు తేలింది. ప్రధానమంత్రి అభ్యర్థిగా కెసిఆర్ రావాలని సుమారు 35% మంది కోరుకుంటుండగా నరేంద్రమోడీ పట్ల 27% మంది, రాహుల్‌గాంధీ పట్ల 28% మంది సానుకూలంగా స్పందించారని విడిపి అసోసియేట్స్ పేర్కొనింది.

దక్షిణాది రాష్ట్రాల్లో యుపిఏ కు సానుకూల పవనాలు

తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ తదితర ఐదు రాష్ట్రాలతో కూడిన దక్షిణ భారతదేశంలో ఎన్‌డిఏకు చేదు అనుభవం తప్పదని, కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏకు ఎక్కువ సానుకూల పవనాలు ఉన్నాయని విడిపి అసోసియేట్స్ పేర్కొనింది. ఈ ఐదు రాష్ట్రాల్లోని మొత్తం 130 స్థానాల్లో యుపిఏకు 41, ఎన్‌డిఏకు 17, ఇతరులకు 38 శాతం చొప్పున ఓట్ల వాటా ఉంటుందని పేర్కొనింది. ఇక సీట్ల పరంగా చూసుకుంటే యుపిఏకు 61, ఎన్‌డిఏకు 12, ఇతరులకు 57 చొప్పున వచ్చే అవకాశం ఉందని పేర్కొనింది. తమిళనాట డిఎంకెకు విజయావకాశాలు ఉన్నాయని, మొత్తం 39 స్థానాల్లో 21 చోట్ల గెలుస్తుందని, అన్నాడిఎంకె 11తో సరిపెట్టుకుంటుందని, బిజెపి, కాంగ్రెస్‌లకు చెరి ఒక స్థానం లభించే అవకాశం ఉందన్నాది. కమల్‌హాసన్, రజనీకాంత్‌లు కలిసి కనీసంగా పది శాతం ఓట్లను ప్రభావితం చేస్తారని పేర్కొనింది. దేశవ్యాప్తంగా చూసుకుంటే ఎన్‌డిఏకు 36%, యుపిఏకు 32%, ఇతరులకు 26% చొప్పు న ఓట్ల వాటా ఉంటుందని పేర్కొనింది. సీట్ల పరంగా చూసుకుంటే ఎన్‌డిఏకు 225, యుపిఏకు 167, ఇతరులకు 150 చొప్పున వస్తాయని అంచనా వేసింది.

మే 3 నుంచి 9 వరకు ఎంసెట్

(మొదటిపేజీ తరువాయి)

స్ట్రీమ్‌కు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 11వ తేదీన ఇసెట్ పరీక్ష జరుగనున్నట్లు పేర్కొన్నారు. మే 20న పిఇసెట్, మే 23, 24 తేదీలలో ఐసెట్, మే 26న లాసెట్, పిజిఎల్‌ఎట్, మే 27 నుంచి 29 వరకు పిజిఇసెట్, మే 30,31 తేదీలలో ఎడ్‌సెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలు నిర్వహించే యూనివర్సిటీలలో ఎలాంటి మార్పులు చోటు చేసుకోలేదు. గత ఏడాది నిర్వహించిన వర్సిటీలే ఈ ఏడాది కూడా యథాతథంగా పరీక్షలు నిర్వహించనున్నాయి. ఎంసెట్, ఇసెట్ పరీక్షలు జెఎన్‌టియుహెచ్ నిర్వహించనుండగా, పిఇసెట్ మహాత్మాగాంధీ యూనివర్సిటీ, ఐసెట్ పరీక్షను కాకతీయ యూనివర్సిటీ, లాసెట్, పిజిఎల్‌సెట్, పిజిఇసెట్, ఎడ్‌సెట్ పరీక్షలను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించనుంది. ప్రవేశ పరీక్షలు నిర్వహించే వర్సిటీలు ఖరారు చేసిన నేపథ్యంలో ఆయా సెట్ల నిర్వహణ కన్వీనర్లను నియమించేందుకు ముగ్గురు సీనియర్ ప్రొఫెసర్ల జాబితా పంపించాల్సిందిగా ఉన్నత విద్యామండలి ఆయా వర్సిటీలకు లేఖలు రాయనుంది. వర్సిటీల నుంచి జాబితా వచ్చిన తర్వాత వారిలో ఒకరిని కన్వీనర్‌గా ఎంపిక చేయనున్నారు.

ప్రవేశ పరీక్షల షెడ్యూల్

పరీక్ష పేరు	తేదీ
టిఎస్ఎంసెట్(జెఎన్‌టియుహెచ్)	మే 3,4,6(ఇంజనీరింగ్) మే 8,9(అగ్రికల్చర్)
టిఎస్ఇసెట్(జెఎన్‌టియుహెచ్)	మే 11
టిఎస్‌పిఇసెట్(ఎంజి యూనివర్సిటీ)	మే 20
టిఎస్ఐసెట్(కెయు)	మే 23,24
టిఎస్‌లాసెట్(ఒయు)	మే 26
టిఎస్‌పిజిఎల్‌సెట్(ఒయు)	మే 26
టిఎస్‌పిజిఇసెట్(ఒయు)	మే 27 నుంచి 29 వరకు
టిఎస్ఎడ్‌సెట్(ఒయు)	మే 30,31

బలవంతపు ఏకగ్రీవాలు చెల్లవు

- అసెంబ్లీ సమావేశాలు పెట్టుకోవచ్చు
- మంత్రివర్గాన్నీ ఏర్పాటు చేసుకోవచ్చు
- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్
- పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోండి
- సమస్యాత్మక కేంద్రాల వివరాలు పంపండి
- జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో ఉన్నతాధికారులు



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు నిర్వహించుకోడానికి, మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకోడానికి పంచాయతీ ఎన్నికల ప్రవర్తనా నియమావళితో ఎలాంటి అభ్యంతరం లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి.నాగిరెడ్డి స్పష్టంచేశారు. ఎన్నికల కోడ్‌తో వీటికి సంబంధం లేదన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని, అప్పటి నుంచే ఏకగ్రీవం చేసుకోవచ్చునన్నారు. సచివాలయంలో శనివారం జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్సు జరిగిన అనంతరం నాగిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పంచాయతీ సర్పంచ్ పదవులను ఏకగ్రీవంగా ఎన్నుకునే సంప్రదాయం ఉందని, ప్రభుత్వం కూడా ప్రోత్సాహకం ఇస్తుందని, కానీ బలవంతంగా ఏకగ్రీవం అయ్యేలా ప్రయత్నించినా, చట్టవిరుద్ధమైన తీరులో వేలం పాటల లాంటివి నిర్వహించినా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్సులో అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సిబ్బంది, పోలింగ్ మెటీరియల్, సెక్యూరిటి ప్లాన్, వాహనాలు, పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ హాళ్లు, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ , స్టోరేజ్ సెంటర్ల గుర్తింపు , బడ్జెట్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు సూచనలు ఇచ్చారు. 25 రోజులలో ఎన్నికలు పూర్తి కావలసిఉన్నందున కలెక్టర్లు పూర్తి సన్నద్ధంగా ఉండాలన్నారు. ఓటర్లకు తెలిసేలా పోలింగ్ స్టేషన్లు, వార్డుల సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. మొదటి, రెండో విడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీలకు రిటర్నింగ్ అధికారుల నియామకం, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, అధికారులకు శిక్షణ, మైక్రో అబ్జర్వర్ల నియామకం, మండలాలకు సహాయ వ్యయ పరిశీలకుల నియామకం వంటి అంశాలపై సమీక్షించారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రింటింగ్, ఓటరు స్లిప్పుల ముద్రణ, వాటిని పంపిణీకి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహణకు మీటింగ్ హాళ్లను ఎంపిక చేయాలన్నారు. జిల్లాల వారిగా పోలింగ్ స్టేషన్లలో సెక్యూరిటి ప్లాన్‌ను రూపొందించుకోవాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వెబ్ క్యాస్టింగ్, వీడియో రికార్డింగ్‌లకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మంచి లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో : ఎస్‌కె.జోషి

మూడు విడుతలలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు, కమిషనర్లు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.కె.జోషి కోరారు. ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డితో కలిసి సిఎస్, డిజిపి మహేందర్ రెడ్డి వారి విభాగాలపై అధికారులతో సమీక్షించారు. సిఎస్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు అందరు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎవరైన పోలింగ్ సిబ్బందికి అనుకోని సంఘటన ఎదురైనప్పుడు తక్షణమే స్పందించేలా ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. డిజిపి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించిన అనుభవం ఉందని, ఎక్కడా రీపోల్ జరగలేదని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, అదే లక్ష్యంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ముందుకు వెళ్లాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ టీమ్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ , హోం శాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది , పంచాయతీ రాజ్ కమిషనర్ నీతూప్రసాద్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి అశోక్ కుమార్, శాంతి భద్రతల అదనపు డిజి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

17నుంచి అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రోటెమ్ స్పీకర్‌గా ఖరారయ్యారు. గవర్నర్ నరసింహన్ ఆయనచేత రాజ్‌భవన్‌లో ఈ నెల 16వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు బాధ్యతలు తీసుకోనున్నారు. ఆ మరుసటి రోజు నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అమోఘమైన మెజారిటీతో తమను గెలిపించారని, ఆ స్ఫూర్తితో తెలుగు పంచాంగం ప్రకారం ఉత్తరాయణ పుణ్యకాలమైన ఏకాదశి తిథినాడు (జనవరి 17న) శాసనసభా సమావేశాలను ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి కెసిఆర్ పేర్కొన్నారు. ప్రోటెమ్ స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్ బాధ్యతలు స్వీకరించే ముహూర్తాన్ని కూడా ఒక రోజు ముందు, దశమి తిథి (జనవరి 16న) నాడు ఉండేలా నిర్ణయించినట్లు తెలిపారు. శాసనసభ కార్యదర్శి, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి కెసిఆర్ శనివారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన సమావేశం అనంతరం ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్ ఎంపిక, శాసనసభ సమావేశాల షెడ్యూలు ఖరారైనట్లు ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొనింది.

శాసనసభ సమావేశాలు జరిగేది ఇలా

పవిత్ర ఉత్తరాయణ పుణ్యకాలమైన ఏకాదశి శుభ తిథి నాడు (జనవరి 17న) రాష్ట్ర తొలి శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. ప్రోటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్ శపథ స్వీకారం తీసుకున్న మరుసటి రోజు (జనవరి 17న) అసెంబ్లీ సమావేశాలు ఉదయం 11.30 గంటలకు ఆయన అధ్యక్షతన ప్రారంభమవుతాయి. ఇటీవల ఎన్నికైన కొత్త శాసన సభ్యులు శపథ స్వీకారం చేస్తారు. శాసనసభాపక్ష నేతగా ముఖ్యమంత్రి కెసిఆర్ తొలుత ప్రమాణ స్వీకారం చేస్తారు. అప్పటికి ప్రతిపక్ష నేత ఎన్నిక ప్రక్రియ పూర్తయినట్లయితే రెండవ వ్యక్తిగా వారికి ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారు. కానీ ప్రస్తుతానికి మంత్రిగా ఉన్న హోం మంత్రి మహమూద్ అలీ శాసనమండలి సభ్యులు కాబట్టి ఇక్కడ ప్రమాణ స్వీకారానికి ఆస్కారం లేదు. ఆ తర్వాత అక్షరమాల ప్రకారం మిగిలిన సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుంది. ఈ కార్యక్రమం సుమారు రెండు గంటల పాటు కొనసాగుతుంది. ఆ తర్వాత మధ్యాహ్నం జూబిలీ హాల్ ప్రాంగణంలోని 'కౌన్సిల్ లాన్' లో శాసన సభ సభ్యులకు లంచ్ ఉంటుంది. మధ్యాహ్న భోజన విరామం అనంతరం పునః ప్రారంభమయ్యే సెషన్‌లో కొత్త స్పీకర్ ఎన్నిక, దానికి సంబంధించిన షెడ్యూల్ ప్రకటన, నామినేషన్ కార్యక్రమాలు వుంటాయి.

జనవరి 18న స్పీకర్ ఎన్నిక

శాసనసభ సమావేశాల్లో రెండవ రోజైన జనవరి 18న కొత్త స్పీకర్ ఎన్నిక, ప్రకటన వుంటాయి. ఆ తరువాత నూతనంగా ఎన్నికైన స్పీకర్‌ను ముఖ్యమంత్రి కెసిఆర్, ప్రతిపక్ష నాయకులు, ఇతర రాజకీయ శాసనసభా పక్ష నాయకులు స్పీకర్ స్థానానికి తోడ్కొని వెళ్ళి శాసన సభాపతి స్థానంలో కూర్చోబెడతారు. అ తరువాత నూతనంగా ఎన్నికైన స్పీకర్ అధ్యక్షతన సభాకార్యక్రమాలు జరుగుతాయి. అయితే స్పీకర్ ఎవరనే అంశంపై ఉత్కంఠ నెలకొనింది. గత శాసనసభలో స్పీకర్‌గా వ్యవహరించిన మధుసూధనాచారి ఈసారి ఓడిపోయినందువల్ల కొత్తగా స్పీకర్ అవకాశం ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. కొత్తగా ఎన్నికైన స్పీకర్ అధ్యక్షతన వివిధ పార్టీల శాసనసభాపక్ష నేతలతో బిఎసి (బిజనెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం జరుగుతుంది. సభా కార్యకలాపాలను ఎన్ని రోజులు నిర్వహించాలి, ఏయే అంశాలను చర్చించాలి తదితర ఎజెండాపై చర్చ జరుగుతుంది. తొలి శాసనసభ సమావేశాలు కాబట్టి సభను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ చేసే ప్రసంగం షెడ్యూలు గురించి బిఏసి సమావేశం నిర్ణయం తీసుకుంటుంది. ఆ మరుసటి రోజున (జనవరి 19న) ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం వుంటుంది. ఆ మర్నాడు జనవరి 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఉభయ సభల్లో ప్రవేశపెట్టడం, దానిపై చర్చ జరిగిన అనంతరం సభలు ఆమోదం తెలపడం తదితర కార్యక్రమాలు ఉంటాయి.

ఆరు సార్లు ఎమ్ఎల్ఏగా ఎన్నికైన ముంతాజ్‌ఖాన్

ప్రస్తుత అసెంబ్లీకి ప్రోటెమ్ స్పీకర్‌గా ఎన్నికైన మజ్లిస్ పార్టీకి చెందిన చార్మినార్ శాసనసభ్యుడు 1994 నుంచి ఎంఎల్‌ఏగా కొనసాగుతున్నారు. 1994 నుంచి వరుసగా ఐదుసార్లు యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి గెలిచారు. ఈసారి ఎన్నికల్లో చార్మినార్ నుంచి పోటీ చేసి గెలిచారు. దాదాపు పాతికేళ్ళుగా శాసనసభ్యుడిగా ఉన్న ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ఈసారి ప్రొటెమ్ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. నగరానికి చెందిన ముస్లిం మైనారిటీ వ్యక్తిని, టిఆర్ఎస్‌కు 'ఫ్రెండ్లీ' పార్టీగా ఉన్న ఎంఐఎంకు చెందిన సభ్యుడిని ప్రోటెమ్ స్పీకర్‌గా ప్రకటించడం గమనార్హం.

కేంద్రం వివక్ష

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం తెలంగాణకు మరో న్యాయమా అని ప్రధాని మోడీని సూటిగా ప్రశ్నించారు. ఈ విధానం ఇలాగే కొనసాగితే తాజా శాసనసభ ఎన్నికల్లో 103 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతైన విధంగానే బిజెపికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే పరిస్థితి పునరావృతం అవుతుందని హెచ్చరించారు. టిఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వ్యవహారం నోటితో పొగిడి నొసటితో వెక్కిరించినట్లు ఉందని అన్నారు. తెలంగాణలో అమలవుతున్న మిషన్ భగీరథ, 'మిషన్ కాకతీయ'ను దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు అధ్యయనంచేసి అమలు చేసేందుకు సిద్ధమవుతున్నా కేంద్రం మాత్రం ఈ ప్రాజెక్టుకు ఎలాంటి ఆర్థిక సహాయం అందించలేదని దుయ్యబట్టారు. పార్లమెంట్‌లో టిఆర్ఎస్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల సమావేశాల్లో మిషన్ భగీరథ, మిషన్‌కాకతీయపై అడిగిన ప్రశ్నకు కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్‌రాం మేఘువాల్ ఇచ్చిన సమాధానంపై కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ భవిష్యత్ తరాలకు సాగు, తాగునీరు అందించేందుకు ప్రవేశపెట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీతి అయోగ్ అనేక పర్యాయాలు ప్రశంసలు తెలిపిందని, క్షేత్ర స్థాయిలో అధ్యయనంచేసి ఈ రెండు ప్రాజెక్టులకూ కలిపి రూ.24,205 కోట్ల మేర ఆర్థిక సహాయం చేయాల్సిందిగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేసిందని, మూడేళ్ళు దాటినా ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను అమలు చేయలేదని, ఎందుకు తాత్సారం చేస్తుందో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టులను రామన్ మెగసెసె అవార్డు గ్రహీత, 'వాటర్ మాన్' రాజేందర్ సింగ్, నీతి యోగ్ మాజీ ఉపాధ్యక్షుడు అరవింద్ పణగరియా ప్రశంసించడంతో పాటు కేంద్రానికి నిధులకోసం సిఫార్సులు చేసిన అంశాన్ని ప్రధాని మోడి ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. తెలంగాణలో బిజెపికి ఉనికి లేదనే దురుద్దేశం, వివక్షపూరిత వైఖరితోనే కేంద్ర ప్రభుత్వం ఈ దారుణానికి ఒడిగట్టిందని కెటిఆర్ నిప్పులు చెరిగారు. ఇటీవల మహారాష్ట్రలోని తాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద రూ. 34,800 కోట్లను విడుదల చేసిందని, జాతీయ, ఆంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు మాత్రం మొండిచేయి చూపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి విధానాలు పరాకాష్టకు చేరుకున్నాయన్నారు. ఈ విధానాలను మార్చుకోకపోతే తెలంగాణలో బిజెపి తగిన చేదు అనుభవాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. మిషన్ భగీరథను అమలు చేయాలన్న ఉద్దేశంతో పలు రాష్ట్రాల ప్రతినిధులు తెలంగాణకు వచ్చి అధ్యయనం చేస్తున్నారని, 'హడ్కో' రెండుసార్లు అవార్డు ఇచ్చిందని, ప్రతిష్ఠాత్మక 'స్కోచ్' సంస్థ కూడా అవార్డు ఇచ్చిందని గుర్తుచేశారు. స్వయంగా దేశ ప్రధాని మోడీ గజ్వేల్‌లో మిషన్ భగీరథను ప్రారంభించి ప్రశంసించారని కెటిఆర్ ప్రస్తావించారు. ఆ తర్వాత ప్రధాని 'మన్ కీ బాత్'లో సైతం మిషన భగీరథ ప్రస్తావన తెచ్చి పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలంటూ పిలుపు ఇచ్చారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంతోపాటు 95 శాతం నిధులను కేంద్రం



ఇస్తోందని గుర్తుచేశారు. పునర్విభజన చట్టంలో ఉన్న హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కెటిఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరం లాంటి తెలంగాణ వరప్రదాయని ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇచ్చేందుకు కేంద్రం ముందుకు రావడం లేదని నిందించారు.

పార్లమెంట్‌లో ప్రధాని మోడీని నిలదీస్తాం

నీళ్లు, నిధులు, నియామకాల అంశాలపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజల అకాంక్షలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిరంతరం శ్రమిస్తూ ఉంటే కనీసం విభజన హామీలను కూడా కేంద్రం నెరవేర్చడం లేదని కెటిఆర్ దుయ్యబట్టారు. ఈ విధానాన్ని మార్చుకుని తెలంగాణ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయని పక్షంలో మోడి విధానాలను పార్లమెంట్‌లో ఎండగడతామని హెచ్చరించారు. అయితే నిధులైనా ఇవ్వండి లేదా తెలంగాణకు నిధులు ఇవ్వబోమనే ప్రకటనను స్పష్టంగా చెప్పండంటూ మోడిని కెటిఆర్ ప్రశ్నించారు. కేంద్రం తెలంగాణకు నిధులు ఇవ్వం అని స్పష్టం చేస్తే తెలంగాణ ప్రభుత్వం సొంతంగా ప్రాజెక్టులు నిర్మించుకుంటుందని స్పష్టంచేశారు. విభజన హామీల్లో ఉన్న బయ్యారం ఉక్కు పరిశ్రమ, గిరిజన విశ్వవిద్యాలయం, ఖాజిపేట్ కోచ్ ఫ్యాక్టరీల పై కేంద్రం తక్షణం వైఖరి ప్రకటించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. హామీల మేరకు నిధులు ఇస్తారా లేక తెలంగాణ ప్రభుత్వమే బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని సొంత నిధులతో నిర్మించుకోమంటారో స్పష్టం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి కెటిఆర్ సవాల్ విసిరారు. బయ్యారం ఉక్కుపరిశ్రమను ఎట్టిపరిస్థితుల్లోనైనా నిర్మించి తీరుతామని స్పష్టంచేశారు.

బిజెపికి డిపాజిట్లు రావు

తెలంగాణ అభివృద్ధిని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి విస్మరిస్తుంటే తెలంగాణ ప్రజలు ఎప్పటికప్పుడు గుణపాఠం నేర్పుతున్నారని కెటిఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటారనే విషయం ఇప్పటికైనా మోడీకి అర్థం కాకపోవడం విచారకమన్నారు. శాసనసభ ఎన్నికల్లో 103 నియోజకవర్గాల్లో తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పుతో డిపాజిట్లు కోల్పోయిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి 2004లో వచ్చిన ఒక్క స్థానం కూడా రాదన్నారు. అలాగే బిజెపి 17 పార్లమెంట్ స్థానాల్లో డిపాజిట్లను కోల్పోవడంతో పాటు తెలంగాణలో కనుమరుగై పోతుందని మందలించారు.



గవర్నర్‌ను కలిసిన కేంద్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆడిట్

మన తెలంగాణ/హైదరాబాద్ : గవర్నర్ నరసింహన్‌ను కేంద్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆడిట్ అజిబ్ సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా అజిబ్‌సింగ్ కలిసినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

మూడురోజులు పొడి వాతావరణం

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు పొడి వాతావరణం ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం చలి తీవ్రత తగ్గిందని తెలిపారు. తెలంగాణలో ఆగ్నేయ దిశ నుంచి ఏపిలోని ఈశాన్య దిశ/తూర్పు దిశ నుంచి గాలులు వీస్తున్నాయని అధికారులు తెలిపారు. కోస్తా ఆంధ్రాలో రానున్న మూడురోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఉదయం సమయంలో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. రాయలసీమలో రాగల మూడు రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందన్నారు.

ఏప్రిల్ నాటికి కాళేశ్వరం సిద్ధం చేయండి



మనతెలంగాణ/ధర్మారం : ఏప్రిల్ నాటికి కాళేశ్వరం పరిధిలోని పంపుహౌస్‌ల పనులు పూర్తి చేయాలని, వచ్చే ఖరీఫ్‌కు నీళ్లు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సిఎంఒ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం 6, 7 ప్యాకేజీలతో పాటు రామడుగు మండలం 8వ ప్యాకేజీ పనుల్ని శనివారం నాడు పరిశీలించారు. నందిమేడారంలోని అరవ ప్యాకేజీ పరిధిలో పంపుహౌజ్‌లు, మేడారం రిజర్వాయర్, అప్రోచ్ కెనాల్, 7వ ప్యాకేజీ పరిధిలోని అడిట్ వన్ మరియు టు తోపాటు సొరంగ పనుల్ని, ఎనిమిదవ ప్యాకేజీలోని పంపుహౌజ్‌ల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు సర్ఫరాజ్ అహ్మద్, అల్లంరాజు, దేవసేన, సిఎం ఓఎస్‌జి దేశ్‌పాండేతో కలిసి క్షుణంగా పరిశీలన చేశారు. పనుల్లో వేగం పెంచాలని, ప్రతి పంపును ఏప్రిల్ నాటికి సిద్ధం చేయాలని, ఈ ఖరీఫ్‌కు నీరు అందించాలని సిఎం దృఢ సంకల్పంతో ఉన్నారని స్మితా సబర్వాల్ తెలిపారు. ఇరిగేషన్, అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు, యుద్ధ ప్రాతిపాదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, కాళేశ్వరంకు గుండె కాయలాంటి 6వ ప్యాకేజీలో పనులు వేగంగా నడుస్తున్న 7వ ప్యాకేజీలో మందకొడిగా సాగుతున్నాయని వెంటనే యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించాలని సిఇ నల్ల వెంకటేశ్వర్లకు సూచించారు. స్మితా సబర్వాల్‌తో పాటు కలెక్టర్లు సర్ఫరాజ్ అహ్మద్, అల్లం రాజు, దేవసేన, జెసి వనజాదేవి, ఆర్‌డిఓ ఉపేందర్‌రెడ్డి, సిఎం ఓఎస్‌డి దేశ్‌పాండే, ఎస్‌ఇ కె. సుధాకర్‌రెడ్డి, ఇఇ నూనె శ్రీధర్, తహసీల్దార్ పి. సంపత్, సిఐ జి. నరేందర్, ఎస్‌ఐ కె. ప్రేమ్‌కుమార్, ఎఇలు ఉపేందర్, రాకేష్, శ్రీనివాస్, పర్శరాంగౌడ్, అభినయ్,పాల్గొన్నారు.

బాల గంగాధర్ మృతి తీరనిలోటు



మనతెలంగాణ /జగిత్యాల : సీనియర్ పాత్రికేయులు, జగిత్యాలకు చెందిన బుర్ర బాల గంగాధర్ ఆకస్మిక మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటని పలువురు అభివర్ణించారు. జగిత్యాలకు చెందిన తొలితరం పాత్రికేయుడు, చాటింపు పక్షపత్రిక ఎడిటర్, సిటికేబుల్, జీ న్యూస్ తదితర ఛానల్‌లలో పని చేసిన బాల గంగాధర్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతికి జగిత్యాల ప్రెస్‌క్లబ్ సభ్యులు శనివారం సంతాపాన్ని ప్రకటించారు. టిఎన్‌జిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల గంగాధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ పాత్రికేయ వృత్తిలో జీవితాంతం విలువలకు కట్టుబడి పని చేసిన వ్యక్తి ఈ రోజు మన మధ్య లేక పోవడం బాధాకరమన్నారు. ఆయన మృతి పాత్రికేయ రంగానికి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు సిహెచ్‌వి ప్రభాకర్ రావు, టివి సూర్యం, సిరిసిల్ల శ్రీనివాస్, కుర్మాచలం శ్రీనివాస్, ఇమ్రాన్, మహేష్, రాజేందర్‌రెడ్డి, సంపూర్ణచారి, గుండేటి రాజు, మారుతి, శ్రవన్, రాజేంద్రశర్మ, లక్ష్మణ్‌తో పాటు బీసీ ఐకాస కన్వీనర్ హరిఅశోక్‌కుమార్, ఫించనర్ల సంఘం నాయకులు గౌరిశెట్టి విశ్వనాథం, ఈశ్వరయ్య, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

జూరాల ప్రాజెక్టు వద్ద రైతుల ఆందోళన



మన తెలంగాణ/అమరచింత : జూరాల ప్రధాన కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాజెక్టు అధికారులు షెట్టర్స్‌ను తెరవాలని ప్రయత్నించడంతో ఎడమ కాల్వ ఆయకట్టు రైతులు నందిమల్ల, మూలమల్ల రైతులు అక్కడికి చేరుకొని అధికారుల ప్రయత్నాలను విఫలం చేస్తు రైతులు ఆందోళన చేశారు. అధికారులు, రైతుల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడడంతో తహశీల్దార్లు జెకె.మోహన్, కళ్యాణి, సిఐ శంకర్, ఎస్‌ఐ రామస్వాములు బందోబస్త్‌తో అక్కడికి చేరుకున్నారు. శనివారం ఆందోళన కారుల యొక్క సమస్య లను ప్రాజెక్టు అధికారులు చర్చించారు.ప్రాజెక్టులో నీటి మట్టం పడిపోయిందని నీటిని విడుదల చేయా లని రబీ సీజన్ ఆరుతడి పంటలకు జూరాల నీటిని విడుదల చేయాలని రైతులు కోరారు. నిల్వ ఉన్న నీటిని తాగు నీటి కోసం మాత్రమే ఉపయోగించుకోవాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. మండల రైతుల పొలాలకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని కోరారు.

ముమ్మరంగా వరి నాట్లు



వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

మనతెలంగాణ/దండేపల్లి : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు వరి నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. బావులు కరెంట్ మోటార్ల కింద వరి పంటను సాగు చేస్తున్నారు. ఈ రబీ సీజన్‌లో గూడెం సత్యనారాయణ స్వామి ఎత్తిపోతల పథకం నీటిని విడుదల చేయడంతో ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో వరి పంటను సాగు చేయడంలో రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎత్తిపోతల నీరు రావడం వల్ల గ్రామాలలో పలువురు రైతులు అధిక విస్తీర్ణంలో వరి నాట్లు వేస్తున్నారు. గ్రామాలలో ఒకే సారి రైతులందరు వరి నాట్లు వేయడం వల్ల రైతు కూలీల కొరత అధికమైంది. రైతులకు కూలీల కొరత ఏర్పడడంతో వరి నాట్లు ఆలస్యమవుతున్నాయని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన వరి నాట్ల సందడి కనిపిస్తుంది.



మనోవేదన కాదు.. పార్టీ పటిష్టత ముఖ్యం

- నంబర్ వన్‌గా ఉండే జిల్లా.. తలదించుకోవాల్సి వచ్చింది
- అభివృద్ధికి బాధ్యత తీసుకుంటా : తుమ్మల



మన తెలంగాణ/ఖమ్మం జిల్లా/సత్తుపల్లి : ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని... కారణాలు.. కారకులు గురించి మనోవేదనకు గురి కాకుండా పార్టీ పటిష్టత కోసం మరింత కష్టించి పని చేసి అవాంతరాలను అధిగమించాలంటూ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. శనివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశంలో తుమ్మల ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్ 1 స్థానంలో ఉండేదని రాజకీయాల్లో కూడ అదే స్థాయిలో ఉన్నప్పటికీ తాజా ఎన్నికల్లో జిల్లా తలదించుకునే పరిస్థితికి కారణాలు బహిరంగ సత్యాలని ముఖ్య మంత్రి కెసిఆర్ సైతం స్పష్టమైన సమాచారం ఉందని క్రమశిక్షణా చర్యలు అంశం తన స్థాయిలోది కాదని ప్రతీది అధిష్టానం సమయానుకూలంగా పరిశీలిస్తుందన్నారు. పార్టీకోసం అంకితభావంతో పనిచేస్తే పదవులు వాటంతట అవే వరిస్థాయి తప్ప.... తప్పుడు మార్గాల్లో రాజకీయాలు చేస్తే పార్టీ బజారున పడుతుందన్నారు. ఎన్నికల్లో ఓటమి సహజమేనని అయిన పార్టీని నమ్ముకుని రాజకీయాలు చే యాలని గతంలో తాను ఓటమి చెంది 10 ఏళ్లు ప్రభుత్వానికి దూరం గా ఉండి కూడా నిత్యం పార్టీ పటిష్టతను కాపాడుకుంటూ ప్రజల్లో ఉండబట్టే తనకు టిఆర్ఎస్‌లో అవకాశం దక్కిందని కార్యకర్తలు, అభిమానులందరికి ఎంత బాధ ఉందో అదంతా తాను ఒక్కడికే ఉన్నదని అయినప్పటికి నేనే మిమ్మల్ని కలవడానికే మీ ముందుకు వచ్చా అన్నారు. స్థానిక సంస్థల్లో టిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలన్నారు. గతంలో మాదిరిగా ఎన్నిక ఏదైనా విజయం మనవైపే ఉండాలని గ్రామీణ స్థాయి నుంచి ప్రతి అవాంతరాలను గమనిస్తూ ముందుకెళ్ళాలన్నారు. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయాలని గోదావరి జలాలను మన ప్రాంత చెరువులకు తీసుకురావాలని ముఖ్యమంత్రి సహకారంతో రూ.1300 కోట్లు సాదించి కెసిఆర్‌తో శంకుస్థాపన చేయించామని అదేవిధంగా ప్రారంభోత్సవం జరిగేలా కృషి చేస్తానన్నారు. 30 ఏళ్ల తన రాజకీయ జీవితంలో సత్తుపల్లి అభివృద్ధిని ఎక్కడ ఏ స్థాయిలో ఉన్నా మరువలేదని, గోదావరి జలాలను సత్తుపల్లికి తేవడమే తన ఆఖరి కోరిక అన్నారు.

జిల్లాలో టీఆర్ఎస్ ఓటమి కారకులను సస్పెండ్ చేయాలి

జిల్లాలో పార్టీ ఓటమికి కారకులైన వారిని సస్పెండ్ చేయాలంటు నినాదాలు చేశారు. తక్షణమే చర్యలు తీసుకోకుంటే రానున్న వరుస ఎన్నికల్లోను పరాభవం తప్పదంటు నినాదాలు చేశారు. ఇందుకు స్పందిచిన తుమ్మల బాల అరిష్టాల గురించి ప్రతి సారి చర్చ అనవసర అని చీకట్లో తప్పులు చేసిన వారి వివరాలు సీఎం దగ్గర ఉన్నాయని చర్యలు నా స్దాయిలో ఉండవని పార్టీ అదిష్టానం నిర్ణయిస్తుందన్నారు. మండల కమిటీలతో గ్రామ పంచాయితీ అభ్యర్దుల ఎంపిక జరుగుతుందని, కష్టపడి పనిచేసి విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిడమర్తి రవి, డిసిసిబి మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, 5 మండలాల అధ్యక్షులు, ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, పార్టీ అధ్యక్షులు, నాయకులు హాజరయ్యారు.

8న వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం

మనతెలంగాణ/తిరుమల ప్రతినిధి : శ్రీవారి దర్శనం కోసం వచ్చే వయోవృద్ధులు, దివ్యాంగులకు, 5 సంవత్సరాలలోపు చంటిపిల్లల తల్లిదండ్రులకు టిటిడి సంతృప్తికరంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి నెలా రెండు సామాన్య దినాల్లో వీరికి ప్రత్యేక దర్శనాలు కల్పిస్తోంది. ఇందులోభాగంగా జనవరి 8వ తేదీన వయోవృద్ధులు(65 సం॥ పైబడిన వారు), దివ్యాంగులకు 4 వేల టోకెన్లను టిటిడి జారీ చేయనుంది. ఉదయం 10 గంటల స్లాట్‌కు వెయ్యి, మధ్యాహ్నం 2 గంటలకు 2 వేల టోకెన్లు, 3 గంటల స్లాట్‌కు వెయ్యి టోకెన్లు జారీ చేస్తారు. వృద్ధులు, దివ్యాంగులు రద్దీ రోజుల్లో తిరుమలకు వచ్చి ఇబ్బందులు పడకుండా, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టిటిడి కోరుతోంది. ఎస్వీ మ్యూజియం ఎదురుగా గల కౌంటర్ల వద్ద వృద్ధులు, దివ్యాంగులకు ప్రతిరోజూ 1400 టోకెన్లు జారీ చేస్తున్నారు. ఇక్కడ ఉదయం 7 గంటల నుండి ప్రారంభించి రెండు స్లాట్లకు సంబంధించిన టికెట్లు కేటాయిస్తారు. ఆ తరువాత ఉ. 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామివారి దర్శనం కల్పిస్తారు. 5 సంవత్సరాలలోపు చంటిపిల్లలను, వారి తల్లి దండ్రులను జనవరి 9వ తేదీన ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సుపథం మార్గం ద్వారా దర్శనానికి అనుమతిస్తారు..

వాగ్దానాలను బిజెపి తుంగలో తొక్కింది

మన తెలంగాణ/హైదరాబాద్ : జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల ఫెడరేషన్లు ఐక్యంగా జనవరి 8 మరియు 9వ తేదీల్లో జరప నున్న దేశవ్యాప్త సమ్మెకు ఏఐవైఎఫ్ (ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్) పూర్తి మద్ధతు ప్రకటిస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం నాలుగున్నర ఏళ్లుగా ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తుందని ఆరోపించారు. కార్మికులు, రైతులు వ్యవసాయ కూలీలు, సామాజిక తరగతుల బ్రతుకులను మోదీ దిగజార్చుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ అనుకూల విధానాల వలన నిత్యావసర ధరలు పెరిగి పోతున్నాయని, కార్మికుల జీవన ప్రమాణాలు దిగజారుతున్నాయని ఆయన ఆరోపించారు. రైతాంగానికి గిట్టుబాటు ధర, నాణ్యమైన ఎరువులు, విత్తనాల సరఫరా లేకపోవడంతో ఆత్మహత్యలు పెరిగాయని, బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను తుంగలో తొక్కిందని ఆయన విమర్శించారు. న్యాయమైన డిమాండ్ల సాధనకై కార్మికసంఘాలు ఐక్యంగా చేస్తున్న 2 రోజుల సమ్మెకు ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సంపూర్ణ మద్ధతు ప్రకటిస్తుందన్నారు.

డిస్‌ప్లే బోర్డుల ద్వారా భక్తులకు సమాచారం



మనతెలంగాణ/తిరుమల ప్రతినిధి : శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు తిరుపతిలోని రైల్వే స్టేషన్, బస్టాండులో దిగగానే శ్రీవారి ఆలయం, స్థానికాలయాల సమాచారాన్ని డిస్‌ప్లే బోర్డుల ద్వారా తెలియజేయాలని టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలో గల సమావేశ మందిరంలో శనివారం సీనియర్ అధికారులతో ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుపతిలోని ముఖ్య కూడళ్లలోనూ తిరుమల, తిరుపతిలోని ఆలయాల దర్శనవేళలు, ఆర్జితసేవలు, వసతి గదులు తదితర సమాచారాన్ని ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డుల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. సర్వదర్శనం, దివ్యదర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు పొందిన భక్తులు వారికి కేటాయించిన సమయంలోనే క్యూకాంప్లెక్స్‌లోకి చేరుకునేలా తిరుమలలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. తిరుమలలో రద్దీ రోజుల్లో భక్తులు లగేజి ఎక్కడ డిపాజిట్ చేయాలి, ఎక్కడ తిరిగి పొందాలి అనే విషయాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. రథసప్తమినాటికి మాడ వీధుల్లో ఎస్వీబీసీ, రేడియో బ్రాడ్‌కాస్టింగ్, సిసిటివి వైర్లు బయటకు కనిపించకుండా భూగర్భ కేబుల్ వ్యవస్థను పూర్తి చేయాలన్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న శ్రీవారి కల్యాణోత్సవాల్లో భక్తులకు ఆయా భాషల సప్తగిరి మాసపత్రికను ఉచితంగా పంపిణీ చేయాలని ఈవో ఆదేశించారు. వచ్చే ఏడాది నాటికి డైరీలు, క్యాలెండర్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే భక్తులకు మరింత వేగంగా సులభతరంగా పోస్టల్ శాఖ ద్వారా బట్వాడా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం ముఖ్య నగరాల్లో ఉన్న టిటిడి సమాచార కేంద్రాల్లో డైరీలు, క్యాలెండర్లు నిల్వ ఉంచుకుని, అక్కడినుండే భక్తులకు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నాటి యువతకు మన పండుగలు, వాటి విశిష్టత, సంప్రదాయాల గురించి, ప్రజలకు యోగా ప్రాముఖ్యత తెలియజేసేలా ఎస్వీబీసీలో ఆకట్టుకునేలా ప్రత్యేక కథనాలు ప్రసారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టిటిడి తిరుపతి జెఈవో పోల భాస్కర్, సివిఎస్‌వో గోపినాథ్‌జెట్టి, చీఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎఫ్ఏసిఏవో ఓ.బాలాజి ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాన్‌బోర్డర్స్ హాస్టల్స్ ఖాళీ చేయాలి

- అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన ఓయూ వి.సి. ప్రొ. ఎస్. రామచంద్రం
- త్వరలో 20శాతం విదేశీ ప్రొఫెసర్ల నియామకం



మనతెలంగాణ / ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ క్యాంపస్ హాస్టల్స్‌లో నివాసముంటున్న నాన్‌బోర్డర్స్ రానున్న 15 రోజుల్లో ఖాళీ చేయాలని లేకపోతే పోలీసుల సహకారంతో బయటకు పంపించాల్సి వస్తుందని ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎస్. రామచంద్రం హెచ్చరించారు. ఓ.యూ ఆర్‌సియూఇఎస్‌లో శనివారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్ గోపాల్‌రెడ్డి, ఓఎస్‌డి ప్రొఫెసర్ టి.కృష్ణారావులతోపాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, వివిధ శాఖల అధికారులతో కలిసి విలేకరుల సమావేశంలో వైస్‌చాన్స్‌లర్ మాట్లాడారు. గత రెండేళ్ళలో 3500 మంది విద్యార్థులు ఓ.యూలో పిహెచ్. డి అడ్మిషన్ పొందారని చెప్పారు. కొత్తగా చేరిన పిహెచ్. డి విద్యార్థులకు హాస్టల్,మెస్ వసతి కల్పించాల్సిన అవసరముందని, అందువల్ల ఐదేళ్ళ కోర్సు కాలం పూర్తయిన పిహెచ్. డి విద్యార్థులు హాస్టల్స్‌ను ఖాళీ చేయాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. 500 మంది విద్యార్థుల కెపాసిటీతో ఓ.యూ క్యాంపస్ ఐపిఇ పక్కన నిర్మించిన హాస్టల్‌ను వచ్చే మార్చిలో ప్రారంభిస్తామన్నారు. అలాగే 300 విద్యార్థుల కెపాసిటీతో సైఫాబాద్ పిజి కాలేజిలో నిర్మించిన హాస్టల్‌ను కూడా ప్రారంభిస్తామన్నారు. పిజి కాలేజి సికింద్రాబాద్‌లో నిర్మించిన అకాడమిక్ బ్లాక్‌ను కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఓ.యూలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులకు మెరుగైన వసతులు కల్పించేవిధంగా కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రూసా నిధులతో జనవరి 15 నుంచి పనులు మొదలవుతాయని వివరించారు. వివిధ విదేశి యూనివర్సిటీలతో అవగాహన ఒప్పందాలు చేసుకుని విద్యాపరిశోధనల్లో మరింత ముందంజలో ఉండేందుకు కృషి చేస్తున్నామన్నాని చెప్పారు. యూజిసి నుంచి ఓ.యూ 'ఏ' కేటగిరి అటానమస్ పొందినందున త్వరలో 20 శాతం విదేశి అధ్యాపకులను బోధన, పరిశోధనల కోసం నియమిస్తామన్నారు. ఓ.యూలో ఇంక్యుబేషన్ సెంటర్, మెటీరియల్ సైన్స్ రీసర్చ్ సెంటర్, సైబర్ సెక్యూరిటీ అండ్ సైబర్ లా సెంటర్, బయోడైవర్సిటీ సెంటర్, మైక్రోబియల్ ఫర్‌మెంటేషన్‌సెంటర్, తెలంగాణ స్టడీ సెంటర్, డా. బిఆర్ అంబేద్కర్‌సెంటర్‌లను ప్రారంభిస్తున్నామన్నారు. ఆటోమేషన్ ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చిందన్నారు. పరీక్షల విభాగంలో ఆన్‌స్క్రీన్ ఎవాల్యూయేషన్‌తోపాటు సర్టిఫికెట్స్‌ను డిజిటలైజేషన్ చేస్తున్నామని తెలిపారు. పి.హెచ్.డి సిద్ధాంత గ్రంథ సమర్పణకు 'ప్లేగియారిజమ్'' టెస్ట్‌ను ఉపయోగిస్తున్నామని, దీంతో మరింత నాణ్యతా ప్రమాణాలు వస్తున్నాయన్నారు. త్వరలోనే ఫ్యాకల్టీ సమాచారాన్ని కూడా ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. త్వరలో నిర్వహించే టిఎస్‌సెట్ పరీక్షను కూడా ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ డిపార్టుమెంటు ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజి నుంచి ఓ.యూ అధ్యాపకులు ముగ్గురు కీలకమైక సెర్ప్ రీసర్చ్ ప్రాజెక్టును సాధించారని చెప్పారు. డాటా సెంటర్‌ను కూడా త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఓ.యూలో బి.సి స్టడీ సర్కిల్‌ను కొనసాగిస్తూ యూపిఎస్సీ కోచింగ్‌ను విద్యార్థులను అందిస్తున్నామన్నారు. క్యాంపస్‌లో 150 సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఓ.యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. ప్రతాప్‌రెడ్డి, ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ ప్రొ. ఎం.కుమార్, టెక్నాలజి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. ఆర్ శ్యామ్ సుందర్, బియిడి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. రామకృష్ణ, లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. విజయలక్ష్మి, లేడిస్ హాస్టల్ డైరెక్టర్ ప్రొ. నిర్మల, ఓ.యూ ఎస్టేట్ సెల్ డైరెక్టర్ డా. ఎన్. వెంకటేశ్వర్లు, చీఫ్‌వార్డెన్ డా. హరిసింగ్, సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. జితేంద్రకుమార్‌నాయక్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ.రాజేంద్రనాయక్, పిఆర్‌వో డా.ఇ. సుజాత, తదితరులు పాల్గొన్నారు.

16 మండలాలకు ఐదుగురే ఎంఇఒలు



మనతెలంగాణ/మహబూబాబాద్ ప్రతినిధి : విద్యాశాఖ పనులు చూడ విద్యాభివృద్ధి సూన్యం, డిఇఒను కలవాలన్న అత్యంత సులభం, ఎంఇఓను కలవాలన్న ఎనలేని కష్టం, విశ్వదాభిరామ విద్యాశాఖ సమస్యలు వినురవేమ!!. అన్నట్లుగా ఉంది మహబూబాబాద్ జిల్లాలో విద్యాశాఖ పరిస్థితి, జిల్లాలో 16 మండలాలు ఉండగా కేవలం 5గురు మాత్రమే మండల విద్యాశాఖ అధికారులు ఉన్నారు. దీంతో జిల్లాలో పాఠశాలల పనితీరుపై పర్యవేక్షణ లోపంతో విద్యావ్యవస్థ కుంటుపడే పరిస్థితి ఏర్పడింది. ఒక ప్రక్క అసెంబ్లీ ఎన్నికల శిక్షణ, పోలింగ్ విధులు, అనంతరం గ్రామ పంచాయితీ ఎన్నికల శిక్షణ, పోలింగ్ విధులు నిర్వర్తించాల్సిన ఉపాధ్యాయులు మరో ప్రక్క విద్యా సంవత్సరం ముగింపు మరో మూడు నెలలు మాత్రమే ఉండడంతో సిలబస్ పూర్తికాక, 10వ తరగతి ఫలితాలపై ఉపాధ్యాయులు తలపట్టుకుంటున్నారు. ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపధ్యంలో ఉరుకులు పరుగుల మధ్య విద్యార్థులకు పాఠాలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా మండల విద్యాధికారుల కొరతతో ఒక్కొక్కరికీ 3మండలాల బాధ్యతలు అప్పగించడంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల హాజరు. బయోమెట్రిక్‌పై పర్యవేక్షణ కొదవడడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతోంది. ఎంఇఓలకు ఏ ఉపాధ్యాయుడు ఎక్కడ పనిచేస్తున్నాడన్న విషయం కూడా అర్ధంకాని పరిస్థితి ఏర్పడింది. ఉపాధ్యాయులు వార్షిక ఇంక్రిమెంట్ల విషయంలోనూ, సరెండర్ లీవ్ విషయంలోనూ ఎంఇఓను కలవాలంటే కష్టమే అవుతోంది. మహబూబాబాద్ జిల్లాలో బయ్యారం, తొర్రూరు. నెల్లికుదురు, గూడూరు, కొత్తగూడ మండలాలకు మాత్రమే ఎంఇఓలు ఉన్నారు. వారికే బయ్యారం ఎంఇఓకు కురవి మండలం కూడా అప్పగించగా గార్ల, డోర్నకల్ మండలాలు ఎఫ్ఎసి ఇంచార్జిగా ఇచ్చారు. అలాగే తొర్రూరు ఎంఇఓకు పెద్దవంగర అదనపు బాధ్యతలు ఇవ్వడంతోపాటు మరిపెడ, చిన్నగూడూరు మండలాలు ఎఫ్ఎసి ఇచ్చారు. నెల్లికురుదు ఎంఇఓకు నర్సింహులపేట, దంతాలపల్లి ఎఫ్ఎసి ఇచ్చారు. గూడూరు ఎంఇఓకు మహబూబాబాద్, కేసముద్రం మండలాలు ఎఫ్ఎసి ఇచ్చారు. కొత్తగూడ ఎంఇఓకు గంగారం కూడా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఇలా 5గురు ఎంఇఓలనే 16మండలాలకు సర్ధడంతో జిల్లాలో మండల విద్యావ్యవస్థ కుంటుపడుతోంది. మరో ప్రక్క మరిపెడ మండలంలో ఒక్క పిజి హెచ్ఎం కూడా లేకపోవడం విశేషం. తక్షణమే మండల విద్యాధికారులను నియమించి ఉపాధ్యాయ ప్రమోషన్లకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వాన్ని పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలకు కోరుతున్నారు.

పసికందు ఆచూకీ చూపని తల్లిదండ్రులపై కేసు

మన తెలంగాణ/తిరుమలగిరి(సాగర్) : కూతురు ఆచూకీ తెలపని తల్లిదండ్రులపై కేసు నమోదైన సంఘటన మండలంలోని సుంకిశాలతండాలో జరిగింది. ఐసీడీఎస్, పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...సుంకిశాలతండాకు చెందిన రమావత్ సునీత, బాలు దంపతులకు 2018 అక్టోబర్ 17న రెండో సంతానంగా ఆడశిశువు జన్మించింది. మొదటి సంతానం కూడా ఆడశిశువు కావడంతో ఈ శిశువును గ్రామానికి తీసుకరాకుండా ఒంటరిగా గ్రామానికి రావడంతో అంగన్‌వాడీ కార్యకర్తకు అనుమానం వచ్చి వారిని వాకబు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో సమాచారాన్ని ఉన్నతాధికారులకు సమాచారమందించగా సూపర్‌వైజర్ నాగమణి వారికి ఎంత సర్దిచెప్పినా వారు వినకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులపై ఫిర్యాదు చేయగా వారు ఐదు రోజుల్లో తమ పాపను తీసుకొస్తామని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



మన తెలంగాణ/-కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ మీదుగా సరిహద్దులో ఉన్న మహారాష్ట్రకు అక్రమంగా రైళ్లలో రేషన్ బియ్యం రవాణా అవుతున్నట్లు అందిన సమాచారం మేరకు రైల్వే, ఆర్పీఎఫ్, రెవెన్యూ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనపర్చుకున్నారు. శనివారం ఉదయం స్థానిక మండల్ లెవల్ స్టాక్ పాయింట్ వద్ద ఆర్పీఎఫ్ ఎస్సై నర్సింహులు మాట్లాడుతూ శుక్రవారం అర్ధరాత్రి నుండి శనివారం తెల్లవారు జామున వరకు మహారాష్ట్ర వైపు వెళుతున్న అజ్నీ, భాగ్యనగర్, రాంగిరి వంటి ప్యాసింజర్ రైళ్లలలో తనిఖీలు నిర్వహించామని, ఈ తనిఖీల్లో సుమారు 3 లక్షల రూపాయల విలువ గల రాయితీ బియ్యం బస్తాలు లభించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి బియ్యాన్ని మండల్ లెవల్ స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు తెలిపారు.

అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని తొలగించొద్దు



మన తెలంగాణ/కరీంనగర్ క్రైం : భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల గుండెల్లో దడ పుట్టించిన సిపిఐ కరీంనగర్ జిల్లా మొట్టమొదటి కార్యదర్శి అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని తొలగించవద్దని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. శనివారం సిపిఐ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డితో కలిసి నగరంలోని కూరగాయాల మార్కెట్ వద్ద ఉన్న అనభేరి విగ్రహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ 1994వ సంవత్సరం జనవరి 12వ తేదీన నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా అనభేరి విగ్రహాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. గత 25 సంవత్సరాలుగా ఆయన విగ్రహం వద్ద జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రత్యేకంగా ఆ ప్రాంతంలో ఉన్న అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని తొలగించాలని ప్రయత్నించడం సరైంది కాదన్నారు. శ్రీ వెంకటేశ్వర దేవాలయానికి దోశమని సాకు చెబుతూ విగ్రహాన్ని మరో కచోటికి తరలిస్తామని చెప్పడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు అనభేరి ప్రభాకర్‌రావు చరిత్రను భావితరాలకు తెలిపేందుకు ఆయన ప్రతిమను అక్కడి నుండి తరలించవద్దని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కెదారి, కాలువ నర్సయ్య యాదవ్, బోయిని ఆశోక్, నగర కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నాయకులు భోనగిరి మహేందర్, కసిరెడ్డి మణికంఠరెడ్డి, బుచ్చన్న, సమ్మయ్య, యుగేందర్, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, తదితరులు సహా అనభేరి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి

మన తెలంగాణ / ఉట్నూర్ : మండలంలోని కుమ్మరితాండ గ్రామానికి చెందిన గోసండ్ల కవిత(9) విద్యుత్ ఘాతంతో శనివారం మృతి చెందింది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని గోవింద స్వామి దేవాలయానికి కవిత రోజు మాదిరిగా వెళ్ళి దర్శించుకున్న అనంతరం ప్రసాదం తీసుకుని అక్కడే ఉంది. కాగా ఆలయం పక్కన గల రేకుల షెడ్డు స్తంబంకు అనుకోని ఉండగా ఫ్యాన్ వైరింగ్ సరిగా లేక పోవడంతో స్తంబంలో విద్యుత్ ప్రసరించి కవితకు షాక్ తగిలింది. దీంతో కవిత అక్కడే మృతి చెందింది.

పంచాయతీ ఓటు ఎరుగని పల్లె!

- 37ఏళ్లుగా అక్కడ ఎన్నికలు లేవు
- సర్పంచ్, వార్డు సభ్యులంతా ఏకగ్రీవమే
- పనితీరును బట్టి పాలక వర్గం ఎంపిక
- ఇదే నిశ్చి(చి)ంతలూర్ పద్ధతి



మన తెలంగాణ/రాయికల్ : ఎన్నికలంటేనే పల్లెల్లో రాజకీయం వేడిగా ఉంటుంది. ఎన్నికల్లో పోటీ పడే అభ్యర్థులు విజయమే లక్ష్యంగా అనేక జిమ్మిక్కులు చేస్తుంటారు. వింత ప్రచారాలతో ఓటర్లను అకట్టుకుంటారు. మద్యం, విందు, నోట్ల పంపకాలు ఉంటాయి. శత్రువులు మిత్రులుగా మారుతారు. మిత్రులు శత్రువులవుతారు. కులం, మతం అంటూ ఎవరికి తోచిన రీతిలో వారు ప్రచారం చేసుకుంటూ గెలుపే లక్ష్యంగా బరిలో ఉంటారు. అయితే వీటన్నింటికి భిన్నంగా ఈ పల్లె ప్రజలు తీర్పు ఇస్తున్నారు. పని చేసే అభ్యర్థులను గుర్తించి వారినే తమ పాలకులుగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ ఆదర్శంగా ఉంటున్నారు. ఇలా ఒక్క దఫా కాదు గత 37 ఏళ్లుగా పంచాయతీ ఎన్నికలు లేకుండా పాలకవర్గాన్ని సమష్టి నిర్ణయంతో ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ శభాష్ అనిపించుకుంటున్నారు. పంతాలు, పట్టింపులు లేకుండా కలిసి మెలిసి జీవిస్తు అభివృద్ధి ఫలాలను అందిపుచ్చుకుంటూ నిశ్చింతగా జీవిస్తున్న చింతలూర్ గ్రామస్తుల కథనం ఇది. జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రానికి దాదాపు 12 కిలో మీటర్ల దూరంలో ఉన్న చింతలూర్ గ్రామం 1981కి పూర్వం బోర్నపెల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉండేది. చింతలూర్, జగన్నాత్‌పూర్, దావన్‌పెల్లి గ్రామాలతో కలిసి బోర్నపెల్లి గ్రామపంచాయతీగా ఉండేది. 1981 సంవత్సరంలో బోర్నపెల్లి నుంచి ఈ గ్రామపంచాయ తీలన్నీ ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పడ్డాయి. 1981 ఏటా చింతలూర్ గ్రామం సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయిస్తే ఎస్‌టి అభ్యర్థి బద్రీనాయక్ పనితీరును మెచ్చుకొని అతన్ని సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకొని ఆదర్శంగా నిలిచారు. ఇక్కడ రిజర్వేషన్‌ను చూడకుండా జనరల్ స్థానంలో ఎస్‌టి అభ్యర్థిని సర్పంచ్‌గా ఎన్నుకున్నారంటే గ్రామస్థుల ఐక్యత ఏలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అప్పటి నుంచి గ్రామస్థులంతా సమష్టి నిర్ణయంతో అదే ఆనవాయితీని పాటిస్తున్నారు. అప్పటి నుంచి మొన్నటి దాక పంచాయతీ పాలకవర్గ ఎన్నికల కోసం ఇక్కడి ప్రజలు ఓటెరుగని పరిస్థితి ఉంది. 1988 సంవత్సరంలోనూ సర్పంచ్ స్థానాన్ని జనరల్‌కు కేటాయించగా బిసి సామాజిక వర్గానికి చెందిన అనుపురం లింబాగౌడ్‌ను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. 1995లో బిసిలకు సర్పంచ్ స్థానం రిజర్వ్ కాగ చేసిన మంచి పనులను గుర్తించిన గ్రామస్థులు మళ్లీ లింబాగౌడ్‌ను రెండోసారి సర్పంచ్‌గా ఏకగ్రీవం చేశారు. 2001 సంవత్సరంలో సర్పంచ్ స్థానం జనరల్‌కు రిజర్వ్ కావడంతో ఓసి వర్గానికి చెందిన ఓరుగంటి మోహన్‌రావును ఏకగ్రీవం చేశారు. 2006 ఏటా ఎస్‌టిలకు సర్పంచ్ స్థానం కేటాయించడంతో ఎస్‌టి వర్గానికి చెందిన జాటోత్ లక్ష్మ ణ్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2013లో ఈ గ్రామ సర్పంచ్ స్థానాన్ని ఎస్‌సి మహిళకు కేటాయించడంతో కదుర్ల లక్ష్మిని ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. చింతలూర్ సమీపంలోని బషీర్‌పల్లె తండాను కలుపుకొని మొత్తం జనాభా 1 వెయ్యి లోపే. 2011 జనాభా లెక్కల ప్రకారం 650 మంది ఓటర్ల ఉన్నారు. ఇలా 1981 నుంచి 2103 దాక ఈ గ్రామస్థులు పంచాయతీ ఎన్నికల కోసం 37 ఏళ్లుగా ఓటు వేయకపోవడం గమనర్హం. గ్రామపంచాయతీ ఎన్నికలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో సిసిరోడ్లు , మురికికాల్వలు, అంతర్గత రహదారులను అభివృద్ధి చేసుకున్నారు. మంచినీటి పథకాలు, పాఠశాల విద్యను మెరుగుపరుచుకొని అభివృద్ధి పథంలో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లారు. మరోసారి ఏకగ్రీవానికి ప్రయత్నాలు పంచాయతీ ఎన్నికలంటేనే ఎరుగని ప్రజలు మరో దఫా ఏకగ్రీవ పాలక వర్గాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సారి మళ్లీ సర్పంచ్ స్థానాన్ని జనరల్‌కు కేటాయించడంతో పలువురు ఆశావహులు సర్పంచ్ బరిలో ఉండేందుకు సముఖత వ్యక్తం చేస్తూ ముందుకు రావడంతో ఏకగ్రీవ ప్రయత్నాలకు కొందరు పెద్దలు ప్రయత్నిస్తున్నారు.

సర్పంచ్‌తో సహా అందరూ ఏకగ్రీవం



మన తెలంగాణ/మెదక్/నర్సాపూర్ : గ్రామాభివృద్ధే ధ్యేయంగా అందరికీ ఆమోదయోగ్యమైన గ్రామ పాలక వర్గాన్ని ఓ గ్రామంలో ఏకగ్రీవంగా ఎన్నుకొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. నర్సాపూర్ మండలం గూడెంగడ్డ గ్రామ పంచాయతీ నూతనంగా ఏర్పడింది. బిసి జనరల్‌కు కేటాయించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో గ్రామంలో రాజకీయ వాతావరణం ఏర్పడింది. ఎన్నికలకు వెల్లకుండా ఏకగ్రీవమైతే ప్రభుత్వం నుంచి వచ్చే రూ.10లక్షలతో గ్రామాభివృద్ధి చేసుకోవచ్చన్న ఉద్దేశ్యంతో గ్రామ పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని గ్రామస్థులు నిర్ణయించారు.

శనివారం నర్సాపూర్ మండలం గూడెంగడ్డలో గ్రామస్థులందరు సమావేశం నిర్వహించి సర్పంచ్‌గా జనుముల నర్సింలు, ఉపసర్పంచ్‌గా మమత, వార్డు సభ్యులు వసంత, శ్రావణి, సుగుణ, సుధాకర్, నందం, రాజు, మల్లేశంలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు బోగరాణిశేఖర్, మాజీ సర్పంచ్ శంకరయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల నిలువు దోపిడీ

- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తున్న దుకాణదారులు
- అనుమతులు నోచుకోని మందుల షాపులు
- మామూళ్ల మత్తులో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ?



మనతెలంగాణ/మణుగూరు : మండలంలో మందులు దుకాణాదారులు పేదలను జలగల్లా పిప్పి పీలుస్తున్నారు. మరోవైపు రోగుల నుంచి ధరలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు.మందుల ధరల విషయంపై ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తు వ్యాపరాలు నిర్వహిస్తున్నారు.వైద్యం పేరుతో ఆసుపత్రికి వచ్చిన రోగుల ఆరోగ్యం దోసుకుంటున్నారు.మణుగూరు పట్టణంలోని మందుల షాపుల వారి చర్యలు నానాటికి మితిమీరిపోతున్నాయి .చిన్నపాటి వైద్యానికి కుడా పెద్దస్థాయి మొత్తంలో మందులతో రోగుల జెబులను దోచుకోంటున్నారు.అనుమతి, అనుభవం లేని వైద్యులతో హస్పటల్స్ నెలకోల్పి చిన్నపాటి జ్వరం వస్తే వేలాది రూపాయాలను వివిధ పరీక్షల పేరిట వసూలు చేస్తున్నారు.వైద్యులు,మందులు కంపెనీలు,,మందులుషాపులవారు కలసిరోగుల జేబులకు చిల్లి పెడుతున్నారు.మండలంలో సూమరు 20కు పైగా మందులు షాపులు ఉన్నాయి. ఈ మందులు షాపులన్నింటిలో కొన్నింటికి సక్రమంగా అనుమతులు లేవు. తనీఖీలు చేయాల్సిన డ్రగ్ ఇన్స్పెక్టర్ల్ మాముళ్ల మత్తులో ఉంటుండడంతో మందులు షాపులు పని మూడు మాత్రలు ఆర్ టానిక్లుగా దివ్యంగా అక్రమ వ్యాపారం చేసుకుంటున్నారు.కాంట్రాక్ట్ బేసిస్ మెడిషన్ పేరుతో ప్రస్తుతం మణుగూరులోని ప్రేవేట్ ఆసుపత్రుల్లో దందా కోనసాగుతుంది.మందులు తయారీ సంస్థలు,కొందరు వైద్యులతో నేరుగా సంబంధాలు పెట్టుకుని వారు నడుపుతున్న ఆసుపత్రులకు ఆనధికారికంగా మందులు సరఫరా చేస్తున్నారు. ఈ వ్యవహరమంతా డ్రగ్ కంట్రోల్ అధికారులు తెలిసే జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ. లక్షకుపైన కాంట్రాక్ట్ బేసిస్ మెడిషన్ విక్రయిస్తే కంపెనీ ప్రతినిధులు సదరు వైద్యులకు 10నుంచి15 శాతం వరకు కమీషన్లు అందిస్తున్నారని తెలుస్తుంది. దినికి తోడు పలువురు వైద్యులు మందుల షాపులతో కుమ్మకై రోగులకు అవసరం లేకపోయిన అధిక ధర కలిగిన మందులను వ్రాస్తూ మందులు షాపుల వద్ద కమీషన్లు దండుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఉండాల్సిన దుకాణాలు కుడా ఏవి నిబంధనలు పాటించటంలేదు. ప్రతి ఒక్క దుకాణంలో నిబంధనలు ఉల్లంఘన జరుగుతున్నా డ్రగ ఇన్స్పెక్టర్లు పటించుకోవటంలేదు. దీంతో జీరో వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ విషయంలో తనాఖీ చేయాల్సిన వాణిజ్య పన్నులశాఖ అధికారులు కుడా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అనుమతి లేని మందుల షాపులతో,అర్హతలేని ఫార్మశిష్టలతో ఒక్కసారి ఇవ్వాల్సిన మందు ఇవ్వకుండా నకిలీ మందులు ఇస్తుండడంతో రోగుల ప్రాణాలు హరీమంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోని మందులు షాపుల దందాను నియాంత్రించి, ప్రజల ఆరోగ్యాలతో చేలగాటమాడకుండా, సంబంధిత డ్రగ్ ఇన్స్పెక్టర్లు వాణిజ్య పన్నులశాఖ అధికారులు దృష్టిపెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే భూములపై రగడ

- 98 కిలో మీటర్ల మేర ఖమ్మం - దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి
- 11 మండలాల్లో 2200 ఎకరాలు
- భూముల ఇవ్వమని రైతుల ఆందోళన
- కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు విన్నవించిన రైతులు

మనతెలంగాణ/ఖమ్మం : ఖమ్మం టూ దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేకు ఖమ్మం జిల్లాకు సంబంధించిన 11 మండలాల్లోని రైతులకు చెందిన 2200 ఎకరాల భూమికి సంబంధించి ఇప్పటికే అధికారులు సర్వేచేసి రాళ్లు ప్రతిష్టించారు. గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేకు భూములు ఇవ్వమని రైతులు ఆందోళన చేయడంతో పాటు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. దీంతో నేషనల్ హైవేకు సంబంధించిన అంశం చర్చనీయాంశమైంది. ఈ హైవేకు సంబంధించి 11 మండలాల్లోని వేలాది ఎకరాల భూమి కేవలం చిన్న, సన్నకారు రైతులదే కావడంతో అదే భూమిపై జీవనాధారంగా తాము జీవనం కొనసాగిస్తున్నామని, ఉన్న కొద్దిపాటి భూములు హైవేలో పోతే తాము ఎలా బ్రతకాలంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. కిలో మీటర్‌కు 18 ఎకరాల చొప్పన సంబంధిత శాఖ అధికారులు సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేశారు. అనేక గ్రామాల్లో ఏర్పాటు చేసిన హద్దులను రైతులు తొలగించి ఖరీఫ్‌లో పత్తి, వరి, మొక్కజొన్న, ఇతర అపరాల పంటలను సాగు చేస్తున్నారు. హైవేకు భూములు ససేమిరా ఇవ్వమంటూ పట్టుబట్టడంతో పాటు తమ ఆందోళనను ఉధృతం చేసి జిల్లా కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్, జాయింట్ కలెక్టర్ ఆయేషా మస్రత్‌ఖాన్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. నేషనల్ హైవేకు సంబంధించి తెలంగాణలో 98 కిలో మీటర్ల మేర ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, చింతకాని, వైరా, తల్లాడ, కల్లూరు, వేంసూరు, పెనుబల్లి, సత్తుపల్లి వరకు ఈ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు సన్నహాలు చేస్తున్నారు. మార్కెట్‌లో ఉన్న రేటుకు రెండు మూడు రెట్లకు పైగా నష్ట పరిహారం ఇస్తామంటూ అధికారులు చెబుతున్నప్పటికీ భూములు ఇచ్చేది లేదని రైతులు భీష్మించి కూర్చుంటున్నారు. కిలో మీటర్‌కు హైవే కోసం 18 ఎకరాల చొప్పున భూములు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసేందుకు 2018 అక్టోబర్ 18న నోటిఫికేషన్‌ను అధికారికంగా జారీ చేసింది. హైవేకు చిన్న, సన్నకారు రైతులకు సంబంధించి అర ఎకరం నుంచి ఐదు ఎకరాల లోపు రైతులే 75 శాతం మేర ఉన్నట్లు రైతులు స్పష్టం చేశారు. వ్యవసాయమే జీవనాధారంగా బ్రతుకుతున్న తమకు ఉన్న భూములు పోతే బ్రతకలేమంటూ ఏకగ్రీవంగా తీర్మానంచేసి అధికారులను అభ్యర్థించారు. 75 మీటర్ల వెడల్పుతోనే రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి పాత రోడ్డు వంద అడుగులు ఉండటంతో అందులోనే నిర్మాణాలు చేపట్టాలని పట్టు బడుతున్నారు. పొన్నెకల్ నుంచి సూర్యాపేట వరకు నిర్మాణం చేస్తున్న పాత రోడ్డు లాగానే తమ వైపు కూడా హైవేను నిర్మించాలని కోరుతున్నారు. ఈ సారవంతమైన భూములకు సంబంధించి లంకాసాగర్, వైరా ప్రాజెక్టు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు, కొదుమూరు, వందనం లిఫ్టు ఇరిగేషన్ల ద్వారా వందలాది ఎకరాలు సాగులో ఉందన్నారు. ప్రధానంగా తల్లంపాడు, మద్దులపల్లి, గుదిమళ్ళ, అగ్రహారం, ధ్వంసలాపురం, రామకృష్ణాపురం, బస్వాపురం, రాఘవాపురం, కొదుమూరు, వందనం, చిన్నగోపతి, పెద్దగోపతి, బొట్లకుంట, గోపారం, పెద్ద మునగాల, వైరా, సోమవరం, లక్ష్మి పురం, సిరిపురం, తల్లాడ, మిట్టపల్లి, కల్లూరు, వేంసూరు, సత్తుపల్లి పరిధిలోని గ్రామాల వరకు ఈ హైవే భూములు పోనున్నాయి. ఇంక ఈ భూములకు లంకాసాగర్, తుంబూరు, బేతుపల్లి వరద నీటి ద్వారా రెండు పంటలు పండటంతో పాటు భూములన్నీ సస్యశ్యామలమవుతున్నాయి. ప్రధానంగా ఆయా భూముల్లో ఖరీఫ్, రబీ కాలాల్లో వరి, చెరకు, మిర్చి, పత్తి, మొక్క



జొన్న, మామిడి, బొప్పాయి. నిమ్మ, జీడిమామిడి, పప్పుదినుసులు, ఆయిల్‌ఫాం, ఇతర అంతర పంటలను సాగు చేస్తున్నారు. ఈ భూములపై ఇప్పటికే ఆందోళన చేస్తున్న వారు దేనికైనా సిద్ధమేనని గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే జెఏసి నాయకులు దొబ్బల వెంగళరావు, బొడ్డు కొండల్‌రావు, కాశర రాజశేఖర్‌రెడ్డి, మేడా గోపాలకృష్ణ, పరుచూరి రామారావు, కందిపట్ల రవి, పుల్లారెడ్డిలు స్పష్టం చేశారు. ఈ ఆందోళనను హైవే భూములకు సంబంధించి భూముల సేకరణ ఉపసహరించే వరకు కొనసాగిస్తామని హెచ్చరించారు.

హైవే నిర్మాణంతో రైతాంగానికి తీవ్ర నష్టం

- రైతు నరసింహారావు



కేంద్ర ప్రభుత్వం ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం కోసం భూములను సర్వే చేసిందని ఈ నిర్మాణంతో అనేక మంది రైతులకు చెందిన భూములు కోల్పోయి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని చింతకాని మండలం రాఘవాపురానికి చెందిన నరసింహారావు అనే రైతు పేర్కొన్నారు. తనకు గ్రామంలో ఐదెకరాల భూమి ఉందని, అందులో రెండు ఎకరాల భూమి హైవే నిర్మాణం కోసం సర్వే చేసి హద్దులు సృష్టించి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. తనకు ఉన్న కొద్దిపాటి భూమిలో సగం భూమి హైవే నిర్మాణానికి పోతే ఇదే భూమిపై జీవనం కొనసాగిస్తున్న తాము ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. భూములన్ని చిన్న, సన్నకారు రైతులకు చెందినవే హైవే నిర్మాణంలో కోల్పోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

కుంటలు, చెరువులు నింపాలి

మన తెలంగాణ/కరీంనగర్ రూరల్ : వచ్చే ఖరీఫ్ పంటకు ఫిబ్రవరి మొదటి వారంలో ఎస్సారెస్పీ కాలువ నీటి విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, ఎస్సారెస్పీ కాలువ ద్వారా నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోని చెరువులను, కుంటలను నింపేందుకు అధికారులు, ప్రణాళికలు రూపొందించాలని గంగుల కమలార్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఇఎన్‌సి కార్యాలయంలో వచ్చే ఖరీఫ్ పంటకు నీరు అందించేందుకు ఉన్న ఇబ్బందులపై ఎస్సారెస్పీ, వరద కాలువ అధికారులు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో ఇఎన్‌సి మురళీధర్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాల్వ కింద ఉన్న ఆయకట్టు తో పాటు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉన్న చెరువులను కుంటలను ఎస్ఆర్ఎస్‌పి నీటితో నింపాలని ఎంసి మురళీధర్‌రావుకి విజ్ఞప్తి చేశారు. కొత్తపల్లి మండలంలోని ఊర చెరువు నింపేందుకు ఎస్సారెస్పీ కాలువ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసి చెరువులో పూర్తి స్థాయిలో నీరు నింపేందుకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ఖాజీపూర్ చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతుల భూములు ఎండిపోకుండా చూడాలని మిడ్ మానేరు ప్రాజెక్టు ద్వారా శాశ్వతంగా నీరు వచ్చేందుకు వీలుగా అధికారులు ప్రత్యేక ప్రణాళికలు చేపట్టి నిర్మించాలని గంగుల కమలాకర్ విజ్ఞప్తి చేశారు. ఆచంపల్లి వరదకాలువ వద్ద ఫీడర్ చానల్ పనులలో జాప్యంపై కూడా ఎమ్మెల్యే స్పందించారు. ఫీడర్ చానల్ కాలువ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ఆచంపల్లి వరద కాలువ వద్ద నిర్మాణంలో ఉన్న ఫీడర్ చానల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫీడర్ చానల్ ద్వారా నాగులమల్యాల, బద్దిపల్లి, కమాన్‌పూర్, బావుపేట, కొండాపూర్, గ్రామాలకు తాగు, సాగు నీరు అందుతుందన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ఇఎన్‌సి మురళీధర్‌రావు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

వరుస దాడులతో హడలెత్తిస్తున్న చిరుత



మన తెలంగాణ/యాచారం : రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని సరిహద్దు గ్రామమైన కొత్తపల్లి శివారులో చిరుత మేకలు, గొర్ల మందపై గత మూడు నాలుగు రోజులుగా వరుస దాడులు చేస్తూ వాటి యజమానులను కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన కాస జంగయ్య అనే రైతు మేకల మందపై దాడిచేసి రెండు మేకలను చంపివేసి మరోమేకను ఎత్తుకెళ్ళిన చిరుత గురువారం రాత్రి చిక్కుడు వెంకయ్య మేకల మందపై దాడి చేసి మేకను తీవ్రంగా గాయపరిచింది.అదేవిధంగా శుక్రవారం రాత్రి కూడా గ్రామానికి చెందిన రైతు బైకని వెంకటయ్య మేకల మందపై చిరుతపులి దాడిచేసి ఒక మేకను చంపి సగభాగం తినివేసింది. ఇలా మేకల మందపై రోజూ వరుసగా దాడులు చేస్తుండడంతో గొర్ల కాపరుతో పాటు వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటేనే స్థానిక రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం ఫారెస్ట్ అధికారులు కొత్తపల్లి గ్రామంలో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కొత్తపల్లి గ్రామం నుంచి సుమారు 20 కి.మీ మేర తాడిపర్తి, కుర్మిద్ద, కడ్తాల్ మండలం సరికొండ అటవీ ప్రాంతం విస్తరించి ఉందని ఈ ప్రాంతంలో ఓ చిరుత సంచరిస్తున్నట్లుగా వాటి పాదముద్రలను బట్టి వారు నిర్ధారించారు. నష్టపోయిన రైతులకు కూడా సంబంధిత పత్రాలు సమర్పిస్తే పరిహారం అందించే ఏర్పాటు చేస్తామని వివరించారు. త్వరలోనే చిరుతను బంధించడానికి ఇక్కడ బోను ఏర్పాటు చేస్తామని రైతులకు హామీ నిచ్చి వెళ్లారు. ఆ వెళ్ళిన రోజే రాత్రి మళ్ళీ చిరుత మేకల మందలపై దాడి చేస్తుండంతో దిక్కుతోచని పరిస్థితిలో వాటి యజమానులు పడి పోయారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో చిరుత సంచరించి పలువురు రైతులకు చెందిన మేకలను, గొర్లను, లేగదూడలను పొట్టన బెట్టు కుందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.తక్షణమే సంబదిత అధికారులు చిరుతను బందించడానికి అనువైన ప్రదేశంలో బోను ఏర్పాటు చేసి తమను రక్షించాలని స్థానికులు వేడుకొంటున్నారు.

పైల్‌నెం.5ycm01: చిరుత పాదముద్రలను గుర్తించిన అటవీ అధికారులు
పైల్‌నెం.5ycm01(1) : చిరుత దాడిలో మృత్యువాత పడ్డ మేక

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

మనతెలంగాణ/జగిత్యాల రూరల్ : మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జగిత్యాల మండలం చల్‌గల్ గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న చల్‌గల్‌కు చెందిన నితిన్, రిజ్వాన్ అనే యువకులను రూరల్ ఎస్‌ఐ సతీష్‌కుమార్ పట్టుకున్నారు. వారిని శనివారం జగిత్యాల కోర్టులో హాజరుపరచగా ఇద్దరికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

పోలీస్ వాహనం బోల్తా



మనతెలంగాణ/ వేములవాడ : మండలంలోని అగ్రహారం ప్రాంతంలో పోలీసు వాహనం బోల్తా పడింది. వివరాల్లోకి వెళ్తే కరీంనగర్ త్రీ టౌన్ సీఐ విజయ్‌కుమార్, డ్రైవర్ క్రిష్ణా రెడ్డిలు ఉన్నారు. వీరు కరీంనగర్ నుండి సిరిసిల్లా వెళ్తుండగా అగ్రహారం ఆలయం వద్ద వాహనానికి ఎదురుగా వృద్దుడు అకస్మికంగా రోడ్డు దాటేందుకు వచ్చాడు. దీంతో వృద్దున్ని తప్పించే క్రమంలో బొలేరో వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో సీఐ విజయ్ కుమార్‌కు ఎడమ చేతి వేలికి గాయాలు కాగా, డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. దీంతో పెను ప్రమాదం తప్పింది. జరిగిన సంఘటన పెద్దదైనప్పటికి ఎవరికి ఏమి కాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని పలువురు వాపోయారు.

ముదురు నారు నాటుకోవచ్చు

- మెళకువలు పాటించాలి
- నారు కొనలు తుంచి నాటుకోవాలి
- కుదురుకు నాలుగైదు వేయాలి
- అనువైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మన తెలంగాణ/మహాముత్తారం జనవరి : యాసంగిలో వరిసాగు పనులు జోరందుకున్నాయి. ఈ ఏడాది బోరుబావుల కింద చాలా ప్రాంతాల్లో నాటు ఆలస్యమవుతోంది. అయితే రైతులు చల్లిన నారుమడులు ముదిరితే సలహాలు, సూచనలు పాటించాలి. రైతులు నారు మడులను ముందుగా తయారు చేసుకుని నారు పోసుకుని దమ్ము చేసిన పొలంలో సాధారణంగా సుమారు నెల రోజుల వయస్సు గల నారును నాటుకుంటారు. అయితే ప్రస్తుతం రైతులు అనుకున్న సమయంలో నాటు వేయకుంటే మెళుకువలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లోని పలు గ్రామాల్లోని బోరు బావుల కింద వరిసాగు చేస్తున్న రైతులు ముదిరిన నారును నాటేటప్పుడు రైతులు సరైన మెళుకువలు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

రైతులు పాటించాల్సిన మెళుకువలు..!

- ముదురు నారు నాటాల్సి వచ్చినప్పుడు మొదట నారు కొనలు తుంచి నాటాలి. ఈ విధంగా చేయడం వల్ల కాండం తొలుచు పురుగు పెట్టిన గుడ్లు నశించి పురుగుల ఉధృతి పొలంలో తగ్గుతుంది.
- చదరపు మీటరులో సుమారు 44 మొక్కలకు తగ్గకుండా నాటాలి. ప్రతి కుదురుకు 4 లేదా 5 మొక్కలు నాటాలి.
- ముదురు నారు నాటేటప్పుడు నత్రజని ఎరువును సిఫారసు చేసిన మోతాదు కంటే 25 శాతం పెంచి మూడు దఫాలుగా లేదా రెండు దఫాలుగా అంటే 70శాతం అంకురం ర్పడిన దశలో వేయాలి.
- నత్రజని ఎరువులు వేసినప్పుడు పొలంలో నీరు ఎక్కువగా లేకుండా బురుద పదనులో చల్లాలి.
- 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి లేక 250 కిలోల తేమ కలిగిన మెత్తటి మట్టిని కలిపి రెండు రోజులు నిల్వ ఉంచి వెదజల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది.
- ముదురు నారు నాటటం వల్ల కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. అందుకే నారు కొనలు తుంచి నాటాలి. ఆ తరువాత పురుగు ఆర్థిక నష్ట పరిమితి స్థాయిని అంచనా వేసుకుని సిఫారసు చేసిన సమగ్ర సస్యరక్షణ పద్దతులు పాటించాలి.
- ముదురు నారు నాటిన పొలంలో ఉల్లికోడు ఉధృతి కూడా ఎక్కువగా ఉంటుంది. దుబ్బకు ఉల్లికోడు సోకిన పిలక ఉన్నట్టయితే ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను నాటు వేసిన 10 రోజుల తర్వాత వేసుకోవాలి.
- ఆలస్యంగా ముదురు నారు నాటిన పొలంలో ఇతర పురుగులైన ఆకు ముడత, దోమ ఉధృతిని కూడా గమనించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన దిగుబడులు సాధించవచ్చు.

నారుకొనలు తుంచి నాటుకోవడం మంచిది..!



ముదరునారు నాటాల్సి వచ్చినప్పుడు కొనలు తుంచి నాటుకోవడమే మేలు. ఇలా కొనలు తుంచడం వల్ల కాండం తొలుచు పురుగు పెట్టిన గుడ్లు నశించి పొలంలో వాటి ఉధృతి తగ్గుతుంది. అలాగే నత్రజనిని మూడు దఫాలుగా కాకుండారెండు సార్లు మాత్రమే వేయాలి. అందులో మొదటి సారి 70శాతం వేసుకోవాలి. నత్రజని ఎరువులు వేసేటప్పుడు బురద పదును మాత్రమే ఉండేలా జాగ్రత్త పడాలి. ఇటువంటి మెళుకువలు పాటిస్తే ముదురు నారుతోనూ మంచి ఫలితాలు సాధించవచ్చు.

కలువల సతీశ్, మండల వ్యవసాయాధికారి మహాముత్తారం

సారంపెల్లి గొంతు తడిపింది.. కెటిఆర్ సారే..!

- ఎన్నికల ప్రచారం మొదలు పెట్టేది ఈ పంచాయతీ నుండే
- తాగునీటి సమస్యకు రూ.5.50లక్షల ఖర్చు





మన తెలంగాణ/తంగళ్లపల్లి : రాజన్న సిరిసిల్లా జిల్లా తంగళ్లపలి మండలంలోని సారంపెల్లి గ్రామంలో మంచినీటి సమస్యను అధిగమిచేందుకు ఎమ్మెల్యే కెటిఆర్ ప్రత్యేక చొరవ చూపారు.గ్రామంలో తాగునీటి కోసం ఇబ్బందులు ఉండేవి.వేసవి కాలం వచ్చిందంటే బిందెలతో గ్రామ మహిళలు పొలాల్లోని మోటార్ల వద్దకు బారులు తీరే వారు.దీంతో రోజు రోజుకు నీటి సమస్య తీవ్రరూపం దాల్చింది.వెంటనే స్పందించిన తాజా మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కెటిఆర్ తన నిధుల నుండి బోర్ మోటారును మంజూరు చేశారు. రూ.5.50లక్షల నిధులతో ఎల్లమ్మ గుడి వద్ద నుండి గ్రామంలో కల్వర్టు వరకు సుమారుగా 1450 మీటర్ల పైపు లైన్లను వేసి శాశ్వతంగా నీటి గోసను తీర్చారు. ఉప ఎన్నికలైనా,శాసన సభ ఎన్నికలైనా,ముందస్తు ఎన్నికలైనా ఈ గ్రామం నుండే ప్రచారాన్ని మొదలు పెట్టడం కెటిఆర్ కు కలిసి వస్తోంది.సారంపెల్లి గ్రామం సెంటిమెంట్‌గా మారింది. సారంపెల్లి గ్రామంలో 1448 మంది జనాబా ఉంటుంది. వీరిలో 1075 మంది ఓటర్లు ఉంటారు. మొత్తం ఎనిమిది వార్డులతో కలిపి గ్రామ పంచాయతీ కొనసాగుతోంది. గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తు ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తుంటారు. పారిశుధ్య సమ్మె కాలంలో తప్ప గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేవు.కాంట్రాక్ట్ పద్ధతిన కార్మికులతో పనులు చేయించారు.అంతే కాకుండా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆధునీకరించడంలో అదికారులు ప్రత్యేక చొరవచూపారు.ఒకప్పుడు పంచాయతీ కార్యాలయం మందు బాబులకు అడ్డగా ఉండేది. చీకటి పడిందంటే గ్రామంలోని మందుబాబులకు ఈ పంచాయతీ కార్యాలయమే అడ్డాగా మారేది.తెల్లవారే సరికి పంచాయతీ కార్యాలయానికి వస్తే మందు సీసాలే దర్శనమిచ్చేవి. అదికారులు తీసుకున్న ప్రత్యేక చొరవతో పంచాయతీ కార్యాలయానికి చుట్టు ప్రహరీ గోడను నిర్మించారు. కార్యాలయ ఆవరణలో సిమెంట్ ఫ్లోరింగ్ వేసి చదును చేశారు. మొక్కలను నాటి అపరిశుభ్రతలను తొలగిస్తున్నారు.దీంతో పంచాయతీ కార్యాలయానికి వచ్చే గ్రామస్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తోంది.

పంచాయతీ ఎన్నికల్లో పోటీ పలువురి ఆసక్తి

సారంపెల్లి గ్రామ పంచాయతీ బిసి జనరల్ కావడంతో పలువురు ఆసక్తి చూపుతున్నారు.ఇప్పటికే అదికార పార్టీ నేతలు తామంటే తాము బరిలో నిలుస్తామంటూ గ్రామంలో తమ సామాజిక వర్గపెద్దలతో రాయబారాలు చేస్తున్నారు.ఈసారి అవకాశం ఇవ్వాలని కోరుతూ మచ్చిక చేసుకుంటున్నారు. బిసి పురుషులు లేదా మహిళ కావడంతో గ్రామంలో పలుకుబడి ఉన్న కొంత మంది నేతలు మహిళలను బరిలో దింపి ఉప సర్పంచ్‌గా తాను కొనసాగవచ్చని అంచనాలు వేసుకుంటున్నారు.ఐతే రాకరాక వచ్చిన అవకాశాన్ని మేమెందుకు వదులుకుంటామంటూ ఆశావహులు తేల్చిచెబుతున్నారు.ఇక్కడ కూడా వర్గపోరు తప్పేట్టు లేదు.దీంతో సర్పంచ్ బరిలో నిలిచే వారి సంఖ్య ఎనిమిదికి పెరగనున్నట్లు గ్రామస్థులు అంచనాలు వేసుకుంటున్నారు.కొంత మంది నాయకులు విందు రాజకీయాలు చేస్తు మచ్చిక చేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారని గ్రామంలో వినిపిస్తోంది.వార్డు సభ్యులంతా తమ వారే ఉండాలని ప్యానల్‌ను రూపొందించే పనిలో నిమగ్నమవుతున్నామని ఆశావహులు చెబుతున్నారు.పోటీలో నిలిచే అభ్యర్థులు,వార్డు మెంబర్లు గ్రామ పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండవద్దని తమ వర్గంవారివి సైతం బకాయిలు చెల్లించేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలిసింది.దీంతో పంచాయతీ ఎన్నికలతో పేరుకు పోయిన తమ బకాయిలు క్లియర్ అవుతున్నాయని వార్డు సభ్యులుగా పోటీ చేయనున్న సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అభ్యర్థులు ఎక్కువైతే తమ ఖజానా నిండుతుందని పంచాయతీ అదికారులు దీమాగా ఉన్నారు.

రోడ్డుపై వ్యర్థాలతో ఇబ్బంది



- రహదారి పక్కనే చెత్త వేయడంతో ప్రమాదాలు
- సరైన డంపింగ్ యార్డ్ లేక వ్యర్థాలతో అవస్థలు

మన తెలంగాణ, హుజూరాబాద్ రూరల్, జనవరి : హుజూరాబాద్ మండలంలోని ఇప్పల్ నర్సింగాపూర్ పోయే రహదారిలో రోడ్డుపైనే కుళ్లిన వ్యర్థాలు, చెత్త వేయడం వల్ల రహదారి వెంట పోయే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపైనే చికెన్ సెంటర్‌కు సంబంధించిన వ్యర్థాలు చిందరవందరగా వేయడం వల్ల పందులు ఆ వ్యర్థాలకు అలవాటు పడి రహదారిపైనే ఆవాసం ఏర్పరచుకొని వచ్చే పోయే రహదారి వాసులను ఇబ్బందికి గురి చేస్తున్నాయి. దీని వల్ల రాత్రి పూట పోయేటప్పుడు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదం వల్ల ఒకరిద్దరూ మరణించడం కూడా జరిగింది. సరైన డంపింగ్ వ్యవస్థ లేకపోవడం వల్ల పట్టణ వాసులు వ్యర్థాలను ఈ రహదారి వెంట వేయడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారి వెంట పోవాలంటే ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అంతేకాకుండా చెత్తను రోడ్డు వెంట పారబోసి మంట పెట్టడం వల్ల పొగ వల్ల రహదారి వాసులకు ఇబ్బంది కల్గిస్తుంది. వివిధ గ్రామాలకు వెళ్లాలంటే ఈ రహదారే శరణ్యం. గ్రామ ప్రజలు ఎన్నిసార్లు మున్సిపాలిటీ అధికారులు విన్నవించిన తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి యథావిధిగా చెత్తను పారవేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు తక్షణం స్పందించి గ్రామాలకు దూరంగా డంపింగ్‌కు చేపట్టిన స్థలంలోనే చెత్తను,వ్యర్థాలను పారవేసే విధంగా ప్రజలను చైతన్య పరిచి పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పందుల బెడదతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం



రోడ్డు పక్కనే చెత్త వేయడం వల్ల దుర్గంధంతో ముక్కు మూసుకోని పోయే పరిస్థితి ఏర్పడుతుంది. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి పూట అయితే రోడ్డు పైకే పందులు రావడంతో వాహానాలకు తగిలి ప్రమాదాలు బారిన పడుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. చెత్తను, వ్యర్థాలను ఊరికి దూరంగా వేయాలి

గూడూరి స్వామిరెడ్డి, గ్రామస్థుడు, ఇప్పల్ నర్సింగాపూర్

నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం కసరత్తు

మనతెలంగాణ/వరంగల్ బ్యూరో: రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచారు. ప్రస్తుతం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలతో ఇంటిల్లిపాదికి ఏదో ఒక పథకం వర్తించడం వల్ల కెసిఆర్ పాలనపై తిరుగులేని మమకారాన్ని పెంచుకొని రెండవసారి ప్రభుత్వానికి బాసటగా నిలిచారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశలో ముఖ్యమంత్రి కెసిఆర్ నిరుద్యోగ యువతను నిరాశ, నిస్పృహలకు గురి చేయకుండా ఉండేందుకు వారి సొంత ఖర్చుల కోసం భృతిని ఏర్పాటు చేసే పథకంపై కసరత్తు చేస్తున్నారు. ఈ పథకం అమలైతే ప్రస్తుతం అమలు చేస్తున్న పెన్షన్ల పథకానికి తోడుగా నిరుద్యోగ భృతి కూడా ఆసరాగా నిలువబోతుంది. రాష్ట్రంలో నిరుద్యోగ భృతి పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం దేశంలో అమలు చేస్తున్న ఏడు రాష్ట్రాల పథకాలను అధ్యయనం చేస్తున్నట్లు స్థానిక అధికారులు పేర్కొంటున్నారు. పదోతరగతి నుండి ఇంటర్, డిగ్రీ, పిజి వరకు విద్యనభ్యసించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుపయోగంగా ఉంటున్న యువతీయువకులకు ఈ పథకంలో అర్హులుగా చేరుస్తారు. విద్యార్హతను బట్టి నిరుద్యోగ భృతిని నిర్ధారించే అవకాశాలు ఉన్నాయి. వికలాంగులకు రూ.1500 ఇస్తున్నట్లు అధ్యయనం తెలినట్లు అధికారులు పేర్కొంటున్నారు. డిగ్రీ, పిజి చదివిన నిరుద్యోగులకు రూ.2 వేల పైచిలుకు ఇస్తున్నట్లు తేలింది. 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోబడి ఉన్నటువంటి యువతీయువకులకే ఈ పథకంలో చోటు లభించే విధంగా అధ్యయనం చేస్తున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తుంది. తాజాగా నిరుద్యోగ భృతి ఎప్రిల్ నుండి అమలు చేయడానికి ప్రభుత్వం కసరత్తును చేస్తుంది. తోడబుట్టిన అన్నాతమ్ముళ్లు, జన్మనిచ్చి పెంచిన రక్తపు బంధువులు కూడా చేయలేని ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి పెన్షన్లు భృతి రూపంలో కల్పిస్తుండడంతో కెసిఆర్‌కు వారంతా కూడా బాసటగా గడిచిన ఎన్నికల్లో నిలిచారు. రాబోయే రోజుల్లో వీరంతా కూడా కెసిఆర్ మాటకే కట్టుబడి ఉండనున్నారు. ప్రస్తుతం నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్న అంశంపై స్థానిక యువతలో చర్చనీయాంశంగా మారింది. ఈ పథకం ఎప్రిల్ నుండి అమలు జరుగుతుందన్న సంకేతాలు రావడంతో స్థానికంగా జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో నిరుద్యోగ యువతీయువకులు కెసిఆర్ వైపే మొగ్గు చూపుతున్నారు. గ్రామాలన్నీ ఒకే వైపు నిలిచే పరిస్థితులు కనబడుతున్నాయి. ఏకగ్రీవ ఎన్నికలకు అవకాశం లేనిచోట ప్రత్యక్ష ఓటింగ్ ద్వారా టిఆర్‌ఎస్ నుండి నిలబడిన అభ్యర్థిని గెలిపించడానికి అభివృద్ధి సంక్షేమ పథకాలను పొందిన వారంతా కూడా సిద్ధమయ్యారు.

అసంబద్ధంగా మెడికేర్ స్కీం

- నష్టపోతున్న సింగరేణి కార్మికులు
- యాజమాన్యం పునరాలోచించాలి



మనతెలంగాణ/భూపాలపల్లి: సింగరేణి కార్మికులకు రిటైర్మెంట్ తరువాత అందించే మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం ముందస్తుగా కార్మికుల నుంచి రూ.2వేల నుంచి వెయ్యి వరకు వసూలు చేయడం అసంబద్ధంగా ఉందని కార్మికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సరైన నిబంధనలు, అధ్యయనం లేకుండా ఈపథకం కింద ఉద్యోగులందరి నుంచి కంపెనీ వసూలు చేయడం అన్యాయమని వాపోతున్నారు. గతంలో పదవీ విరమణ పొందిన కార్మికులు సంస్థ నుంచి ఆరోగ్య సేవలు పొందడానికి రూ.40వేలు చెల్లించాల్సి ఉండేదని, కావాలనుకున్నవారు ఆమొత్తాన్ని చెల్లించేవారని, అయితే ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడి నుంచి ముందస్తు సమాచారం లేకుండా రికవరీ చేస్తున్నారని వారు ఆవేదన వెలిబుచ్చారు. హెల్త్ కార్డ్ కావాలా వద్దా అనేది ఉద్యోగి వ్యక్తిగత అభిప్రాయమని, అదేమీ పట్టించుకోకుండా సంస్థలో పనిచేస్తున్న ప్రతి కార్మికుని నుండి రికవరీ చేయడం అన్యాయమని అంటున్నారు. ఎవరైనా ఉద్యోగుల భార్య, భర్త, పిల్లలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయితే వారికి ఈస్కీం వర్తించదని, సింగరేణి ఉద్యోగి కుటుంబానికి వర్తించే ఈపథకంలో భార్య, భర్తలు ఇద్దరు సింగరేణి ఉద్యోగులు అయితే ఇద్దరి నుంచి రూ.40వేల చొప్పున వసూలు చేయడం వారిని ఆర్థికంగా నష్టపరచడమేనని విమర్శిస్తున్నారు. ఆర్మీలో పదవి విరమణ చేసి సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగులకు హెల్త్‌కార్డులు ఉంటాయని, వారికి సింగరేణి మెడికేర్ స్కీం నిరుపయోగమని పేర్కొంటున్నారు. ఈమధ్యకాలంలో హెల్త్ ఇన్స్యూరెన్స్‌లు చౌకగా లభ్యమవుతున్నాయని, తక్కువ ప్రీమియంకే నగదు రహిత చికిత్స, ఆదాయ పన్నులో మినహాయింపు ఉండడంతో హెల్త్ ఇన్స్యూరెన్స్ తీసుకున్న కార్మికులకు వృథాఖర్చేనని పేర్కొంటున్నారు. 30సంవత్సరాల సర్వీస్ ఉన్న కార్మికుడి నుంచి రూ.2వేల చొప్పున 20నెలలు రికవరీ చేస్తే రూ.40వేలు అవుతుందని, దానిని బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే 30సంవత్సరాలకు రూ.12,80,000అవుతుందని, కంపెనీ రూ.5లక్షల వరకే ఈ పథకం కింద వైద్య సహాయం అందిస్తుందని, అలాంటప్పుడు సంస్థ కార్మికుడికి చేసే మేలు ఎమిటని ప్రశ్నిస్తున్నారు. కార్మికులు కోరుకుంటేనే రికవరీ చేయాలి కానీ, బలవంతంగా వసూలు చేయడం ఎమిటని, రిటైర్మెంట్ సమయానికి కార్మికుల పిల్లలే పెద్దపెద్ద సంస్థల్లో పనిచేస్తూ వారి సంస్థల రిఫరల్‌తో మెడికల్ ట్రీట్‌మెంట్ పొందినప్పుడు సంస్థ అందించే ఈ స్కీం వారికి ఏవిధంగా సహాయపడగలదని పేర్కొంటున్నారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికులు తమ వారసులకు ఉద్యోగం వచ్చిన తరువాత కార్పోరేట్ రిఫరల్ వారసుల ద్వారా వర్తించినప్పుడు రూ.40వేలు కట్టాల్సిన అవసరం ఏముందని కార్మికులు పేర్కొంటున్నారు. జాతీయ కార్మిక సంఘాలు చేసిన తప్పిదంతో పింఛన్ కోసం ప్రతి కార్మికుడు ఇప్పటికే రూ.4వేల ఆదాయాన్ని కోల్పోతున్నాడని, మెడికల్ స్కీంతో మరో 40వేల రూపాయల నష్టం జరుగుతుందని, ఈవిషయమై జాతీయ సంఘాల నాయకులను నిలదీసేందుకు కార్మికులందరు ఏకమవుతున్నారు. కార్మికవర్గానికి జరుగుతున్న నష్టం రిత్యా సమస్య పరిష్కారానికి యాజమాన్యం న్యాయం చేసేందుకు సానుభూతితో పరిశీలించాల్సిన అవసరం ఉంది.



సకుటుంబం

వెరైటీ పూరీలు

బుగ్గల్లా ఉబ్బిన పూరీ.. ఎవరికి ఇష్టముండదు. ఆలు కర్రీతో కాని, చికెన్ కర్రీతో కాని పూరీతో కలిపి తింటే మస్తుగుంటది. మామూలు గోధుమపిండి పూరీలే కాకుండా మరింత కలర్‌ఫుల్‌గా, రుచిగా, ఆరోగ్యకరంగా పూరీలు చేసుకుందాం...

మసాలా

గోధుమ పిండి - 3 కప్పులు,సెనగపిండి - 1 కప్పు కొబ్బరి తురుము - 1/2 కప్పు, అల్లం వెల్లుల్లి ముద్ద - 1 టేబుల్‌స్పూన్, పసుపు - 1/4 టేబుల్‌స్పూన్, కారం పొడి - 1 టేబుల్‌స్పూన్,గరం మసాలా పొడి - 1/4 టేబుల్‌స్పూన్, ధనియాల పొడి - 1 టేబుల్‌స్పూన్, ఉప్పు - తగినంత కరివేపాకు - 4 రెబ్బలు, నూనె - వేయించడానికి

గోధుమ పిండి, సెనగపిండి ఉప్పు కలిపి జల్లించి ఒక వెడల్పాటి గిన్నెలో వేసుకోవాలి. ఇందులో



అల్లం వెల్లుల్లి నీళ్లు, పసుపు, కారం పొడి, ధనియాల పొడి, గరం మసాలా పొడి, తగినంత ఉప్పు, కొబ్బరి పొడి, సన్నగా తరిగిన కరివేపాకు వేసి బాగా కలపాలి. ఇందులో తగినన్ని నీళ్లు కలుపుతూ పూరీ పిండిలా తడిపి మూతపెట్టి ఉంచాలి. అరగంట తర్వాత పిండిని మళ్లీ కొంచం నూనె వేసి బాగా మర్దనా చేసి చిన్న ఉండలు చేసుకోవాలి. పొడి పిండి జల్లుకుంటూ పలుచగా పూరీల్లా వత్తుకోవాలి.

బాణలిలో నూనె వేడి చేసి ఈ పూరీలను మధ్యస్థమైన వేడిలో నిదానంగా కరకరలాడేలా కాల్చుకోవాలి. ఈ మసాలా పూరీలు వారం వరకు నిలవ ఉంటాయి. ఈ పూరీలను మరోవిధంగా కూడా చేసుకోవచ్చు.

గోధుమపిండిలో చిటికెడు ఉప్పువేసి తడిపి పక్కన పెట్టుకోవాలి. సెనగపిండి, కొబ్బరిపొడి మిగతా వస్తువులు కలిపి కాసిన్ని నీళ్లు కలిపి తడిపి పెట్టుకోవాలి. గోధుమపిండి కొంచెం పెద్ద ఉండలు చేసుకోవాలి. సెనగపిండి మిశ్రమాన్ని కొంచెం చిన్న ఉండలు చేసుకోవాలి. గోధుమపిండి ఉండను చేత్తో వెడల్పు చేసి మధ్యలో సెనగపిండి, కొబ్బరి ఉండను ఉంచి అంచులన్నీ మూసేయాలి. తర్వాత జాగ్రత్తగా పూరీలా వత్తుకుని వేడినూనెలో వేసి కాల్చుకోవాలి.

మేతీ

గోధుమ పిండి - 2 కప్పులు
మెంతికూర తరుగు - 3 టేబుల్‌స్పూన్,
వాము - 1 టేబుల్‌స్పూన్,
ఉప్పు - తగినంత
నూనె - వేయించడానికి
డాల్డా - 2 టేబుల్‌స్పూన్,

గోధుమపిండిలో డాల్డా కరిగించి వేసి బాగా కలపాలి. ఇందులో సన్నగా తరిగిన మెంతికూర లేదా నలిపి పొడి చేసుకున్న కసూరి మేతి, వాము, తగినంత ఉప్పు వేసి కలపాలి. మొత్తం బాగా కలియబెట్టి తగినన్ని నీళ్లతో పూరీపిండిలా కలిపి కొద్దిగా నూనె రాసి మూతపెట్టి ఉంచాలి. అరగంట తర్వాత పిండిని మర్దనా చేసి చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి. వీటితో పూరీలు వత్తుకుని వేడి నూనెలో బంగారు రంగు వచ్చేవరకు కాలుచుకుని ఏదైనా చట్నీతో సర్వ్ చేయాలి.

మామిడి..



మామిడి పూరీ:
గోధుమ పిండి - 2 కప్పులు
మామిడిపండు గుజ్జు - 1/2 కప్పు
ఉప్పు - చిటికెడు
యాలకుల పొడి - చిటికెడు
పంచదార - 3 టేబుల్ స్పూన్లు
నూనె - వేయించడానికి

గోధుమపిండిలో ఉప్పు కలిపి జల్లించుకోవాలి. మామిడిపళ్ల ముక్కలు, యాలకుల పొడి, పంచదార కలిపి మిక్సీలో గుజ్జులా చేసుకోవాలి. ఒక గిన్నెలో ఈ గుజ్జు, జల్లించిన గోధుమపిండి వేసి కలిపి పూరీపిండిలా కలుపుకోవాలి. అవసరమనుకుంటే కొద్దిగా నీళ్లు కలుపుకోవచ్చు. తడిపిన పిండిని మూత లేదా బట్టతో కప్పి పెట్టి ఉంచాలి. అరగంట తర్వాత పిండిని బాగా మర్దనా చేసి చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి. ఈ ఉండలతో కొద్దిగా నూనె అద్దుకుంటూ పూరీలలా వత్తుకోవాలి. బాణలిలో నూనె వేడి చేసి ఈ పూరీలను రెండువైపులా బంగారు రంగు వచ్చేవరకు వేయించి వేడిగా సర్వ్ చేయాలి. మీకు ఇష్టముంటే పైన పంచదార పొడి కూడా చల్లుకోవచ్చు.



జ్యోతి వలబోజు
8096310140

పాలక్

గోధుమపిండి - 3 కప్పులు
పాలకూర పేస్ట్ - 1/2 కప్పు
ఉప్పు - తగినంత, ధనియాల పొడి - 1 టేబుల్‌స్పూన్
నూనె - వేయించడానికి

పాలకూర ఆకులను బాగా కడిగి వేడి నీళ్లలో వేసి ఉంచాలి. చల్లారిన తర్వాత తీసి మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి.



గోధుమపిండిలో ఉప్పు, ధనియాల పొడి వేసి కలిపి, పాలకూర పేస్ట్ కూడా వేసి కలుపుకోవాలి. అవసరమైనంత నీళ్లు కలుపుకుంటూ పూరీపిండిలా తడిపి మూతపెట్టి ఉంచాలి. అరగంట తర్వాత పిండిని మళ్లీ పిసికి చిన్న ఉండలు చేసుకోవాలి. వీటిని పూరీల్లా వత్తుకుని వేడి నూనెలో కాల్చుకోవాలి. వీటిని ఏదైనా కూర లేదా కుర్మాతో సర్వ్ చేయండి..

మిల్క్

గోధుమ పిండి - 2 కప్పులు, నెయ్యి లేదా డాల్డా - 2 టేబుల్‌స్పూన్, పాలు - 4 కప్పులు, యాలకుల పొడి - 1/4 టేబుల్‌స్పూన్,పంచదార - 5 టేబుల్‌స్పూన్, బాదాం పలుకులు - 5, ఉప్పు - చిటికెడు, నూనె - వేయించడానికి



గోధుమపిండిలో పేరిన నెయ్యి లేదా డాల్డా, చిటికెడు ఉప్పు వేసి బాగా కలిపి తగినన్ని నీళ్లతో పూరీపిండిలా తడిపి మూతపెట్టి ఉంచుకోవాలి. ఒక గిన్నెలో పాలు పోసి బాగా చిక్కబడేవరకు మరిగించాలి. ఇందులో పంచదార, యాలకుల పొడి కలిపి ఉంచుకోవాలి. తడిపిన పిండిని బాగా మర్దనా చేసి చాలా చిన్న చిన్న ఉండలు చేసుకుని పూరీల్లా వత్తుకోవాలి. వీటిని వేడి నూనెలో వేసి బంగారు రంగు వచ్చేవరకు రెండువైపులా కాల్చుకుని గోరువెచ్చని పాలలో వేయాలి.ఇలాగే అన్ని పూరీలు చేసుకోవాలి. పది నిమిషాలు పూరీలన్నీ పాలను పీల్చుకున్నాక తీసి విడిగా ఒక ప్లేటులో పెట్టాలి. మిగిలిన పాలు పోసి సన్నగా తరిగిన బాదాం ముక్కలతో అలంకరించి సర్వ్ చేయాలి.



కమ్మని క్యారెట్ హల్వా

కంటికింపైన రంగులో కనిపిస్తూ చక్కటి రుచితో నోరూరించే ఎర్రటి క్యారెట్ హల్వాని రుచిచూశాం. కానీ వీటికి కాస్త భిన్నంగా నలుపుతో మిలమిలా మెరిసే క్యారెట్ హల్వా గురించి విన్నారా. విటమిన్లు సమృద్ధిగా వుండే ఈ నల్ల క్యారెట్‌లు ఉత్తర భారతదేశంలో మాత్రమే దొరకుతాయి. చాలా అరుదుగా లభించే వీటికి మార్కెట్‌లో డిమాండ్ కూడా ఎక్కువే. ఈ క్యారెట్లను నిత్యం వంటకాల్లో వాడితే ఆరోగ్యానికి చాలా మంచిది. క్యారెట్‌లను కూరల్లో వాడుకోవడం, పచ్చివి తినడం మామూలే కానీ రోటీన్ కాస్త భిన్నంగా నల్ల క్యారెట్ హల్వా చేసుకోని ఆస్వాదించడానికి మీరు రెడీ అయిపోండి.

కావాల్సిన పదార్థాలు

బ్లాక్ క్యారెట్1/2 కిలో,
పంచదార 2 కప్పులు,
క్రీమ్ మిల్క్ 2 కప్పులు,
యాలకులు1/2 టేబుల్ స్పూన్లు,
మిల్క్‌మేయిడ్ ఆఫ్ కప్పు,
నెయ్యి 4 టేబుల్ స్పూన్లు,
పిస్తా, జీడిపప్పు తగినంత.

తయారీ విధానం...

క్యారెట్లను మొదటిగా బాండ్లీలో వేసి పాలు పోసి ఉడికించాలి. క్యారెట్లు మెత్తగా ఉడికిన తరువాత పంచదార, యాలకుల పొడిని వేయాలి. తరువాత మిల్క్‌మెయిడ్ కలపాలి. జీడిపప్పు, పిస్తా పప్పును నెయ్యిలో వేయించి ఆ మిశ్రమానికి పట్టించాలి. ఆ మిశ్రమాన్ని బాగా కలిపి, నెయ్యిని పట్టిస్తే రుచికరమైన క్యారెట్ హల్వా రెడీ అయిపోతుంది.



కిచెన్ టూల్




ఇక సులువుగా...

అవకాడో పండును కట్ చేయడంలో ఈ స్లైసర్ మూడు రకాలుగా ఉపయోగపడుతుంది. అవకాడో పండును సులువుగా ముక్కలు చేస్తుంది. పండును చీలుస్తుంది. పండు మీదుండే పిట్స్‌ను సైతం సులభంగా తొలగిస్తుంది. ఇలా మూడు రకాలుగా ఈ స్లైసర్ ఉపయోగపడుతుంది. ఈ స్లైసర్ పిట్టర్‌ను స్టెయిన్‌లెస్ స్టీలుతో తయారుచేశారు. ఒకే ఒక ట్విస్టుతో అవకాడో అంచున ఉండే పిట్‌ని ఇది సులభంగా తొలగిస్తుంది. అవకాడో మీదున్న తొక్కను తొలగిస్తూనే అందులోని గుజ్జును ఏడు ముక్కలుగా ఈ స్లైసర్ కట్ చేస్తుంది. ఎంతో సాఫ్ట్‌గా, వాడడానికి అనుకూలంగా ఉంటుంది. చేతుల్లోంచి జారిపోని రీతిలో గట్టి గ్రిప్ కూడా ఈ స్లైసర్‌కి ఉంది. దీనిపై ఉండే టాప్ రాక్‌ను డిష్ వాషర్‌లో వేసి శుభ్రంచేసుకోవచ్చు.


ఈ సీజన్‌లో నెయ్యి తీసుకుంటే..

నెయ్యి తీసుకుంటే ఆరోగ్యానికి చాలా ఉపయోగాలున్నాయని మన అందరికీ తెలుసు. పైగా వంటకాల్లో నెయ్యి చేర్చితే అదనపు రుచి కూడా వస్తుంది. కానీ.. చలికాలంలో నెయ్యి తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి చేకూరే లాభాలు అనేకం.

* చలికాలంలో వైరస్‌లు వేగంగా విస్తరిస్తాయి. అందుకే దగ్గు, జలుబు, జ్వరం వంటివి నిత్యం దాడి చేస్తుంటాయి.
* దీనికి చెక్ పెట్టాలంటే ప్రతిరోజూ ఉదయాన్నే గ్లాసెడు గోరువెచ్చటి పాలల్లో మూడు స్పూన్ల నెయ్యి కలిపి తీసుకుంటే ఫలితం ఉంటుంది.
* చలికాలంలో చాలామంది నీరసంగా, అలసటగా ఉంటారు. అలాంటి వారికి నెయ్యి మంచి ఔషధం. రోజులో ఒకపూట వేడి వేడి అన్నంలో కొద్దిగా నెయ్యి కలిపి తింటే చలాకీగా ఉంటారు. జీర్ణసమస్యలతో బాధపడేవారు తరుచుగా నెయ్యి తీసుకుంటే గుణం కనిపిస్తుంది. చలికాలంలో చర్మం, పెదాలు పొడిబారి అందవిహీనంగా కనిపించడం అందరి సమస్య. చర్మాన్ని అందంగా మార్చుకోవడం కోసం ఏవేవో క్రీములు వాడే బదులు నెయ్యి అప్లై చేస్తే చర్మసౌందర్యం మరింత పెరుగుతుంది. నెయ్యిని వేడి చేసి చల్లార్చి, అందులో కొద్దిగా పెరుగు, నిమ్మరసం కలిపి చర్మానికి రాసుకోవాలి. గంట తర్వాత స్నానం చేస్తే చర్మం కోమలంగా ఉంటుంది. అల్సర్ సమస్యతో బాధపడేవారికి నెయ్యి మంచి ఔషధం. నెయ్యిని వేడి చేసి అందులో కొద్దిగా చక్కెర కలిపి ప్రతిరోజూ సేవిస్తే సమస్య తగ్గుముఖం పడుతుంది.



మన రంగవల్లి





ఎం. మార్తమ్మ, జేపల్లి.

19చుక్కలు
10 వచ్చే వరకు
సందు చుక్క

'పరారీ ఆర్థిక నేరస్థుడు' మాల్యా

ప్రకటించిన పిఎంఎల్‌ఎ ప్రత్యేక కోర్టు




ముంబయి: బ్యాంకులకు సుమారు తొమ్మిది వేల కోట్లు ఎగ్గొట్టి లండన్‌లో తలదాచుకున్న విజయ్ మాల్యాను పారిపోయిన నేరస్థుడిగా ప్రకటించారు. ముంబయిలోని పిఎంఎల్‌ఏ ప్రత్యేక న్యాయస్థానం శనివారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. పలాయనంలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల చట్టం 2018 ప్రకారం మాల్యాకు పరారీలో ఉన్న ఆర్థికనేరస్థుడి ట్యాగ్ ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) పిఎంఎల్‌ఎ కోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఇడికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో పాటుగా ఇడి అభ్యర్థనపై స్టే విధించాలని కోరుతూ మాల్యా దాఖలు చేసుకున్న పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.ఈ తీర్పుతో మాల్యాకు సంబంధించిన ఆస్తులన్నిటినీ ఇక ప్రభుత్వం జప్తు చేసుకోవచ్చు. ఈ చట్టం కింద న్యాయస్థానం ప్రకటించిన తొలి పరారైన ఆర్థిక నేరస్థుడు మాల్యానే కావడం గమనార్హం. తాను పరారీలో ఉన్న నేరగాడిని కాదని వాదిస్తూ మాల్యా గత నెల సుప్రీంకోర్టును ఆశ్రయించగా అక్కడా ఆయనకు ఎదురు దెబ్బ తగిలింది. పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించేందుకు ఇడి ప్రారంభించిన ప్రక్రియపై స్టే విధించాలని కోరుతూ మాల్యా దాఖలు చేసుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. మరో వైపు బ్యాంకులకు రుణాలను ఎగ్గొట్టిన మాల్యాను భారత్‌కు అప్పగించాల్సిందిగా లండన్‌లోని వెస్ట్ మినిస్టర్స్ కోర్టు గత నెల తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. మాల్యాపై తప్పుడు కేసులు పెట్టినట్లు ఎక్కడా ఎలాంటి ఆధారాలు కనిపించలేదని, అందువల్ల మాల్యా భారత్‌లోని కోర్టులకు సమాధానం చెప్పాలని లండన్‌లోని వెస్ట్ మినిస్టర్స్ కోర్టు చీఫ్ మేజిస్ట్రేట్ జడ్జి ఎమ్మా అర్బత్‌నాట్ వ్యాఖ్యానించారు. మాల్యాకోసం ముంబయిలోని ఆర్థర్ రోడ్డు జైలును సిద్ధం చేశారు. మాల్యాను భారత్‌కు తీసుకువచ్చిన తర్వాత ఇక్కడే ఉంచుతారు. ఇదిలా ఉండగా భారత బ్యాంకులకు రుణాలను చెల్లిస్తానని మాల్యా ఇటీవల ప్రకటించడం తెలిసిందే.

నేను ఏ తప్పూ చేయలేదు

భద్రతా కారణాల వల్ల భారత్ రాలేను

పిఎన్‌బి కేసు సివిల్ లావాదేవీయే : నీరవ్ మోడీ



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకును(పిఎన్‌బి) వేల కోట్లకు ముంచేసి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ కొత్త పాట అందుకున్నారు. తనకు, పిఎన్‌బికి మధ్య జరిగింది సివిల్ లావాదేవీలని, భద్రతా కారణాల రీత్యా తాను భారతదేశానికి తిరిగి రాలేనని నీరవ్ మోడీ మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పిఎంఎల్‌ఎ) కోర్టుకు శనివారం తెగేసి చెప్పారు. కొత్తగా తీసుకువచ్చిన పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల నిరోధక చట్టం కింద నీరవ్ మోడీని ఆర్థిక నేరగాడిగా ప్రకటించాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన పిటిషన్‌పై పిఎంఎల్‌ఎ కోర్టు నీరవ్ మోడీ శనివారం సమాధానమిచ్చారు. "నేనేమీ తప్పు చేయలేదు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం ఒక సివిల్ లావాదేవీ.. అదంతా ఓ తప్పుల తడక. పరిస్థితి చేజారిపోయింది. భద్రతా కారణాల దృష్ట్యా దేశానికి తిరిగి రాలేను" అంటూ తన న్యాయవాది ద్వారా నీరవ్ కోర్టుకు తెలియచేశారు. నీరవ్ మోడీ యునైటెడ్ కింగ్‌డమ్‌లో నివసిస్తున్నట్లు డిసెంబర్ 28న బ్రిటిష్ ప్రభుత్వం భారత ప్రభుత్వానికి సమాచారం ఇచ్చిన దరిమిలా పిఎంఎల్‌ఎ కోర్టుకు నీరవ్ సమాధామిచ్చారు. నీరవ్ మోడీతో పాటుగా మరో నిందితుడైన మొహుల్ చోక్సీని భారత్‌కు రప్పించేందుకు అధికారులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇడి అధికారులు ఇటీవలే చోక్సీ గీతాంజలి గ్రూపునకు చెందిన ఒక ఫ్యాక్టరీని జప్తు చేసింది. రూ.13 కోట్లకు పైగా విలువైన ఈ కర్మాగారం థాయిలాండ్‌లో ఉంది. ఇప్పటివరకు ఈ కేసులో ఇడి రూ.4,765 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది.

మళ్లీ సమ్మె బాటలో బ్యాంకు ఉద్యోగులు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు మరోసారి సమ్మె బాట పట్టబోతున్నారు. ఉద్యోగ విధానాలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా పది ట్రేడ్ యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 8,9 తేదీల్లో సమ్మె చేయనున్నట్లు బ్యాంకు ఉద్యోగుల సంఘాలు వెల్లడించాయి.' 2019 జనవరి 8,9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఎఐబిఇఎ), భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (బిఇఎఫ్ఐ) పిలుపునిచ్చాయి. ఈ సమాచారాన్ని సదరు సంఘాలు భారత బ్యాంకుల సంఘం (ఐబిఎ)కు అందజేశాయి' అని ఐడిబిఐ బ్యాంక్ బిఎస్‌ఇ ఫైలింగ్ సందర్భంగా తెలియజేసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా ఇదే విషయాన్ని తెలియజేసింది. గత నెలలో బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేసిన విషయం తెలిసిందే. వేతన సవరణ, పెన్షన్‌తో పాటుగా ఇతర సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అఖిల భారత బ్యాంక్ అధికారుల సంఘం(ఎఐబిఒసి) ఇచ్చిన పిలుపు మేరకు బ్యాంకు అధికారులు డిసెంబర్ 21న విధులను బహిష్కరించి ఒక రోజు సమ్మె చేశారు.ఆ తర్వాత బ్యాంక్ ఆఫ్ బరోడా, విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌ల విలీనానికి వ్యతిరేకంగా బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది డిసెంబర్ 26న మరోసారి సమ్మె చేశారు.

కాల్‌డ్రాప్స్ తగ్గించేందుకు చర్యలు

న్యూఢిల్లీ: దేశంలో కాల్‌డ్రాప్‌లను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇప్పటికే కొన్ని టెలికాం సంస్థలపై రూ.58 లక్షలు పెనాల్టీ విధించామని టెలికాం మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. శుక్రవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ విషయం చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన బిఎస్‌ఎన్‌ఎల్‌పై ఈ త్రైమాసికానికి గాను జూన్ నెలలో రూ.2 లక్షలు, అదే సమయంలో ఐడియాకు రూ.12 లక్షల చొప్పున పెనాల్టీ విధించినట్లు మంత్రి తెలిపారు. కాల్ డ్రాప్ రేటు విషయంలో నిర్దేశిత మార్క్‌ను చేరుకున్న సర్వీస్ ప్రొవైడర్లపై ట్రాయ్ ఆర్థికపరమైన ఆంక్షలు విధించిందని కూడా మంత్రి తెలిపారు. టెలీ కమ్యూనికేషన్ విభాగంలో మౌలిక సదుపాయాల వృద్ధి, బేసిక్ ట్రాన్స్ రిసీవర్ స్టేషన్ (బిటిఎస్)ల సంఖ్య 20 లక్షలకు చేరడంతో ఇప్పుడు పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.03
యూరో	79.75
బ్రిటిష్ పౌండ్	88.44
ఆస్ట్రేలియన్ డాలర్	49.18
కెనెడియన్ డాలర్	51.91
సింగపూర్ డాలర్	51.40
స్విస్ ఫ్రాంక్	70.92
చైనీస్ యువాన్	10.20
మలేషియన్ రింగిట్	16.92
న్యూజిలాండ్ డాలర్	46.88
హాంకాంగ్ డాలర్	8.94
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	230.86
సౌతాఫ్రికన్ రాండ్	4.90

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30480	32598.93	0.13%
ముంబై	31280	33454.55	2.02%
ఢిల్లీ	31200	33368.98	0.16%
కోల్‌కతా	31610	33807.49	0.25%
కేరళ	29750	31818.18	1.19%
బెంగళూరు	29950	32032.09	0.3%
హైదరాబాద్	30480	32598.93	0.13%
గల్ఫ్	137.68	147.25	1.38%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42365.00
ముంబై	₹ 42365.00
ఢిల్లీ	₹ 42365.00
కోల్‌కతా	₹ 42365.00
హైదరాబాద్	₹ 42365.00



జీతాల కోసం రూ.1000 కోట్ల అప్పు

- తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ హెచ్‌ఎఎల్
- ఉద్యోగుల మూడు నెలల జీతాల కోసం అప్పు చేసిన కంపెనీ
- మార్చి నాటికి మరింత పెరగనున్న భారం

బెంగళూరు: ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఎల్) తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దీర్ఘకాలంగా ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న కంపెనీ తాజాగా ఉద్యోగులకు జీతాలు చెల్లించడం, తదితర అవసరాల కోసం వెయ్యి కోట్ల రూపాయలు అప్పు చేయాల్సి వచ్చింది. 20 వేల మందికి పైగా ఉన్న ఉద్యోగులకు మూడు నెలల జీతాలు చెల్లించడం కోసం సంస్థ ఈ నిర్ణయం తీసుకొంది. గత రెండు, మూడు దశాబ్దాలుగా ధనవంత కంపెనీగా ఉన్న హెచ్‌ఎఎల్ మొట్టమొదటి సారిగా నగదు కోసం అప్పు (ఓవర్‌డ్రాఫ్ట్ ద్వారా) చేయాల్సి వచ్చిందని హెచ్‌ఎఎల్ చైర్మన్ ఆర్ మాధవన్ వ్యాఖ్యలను ఉటంకిస్తూ ' టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక తెలియజేసింది. పుష్కలమైన ఆర్థిక నిల్వలతో ఉన్న సంస్థ తాజాగా లోటు బడ్జెట్‌లోకి జారుకుందని మాధవన్ అన్నారు. మార్చి నాటికి ఈ నగదు ప్రతికూలత భరించలేనంతగా రూ.6 వేల కోట్లకు చేరుకోనుందని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా హెచ్‌ఎఎల్‌కు అతి పెద్ద కస్టమర్‌గా ఉన్న భారత వైమానిక దళం చెల్లించాల్సిన బకాయిలు భారీ ఎత్తున పేరుకు పోయిన కారణంగా ఆర్థిక ఒత్తిడికి దారి తీసినట్లు మాధవన్ చెప్పారు. 2017 మార్చి నాటికి రూ.14,500 కోట్లుగా ఉన్న బకాయిల్లో కేవలం 2 వేల కోట్ల రూపాయలను మాత్రమే భారత వైమానిక దళం చెల్లించింది. 2017– 18 ఆర్థిక సంవత్సరానికి రూ.13,500 కోట్ల రక్షణ బడ్జెట్‌ను ప్రభుత్వం ఆమోదించింది. 2017 – 18నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలతో కలుపుకొని సవరించిన బడ్జెట్ రూ.33,715 కోట్లుగా ఉంది. కాగా డిసెంబర్ 31 నాటికి రూ.15,700 కోట్లకు చేరుకున్న బకాయిలు మార్చినాటికి రూ.20,000 కోట్లకు చేరుకోవచ్చని అంటున్నారు. రూ.14,500 కోట్లు భారత వైమానిక దళం చెల్లించాల్సి ఉండగా, మిగిలిన మొత్తం ఆర్మీ, నౌకాదళం, కోస్ట్ గార్డు చెల్లించాల్సి ఉంది.ఈ పరిణామం హెచ్‌ఎఎల్‌పై ఆధారపడిన 20 వేల మంది సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారస్థులను ప్రభావితం చేయనుందని మాధవన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగదు కొరత అప్పుల వైపు నెడుతోందని, లేదంటే బకాయిలను చెల్లించాలని ఎంఎస్‌ఎంఇలను బలవంతం చేయాల్సి వస్తుందని, ఇది వారిని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని మాధవన్ చెప్పారు. హెచ్‌ఎఎల్‌లో మొత్తం ఉద్యోగుల సంఖ్య 29,035 కాగా వీరికి చెల్లించే నెలవారీ జీతం మొత్తం రూ.358 కోట్లు.

తగ్గిపోతున్న జిఎస్‌టి వసూళ్లు



- రిటర్న్‌లు దాఖలు చేయని వారు రెట్టింపు
- మార్చి నాటికి లోటు రూ.40 వేల కోట్లు?

న్యూఢిల్లీ: ఏడాది క్రితం వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)ని ప్రవేశపెట్టినప్పటినుంచి పన్ను చెల్లించే వ్యాపారుల సంఖ్య క్రమంగా తగ్గిపోతూ ఉండడం ప్రభుత్వానికి ఆందోళన కలిగిస్తోంది. 2017 నవంబర్‌లో జిఎస్‌టి రిటర్న్‌లు దాఖలు చేయని వారి శాతం 10.56 శాతం మాత్రమే ఉండగా 2018 నవంబర్ నాటికి అది 28.75 శాతానికి చేరుకుందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా లోక్‌సభలో ఇచ్చిన ఓ లిఖితపూర్వక సమాధానం లో తెలిపారు. కాంపోజిషన్ టాక్స్ పేయర్లలో రిటర్న్‌లు దాఖలు చేయని వారి శాతం 2017–18 జూలై– సెప్టెంబర్ త్రైమాసికంలో 15.03 శాతం ఉండగా, 2018–19 జూలై– సెప్టెంబర్ త్రైమాసికం నాటికి 25.37 శాతానికి చేరుకుందని కూడా మంత్రి తన సమాధానంలో తెలియజేశారు. కోటి రూపాయల వరకు వార్షిక టర్నోవర్ ఉండే వ్యాపారులు ఈ కాంపోజిషన్ టాక్స్ చెల్లింపు పథకాన్ని ఎంచుకోవచ్చు. దీనికింద వారు జిఎస్‌టి చెల్లింపులో రాయితీ పొందుతారు. అయినప్పటికీ వీరు సైతం జిఎస్‌టి రిటర్న్‌లు దాఖలు చేయకపోవడం గమనార్హం. వాస్తవానికి గత ఏడాది జూలైలో జిఎస్‌టిని ప్రవేశపెట్టిన తర్వాత పన్ను వసూళ్లు క్రమేణా పెరుగుతూ నెలకు లక్ష కోట్ల దరిదాపులకు చేరుకోగా అ తర్వాత క్రమంగా వసూళ్లు తగ్గుతూ వస్తున్నాయి. కనిపించకుండా పోయిన ఈ టాక్స్ పేయర్లను కనుగొనేందుకు అధికారులు విస్తృతమైన ప్రణాళికను అమలు చేయాలని అనుకుంటున్నారా అన్న ప్రశ్నకు మంత్రి సమాధానం చెబుతూ, రిటర్న్‌లు దాఖలు చేయని వ్యాపారుల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత పన్ను అధికారులకు అందజేయడంజరుగుతోందని, తనిఖీలు, వ్యాపార సంస్థలను సందర్శించడం, సోదాలు, స్వాధీనాలులాంటి చర్యలు తీసుకోవడం జరుగుతోందని చెప్పారు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకోవడానికి నకిలీ ఇన్‌వాయిస్‌లు సమర్పించిన కేసులు 2017 18 ఆర్థిక సంవత్సరంలో కేవలం నాలుగు మాత్రమే ఉండగా 2018–19లో ఆ సంఖ్య 499కు పెరిగినట్లు, వాటి విలువ సైతం 9.75 కోట్లనుంచి దాదాపు 3895 కోట్లకు పెరిగిందని మంత్రి ఆ సమాధానంలో చెప్పారు. గత ఏడాదిగా జిఎస్‌టి వసూళ్లు పరతి నెలా తగ్గుతూ వచ్చిన నేపథ్యంలో లక్ష్యానికి చేరుకోవాలంటే రాబోయే మూడు నెలలు అంటే జనవరి నుంచి మార్చి దాకా ప్రతి నెలా రూ.1.23 లక్షల కోట్లకు తగ్గకుండా ఉండాలని ఇంతకు ముందే కొన్ని పత్రికలు అంచనా వేశాయి. ఆర్థిక శాఖ అధికారులు సైతం మార్చి నాటికి పన్ను వసూళ్లలో తగ్గుదల రూ.40 వేల కోట్ల వరకు ఉండవచ్చని అంగీకరిస్తున్నారు.

బ్యాంకింగ్ ర్యాలీతో మళ్లీ కళకళ

వారాంతంలో కోలుకున్న మార్కెట్లు



ముంబై : కొత్త సంవత్సరం 2019 మొదటి వారంలో బలహీనంగా ప్రారంభించిన మార్కెట్లు 2 శాతం క్షీణించాయి. అంతర్జాతీయంగా ఆర్థిక మాంద్యం, అధిక వడ్డీ రేట్ల కారణంగా నెలవారీ వాహనాల అమ్మకాల సంఖ్య తగ్గడం, లిక్విడిటీ సమస్యలు, జిఎస్‌టి వసూళ్లు పడిపోవడం వంటి పరిణామాలతో దేశీయ బెంచ్‌మార్క్ సూచీలు నేలచూపులు చూశాయి. దీంతో వారం రోజుల్లో నిఫ్టీ 2 శాతం పతనమైంది. ప్రభుత్వం రైతుల కోసం భారీ ఉపశమన ప్యాకేజీని ప్రకటించనున్న తరుణంలో ప్రభుత్వ ఆర్థిక స్థితి అధ్వాన్నంగా మారడం వంటివి ప్రతికూలంగా మారాయి. అయితే బ్యాంకింగ్ రంగానికి కొన్ని ఆనందకరమైన వార్తలు కొనుగోళ్లకు దారితీశాయి. 2018–19 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో బ్యాంకుల ఆస్తుల నాణ్యతలో మెరుగుదల ఉందని ఆర్‌బిఐ ప్రకటన బ్యాంకింగ్‌కు సానుకూలంగా మారింది. మరోవైపు రూ .25 కోట్లకు మించని చిన్న రుణగ్రహీతలకు వన్ టైమ్ పునర్నిర్మాణ పథకం బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలకు పాజిటివ్ అయింది. వారాంతం శుక్రవారం ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో మార్కెట్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 181 పాయింట్లు పెరిగి 35,695 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 55 పాయింట్లు పుంజుకుని 10,727 వద్ద స్థిరపడింది.

జిఎస్‌టి వసూళ్లు తగ్గాయి



గతేడాది డిసెంబర్‌లో జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) వసూళ్లు తగ్గాయి. రూ.94,726 కోట్లు మాత్రమే జిఎస్‌టి వసూళ్లు నమోదవగా, అంతకుముందు నవంబర్‌లో రూ.97,637 కోట్లు వచ్చాయి. 2018 డిసెంబర్ 30 నాటికి సేల్స్ రిటర్న్‌లు లేదా జిఎస్‌టిఆర్–3బి దాఖలు చేసిన మొత్తం సంఖ్య 72.44 లక్షలకు చేరింది. ఆగస్టు–సెప్టెంబర్ కాలానికి గాను రాష్ట్రాల విడుదల చేసిన నష్టపరిహారం రూ.11,922 కోట్లుగా ఉంది. మొత్తం వసూలైన రూ.94,726 కోట్లలో కేంద్ర జిఎస్‌టి(సి–జిఎస్‌టి) వసూళ్లు రూ.16,442 కోట్లు, రాష్ట్ర జిఎస్‌టి(ఎస్–జిఎస్‌టి) రూ.22,459 కోట్లు, ఉమ్మడి జిఎస్‌టి(ఐ–జిఎస్‌టి) రూ.47,936 కోట్లు, సెస్ రూ.7,888 కోట్లు ఉన్నాయి. రెగ్యులర్ సెటిల్మెంట్ ప్రకారంగా ఉమ్మడి జిఎస్‌టి నుంచి సి–జిఎస్‌టికి రూ.18,409 కోట్లు, ఎస్–జిఎస్‌టికి రూ.14,793 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

డీలాపడిన వాహనాల అమ్మకాలు



గతేడాది డిసెంబర్‌లో వాహన విక్రయాలు మిశ్రమంగా ఉన్నాయి. నగదు లభ్యత సమస్యలు, కనిష్ట స్థాయి కొనుగోలు సెంటిమెంట్ వెరసి వాహనాల అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. మారుతీ సుజుకీ ఇండియా అమ్మకాల వృద్ధి డిసెంబర్‌లో 1,19,804 యూనిట్లుగా ఉంది. 2017 ఇదే సమయంలో మారుతీ విక్రయాలు 1,18,560 యూనిట్లుగా ఉన్నాయి. అంటే మారుతీ సేల్స్ అంతంత మాత్రంగానే నమోదైనాయి. నెక్సన్ తయారీ సంస్థ టాటా మోటార్స్ కూడా 1 శాతం వృద్ధినే చూపింది. డిసెంబర్‌లో 14,260 యూనిట్లు సేల్ చేయగా, 2017 డిసెంబర్‌లో 14,180 యూనిట్ల సేల్స్ ఉన్నాయి. మహీంద్రా అండ్ మహీంద్రా కూడా 3 శాతం క్షీణతను చూపింది. గత నెలలో మహీంద్రా సేల్స్ 15,091 యూనిట్లుగా ఉండగా, 2017 డిసెంబర్‌లో 15,543 యూనిట్లుగా ఉన్నాయి.

నెమ్మదించిన పిఎంఐ ఉత్పత్తి



దేశీయ పారిశ్రామిక ఉత్పత్తి డిసెంబర్‌లో నెమ్మదించింది. గత నెలలో ఉత్పత్తి పిఎంఐ(పర్చేసింగ్ మేనేజర్స్ ఇండెక్స్) 53.2 నమోదవగా, అంతకుముందు నవంబర్ నెలలో ఇది 54 పాయింట్లుగా ఉంది. అయినప్పటికీ వృద్ధి పథంలోనే పయనిస్తోంది.

మందగించిన కీలక రంగాల వృద్ధి

క్రూడ్ ఆయిల్, ఫర్టిలైజర్ ఉత్పత్తిలో క్షీణత వల్ల నవంబర్‌లో ఎనిమిది కీలక రంగాల వృద్ధి రేటు మందగించింది. 3.5 శాతం వృద్ధి రేటుతో 16 నెలల కనిష్టానికి పడిపోయింది. 2017 జూలైలో ఈ కీలక రంగాల వృద్ధి అత్యంత కనిష్ట స్థాయిలో 2.9 శాతం నమోదైంది. ఎనిమిది కీలక మౌలిక సదుపాయ రంగాల్లో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ వంటివి ఉంటాయి.



గమనించాల్సిన విషయాలు

- జిఎస్‌టి కౌన్సిల్ జనవరి 10న సమావేశం కానుంది. నిర్మాణంలో ఉన్న ఫ్లాట్లపై, గృహాలపై జిఎస్‌టి 5 శాతం వరకు తగ్గింపు, అలాగే చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మినహాయింపు స్థాయిని పెంచడం వంటి అంశాలపై చర్చించనుంది.
- బ్యాంక్ రుణ వృద్ధి, డిపాజిట్ వృద్ధి, ఎఫ్ఎక్స్ రిజర్వులు, అమెరికా డాలర్
- అమెరికా ఫెడ్ చైర్ పావెల్ డిసెంబర్ 6న మాట్లాడుతాడు. అమెరికా క్రూడ్ ఆయిల్ ఇన్వెంటరీస్
- నెలవారీ దేశీయ తయారీరంగం ఉత్పత్తి, వార్షిక దేశీయ పరిశ్రమ ఉత్పత్తి
- నెలవారీ బ్రిటన్ స్థూల దేశీయోత్పత్తి (జిడిపి), టిసిఎస్, ఇన్ఫోసిస్ ఫలితాలు

యుకె సిన్హా ఆధ్వర్యంలో కమిటీ



సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఇ) ఆర్థిక స్థిరత్వానికి దీర్ఘకాలిక పరిష్కారం ఇచ్చేందుకు గాను సెబీ చైర్మన్ యుకె సిన్హా ఆధ్వర్యంలో నిపుణుల కమిటీని ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) ఏర్పాటు చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.25 కోట్ల వరకు రుణాలకు వన్ టైమ్ రీస్ట్రక్చరింగ్ అనుమతి ఇచ్చింది. ఎంఎస్ఎంఇలకు అనుమతి ఇచ్చిన తర్వాత మరుసటి రోజు ఆర్‌బిఐ ఈ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ రంగానికి సమయానికి తగినంతగా ద్రవ్య లభ్యత వంటి అంశాలను పరిశీలించేందుకు ఎనిమిది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. నిపుణుల కమిటీ 2019 జూన్ ముగింపు నాటికి నివేదికను సమర్పిస్తుందని ఆర్‌బిఐ వెల్లడించింది.

> ఇతరుల సహకారం లేకుండా ప్రపంచంలో జీవించడం ఎవరికీ సాధ్యం కాదు. అయితే మనకు సాయం చేసిన వారిని ఎప్పటికీ మరచిపో కూడదు. కానీ కొందరు ఎంత సహాయం చేసినప్పటికీ బయటకు చెప్పుకోరు. అది వాళ్ల గొప్పతనం. నటులు విజయ్‌కాంత్, అజిత్‌లు అంతటి గొప్ప మనస్సు కలవారు.
>
> -నటి జ్యోతిక

అరగంట పాటు హై వోల్టేజ్ యాక్షన్


రామ్‌చరణ్

ఈనెల 11న రానున్న రామ్‌చరణ్ చిత్రం 'వినయ విధేయ రామ' కౌంట్‌డౌన్‌తో మెగా ఫ్యాన్స్‌కు నిద్ర పట్టడం లేదు. 'రంగస్థలం' తర్వాత వస్తున్న చరణ్ మూవీ కావడం, మెగా హీరోలకు ఈమధ్య చెప్పుకోదగిన హిట్ లేకపోవడంతో దీని మీద మామూలు అంచనాలు లేవు. ఊర మాస్ కంటెంట్‌తో దర్శకుడు బోయపాటి శ్రీను స్టైల్‌లో వస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో టైటిల్‌లో ఉన్న సున్నితత్వం కథలో ఉండదని అర్థమైపోయింది. అందుకే సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌కే పైసా వసూల్ అయిపోతాయని అభిమానులు ధీమాగా ఉన్నారు. ఇకపోతే ఇటీవల విడుదలైన పోస్టర్స్‌లో రామ్‌చరణ్ మ్యాడ్ మాక్స్ తరహాలో ఛాతి మీద టాటూలతో... కండలు తిరిగిన దేహంతో చొక్కా లేకుండా కనిపించడంతో సినిమాపై అంచనాలు పెరిగిపోయాయి. పైగా ట్రైలర్‌లో ఈ ఫైట్‌ను బాగా హైలైట్ చేయడంతో అంచనాలు ఎక్కడికో వెళ్లిపోయాయి. దీనికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ ఇప్పుడు ప్రచారంలోకి వచ్చింది. చరణ్ భీభత్సం చేసే ఈ హై వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్ ఇంటర్వెల్ తర్వాత వస్తుందట. ఏదో ఐదు, పది నిమిషాలు కాదు ఏకంగా అరగంట పాటు బీహార్ నేపథ్యంలో కరుడు గట్టిన విలన్ల మధ్య వివేక్ ఒబెరాయ్ డెన్‌లో ఈ యాక్షన్ సీన్ ఉంటుందని తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈమధ్య కాలంలో ఏ తెలుగు సినిమాలో చూడని రచ్చరంబోలా ఫైట్స్ ఈ సినిమాలో ఉంటాయట. అయితే చరణ్ అక్కడికి వెళ్లడానికి అన్నయ్య ప్రశాంత్ పాత్రకు ఏదో కీలకమైన కనెక్షన్ ఉంటుందని తెలిసింది. మొత్తానికి హైప్‌ను అంతకంతకు పెంచుకుంటూ పోతున్న 'వినయ విధేయ రామ' రామ్‌చరణ్ కెరీర్‌లోనే అత్యధిక బిజినెస్ జరుపుకుంది

వరుసగా సినిమాలతో బిజీ


రజనీకాంత్

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించినప్పటికీ వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. అయితే ఈ ఏడాదే సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఒకవేళ రాజకీయాల్లోకి వచ్చినట్లయితే రజనీకాంత్ పార్టీ కూడా ఈ ఎన్నికల్లో తమిళనాట పోటీ చేయాలి. అయితే ఈమేరకు రజనీకాంత్ ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం లేదు. ఇక సంక్రాంతి సందర్భంగా రజనీకాంత్ సినిమా 'పేట' విడుదల కానుంది. 'భాషా' తరహాలో పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా కనిపిస్తోంది. దీని తర్వాత స్టార్ డైరెక్టర్ మురుగదాస్‌తో రజనీకాంత్ ఓ సినిమా చేయబోతున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. అది కూడా పూర్తిగా మాస్ ఎంటర్‌టైనరే అని తెలిసింది. ఇలా వరుసగా రజనీకాంత్ సినిమాలతో బిజీ అవుతున్నారు. ఇది మాత్రమే కాకుండా ఈ స్టార్ హీరో మరిన్ని సినిమాలకు కూడా కమిట్ అవుతున్నారని సమాచారం. 'పేట' దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలోనే మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే మాట వినిపిస్తోంది. ఈమధ్య రజనీకాంత్ ఒకే దర్శకుడితో వరుసగా సినిమాలు చేయడానికి ఇష్టపడుతున్నారు. శంకర్, రంజిత్ వంటి దర్శకులతో వరుసగా సినిమాలు చేశారు. ఈ నేపథ్యంలో కార్తీక్ సుబ్బరాజ్‌కు కూడా మరో అవకాశం ఇవ్వనున్నట్టు తెలిసింది. అలాగే దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో కూడా రజనీకాంత్ ఒక సినిమాలో నటించబోతున్నారనే మాట వినిపిస్తోంది. మురుగదాస్, కార్తీక్ సుబ్బరాజ్ సినిమాల అనంతరం రాజమౌళితో రజనీ సినిమా ఉండవచ్చని అంటున్నారు.

టాలీవుడ్‌లోకి రీ ఎంట్రీ?


కత్రినాకైఫ్

టాలీవుడ్‌లో సూపర్‌స్టార్‌గా తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకున్న కథానాయకుడు మహేష్‌బాబు. బ్లాక్‌బస్టర్ హిట్స్ శ్రీమంతుడు, భరత్ అనే నేను సినిమాల్లో కోటీశ్వరుడిగా నటించి ప్రేక్షకులను అలరించారు ఈ టాప్ హీరో. ప్రస్తుతం అదే తరహాలో 'మహర్షి' సినిమాతో ప్రేక్షకులకు వినోదాన్ని అందించడానికి సిద్ధమవుతున్నారు. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్న ఈ మూవీలో హీరోయిన్‌గా పూజా హెగ్డే నటిస్తుండగా... ఓ ముఖ్యమైన పాత్రలో అల్లరి నరేష్ నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 5న విడుదల కానుంది. 'మహర్షి' సినిమా అనంతరం మహేష్ తదుపరి చిత్రం సుకుమార్ దర్శకత్వంలో ఉండబోతుందన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో మహేష్ సరసన కథానాయికగా రకుల్‌ప్రీత్ సింగ్, కియారా అద్వానీ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అయితే తాజాగా మహేష్ హీరోయిన్ల జాబితాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినాకైఫ్ పేరు కూడా చేరినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సుకుమార్ తన సినిమాలో మహేష్‌కు జోడీగా కత్రినాను ఎంచుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు టాలీవుడ్ వర్గాల సమాచారం. ఇదిలాఉండగా కత్రినాకైఫ్ తన సినీ కెరీర్ ప్రారంభంలో తెలుగులో రెండు సినిమాలు చేసింది. ఒకటి వెంకటేష్ సరసన 'మల్లీశ్వరి', బాలకృష్ణతో 'అల్లరి పిడుగు' చిత్రాల్లో ఈ బ్యూటీ నటించింది. ఆతర్వాత పూర్తిగా బాలీవుడ్‌కు పరిమితమై అక్కడ టాప్ హీరోయిన్‌గా వెలుగొందుతోంది. అయితే ఇలాంటి తరుణంలో కత్రినా టాలీవుడ్ సూపర్ స్టార్ కోసం తెలుగులో రీ ఎంట్రీ ఇస్తుందా అన్నది చూడాల్సిందే.

రెండు గెటప్స్‌లో శర్వానంద్


శర్వానంద్

యంగ్ హీరో శర్వానంద్ దర్శకుడు సుధీర్ వర్మతో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. కొంత గ్యాప్ తర్వాత ఈ చిత్రం మళ్లీ సెట్స్‌పైకి వెళ్లింది. 90 దశకం బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ మూవీలో శర్వా ఓ గ్యాంగ్‌స్టర్‌గా నటిస్తున్నట్టు తెలిసింది. ఇకపోతే ఇందులో రెండు గెటప్స్‌లో శర్వానంద్ కనిపించనుండటం ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. మధ్య వయసు దాటిన పాత్ర కోసం ప్రోస్తెటిక్స్ మేకప్‌కు కూడా ఓకే చెప్పాడట ఈ యంగ్ హీరో. ఇటీవలే చేసిన ఫొటోషూట్‌లో శర్వా లుక్స్ సంతృప్తికరంగా రావడంతో సుధీర్ వర్మ ఇకపై స్పీడ్ పెంచనున్నట్టు తెలిసింది. 'హలో' ఫేమ్ కళ్యాణి ప్రియదర్శిని హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ కోసం ప్రత్యేకంగా 90ల నాటి వాతావరణాన్ని ప్రతిబింబించే సెట్స్ కూడా వేశారు. ఈ సినిమా రిలీజ్ డేట్ గురించి క్లారిటీ రావడానికి మాత్రం కొంత సమయం పట్టేలా ఉంది. వేసవి లోపు విడుదల తేదీ తెలిసే అవకాశాలు ఉన్నాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ 30 శాతం మాత్రమే బ్యాలెన్స్ ఉంది. అందులోనే శర్వా మిడిల్ ఏజ్ పాత్ర రావచ్చని సమాచారం. ఈ చిత్రానికి 'విరాటపర్వం 1990' అనే టైటిల్ ప్రచారంలో ఉంది.

అందుకే దూరం

లిప్‌లాకులు హాలీవుడ్ నుండి ప్రారంభమై మెల్లిగా బాలీవుడ్ చేరాయి. అక్కడి నుండి సౌత్‌కు నెమ్మదిగా ఇంపోర్ట్ అయ్యాయి. ఇప్పుడు టాలీవుడ్ సినిమాల్లో కూడా ఈ లిప్‌లాకులు సాధారణమై పోయాయి. ఇక బాలీవుడ్‌లో స్టార్ హీరోల సినిమాల్లో ముద్దు సన్నివేశాలు తప్పనిసరిగా ఉంటున్నాయి. అయితే బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ మాత్రం తన సినిమాల్లో లిప్



లాక్ సన్నివేశాలు ఉండకూడదని ఫిల్మ్‌మేకర్స్‌కు ఖచ్చితంగా చెబుతున్నారు. ఎందుకు ఈ సీన్లు వద్దని అంటున్నారని అతన్ని అడిగితే... తన సినిమాలను అన్ని వయసుల వారు చూస్తారనీ, లిప్‌లాక్ సీన్లకు అందుకే దూరంగా ఉంటున్నానని సల్మాన్ పేర్కొన్నారు. తాజాగా సల్మాన్ ఒక షోకు హాజరైతే అతనికి ఇదే ప్రశ్న ఎదురైంది. దీనికి ఈ స్టార్ హీరో సమాధానమిస్తూ... ''నా సినిమాలను యూత్‌తో పాటు మహిళలు, పిల్లలు, వృద్ధులు చూస్తారు. లిప్‌లాక్ సీన్లు ఉంటే కొంత ఇబ్బందిగా ఉంటుంది. అందుకే అటువంటి సన్నివేశాలకు నేను మొదటి నుంచి దూరంగా ఉంటున్నాను'' అని చెప్పారు సల్మాన్‌ఖాన్.

యదార్థ సంఘటనల ఆధారంగా...


'వనవాసం' పోస్టర్‌ను విడుదల చేస్తున్న త్రివిక్రమ్. చిత్రంలో భరత్‌కుమార్, సంజయ్‌కుమార్ తదితరులు.

నవీన్‌రాజ్ శంకరాపు, శశికాంత్, బందెల కరుణ శ్రావ్య, శృతి హీరోహీరోయిన్లుగా పరిచయమవుతున్న చిత్రం 'వనవాసం'. భరత్ కుమార్ పి.నరేంద్ర దర్శకత్వంలో శ్రీ భవాని శంకర ప్రొడక్షన్ నం.1 చిత్రంగా సంజయ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాల్లో ఉంది. అయితే ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ చేతుల మీదుగా సినిమా పోస్టర్, టైటిల్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్ మాట్లాడుతూ ''నాకు ఈ టైటిల్ బాగా నచ్చింది. టైటిల్ లాగానే సినిమా కూడా బాగుంటుందని ఆశిస్తున్నాను''అని అన్నారు. దర్శకుడు భరత్ కుమార్ మాట్లాడుతూ ''కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తీయడం జరిగింది. ప్రేక్షకులు మెచ్చే విధంగా సినిమా ఉంటుంది''అని తెలిపారు. నిర్మాత సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ''మేము అనుకున్న దానికంటే అద్భుతంగా సినిమా రూపుదిద్దుకుంది. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం''అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః ప్రేమ్ జై విన్సెంట్, సంగీతంః ఎం.ఎం.కుమార్, ఎడిటర్ః ప్రభు.

లవ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్


'ధీవర' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న బాబీ. చిత్రంలో విజయ్ జిక్కి, హరనాథ్ బాబు.

నాగసాయి, విదా చైతన్య హీరోహీరోయిన్లుగా తెరకెక్కుతున్న చిత్రం 'ధీవర'. డిఫరెంట్ స్క్రీన్‌ప్లేతో సాగే సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు బాబీ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ ''ధీవర కాన్సెప్ట్ బాగుంది. యూత్‌కు నచ్చే విధంగా కథ ఉంది''అని అన్నారు. చిత్ర దర్శకుడు విజయ్ జిక్కి మాట్లాడుతూ ''ఈ సినిమాలో స్క్రీన్‌ప్లే హైలైట్‌గా ఉంటుంది. లవ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. ఒకేసారి రెండు జోనర్లలో సినిమా సాగుతుంది''అని తెలిపారు. నిర్మాత హరనాథ్ బాబు మాట్లాడుతూ ''యూత్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సినిమా రూపుదిద్దుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే ఆడియోతో పాటు ట్రైలర్‌ను విడుదల చేస్తాం. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి వచ్చే నెలాఖరుకు ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం''అని పేర్కొన్నారు. భగీరథ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః సాగర్ గొల్లా, సంగీతంః అద్దంకి వెంకటేష్, ఎడిటర్ః క్రాంతి, డ్యాన్స్ః జావీద్ ఖాన్.

ఇంటివాడైన నోయెల్

నటుడు, గాయకుడు నోయెల్ వివాహం నటి ఎస్తేర్ నోరోన్హాతో ఘనంగా జరిగింది. క్రైస్తవ మత సంప్రదాయ పద్ధతిలో ఈ పెళ్లి జరిగింది. మగధీర, ఈగ, కుమారి 21ఎఫ్, నాన్నకు ప్రేమతో, ప్రేమమ్, రంగస్థలం, హలో గురు ప్రేమ కోసమే, పడి పడి లేచె మనసు తదితర చిత్రాలతో నోయెల్ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇక మంగళూరుకు చెందిన ఎస్తేర్ నోరోన్హా '1000 అబద్ధాలు' సినిమాతో కథానాయికగా టాలీవుడ్‌కు పరిచయమైంది. ఆతర్వాత భీమవరం బుల్లోడు, జయ జానకి నాయక తదితర చిత్రాల్లో ఆమె నటించింది. ఎస్తేర్ హిందీ, కన్నడ సినిమాల్లోనూ నటించి ప్రేక్షకులను అలరించింది. అయితే ఎస్తేర్‌తో కలిసి నోయెల్ ఓ మ్యూజిక్ ఆల్బమ్‌లో నటించాడు. ఈ నేపథ్యంలో వీరి మధ్య ప్రేమ చిగురించింది. చివరికి పెద్దల సమ్మతితో వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఈ సందర్భంగా తన పెళ్లిలో ఎస్తేర్‌తో కలిసి దిగిన ఫొటోను నోయెల్ ట్విట్టర్ వేదికగా పంచుకున్నాడు. 'తాము ఇప్పుడు ఇద్దరం కాదని... ఒక్కటే' అని పేర్కొన్నాడు. తన హృదయానికి రాణి ఎస్తేర్ అని అతను ట్వీట్ చేశాడు. మంగళూరులో జరిగిన వీరి వివాహానికి ఎస్.ఎస్.రాజమౌళి, రమా తదితరులు హాజరయ్యారు.


నోయెల్, ఎస్తేర్ నోరోన్హా

ఒంపుసొంపుల వయ్యారాల అమీ


అమీజాక్సన్

బ్రిటీష్ బ్యూటీ అమీజాక్సన్‌కు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపే ఉంది. తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ సినిమాల్లో నటించిన ఈ బ్యూటీ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఐ, 2.0 చిత్రాల్లో హీరోయిన్‌గా చేసి ఎంతో పాపులారిటీని తెచ్చుకుంది. ఇదిలాఉండగా మిలియనీర్ అయిన బాయ్‌ఫ్రెండ్ జార్జ్ పనయోటోతో ఆఫ్రికా ఖండంలోని జాంబియా దేశంలో ఎంగేజ్‌మెంట్ చేసుకుంది ఈ భామ. ప్రస్తుతం అక్కడే తనకు కాబోయే భర్తతో హాలిడే టూర్‌ను ఎంజాయ్ చేస్తోంది. తాజాగా ఓ హాట్ ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది ఈ భామ. ఓపెన్‌గా ఉండే బాత్‌రూమ్‌లో స్నానం చేస్తున్న ఫొటోను తన ఫాలోవర్ల ముందుకు తీసుకువచ్చింది అమీజాక్సన్. వెదురు కర్రలతో రూపొందిన ఈ బాత్‌రూమ్‌లో షవర్ కింద ఈ హాట్ బ్యూటీ మైమరపిస్తోంది. ఆమె ఒంపుసొంపుల వయ్యారాలు నయాగారా జలపాతాన్ని తలపిస్తున్నాయి.

తడి అందాలతో మురిపిస్తోంది



లక్ష్మీ రాయ్

కళ్లు జిగేల్‌మనే గ్లామర్, ఏ కాస్ట్యూమ్‌కైనా ఇట్టే మ్యాచ్ అయిపోయే ఫిజిక్ లక్ష్మీ రాయ్ సొంతం. బాలీవుడ్‌లో తెరకెక్కిన 'జూలీ 2' సినిమాతో బికినీ బ్యూటీగా క్రేజ్ తెచ్చుకుంది ఈ భామ. ఈ సినిమాలో పలు రకాల బికినీ పోజులతో అదరగొట్టింది. ఈ చిత్రం కంటే ముందే మెగాస్టార్ చిరంజీవితో 'రత్తాలు...' ఐటమ్ సాంగ్‌లో చిందేయడంతో లక్ష్మీ రాయ్‌కు టాలీవుడ్‌లో పెరిగిన క్రేజ్ అంతా ఇంతా కాదు. ఈ చిత్రంతో రత్తాలు అనే ట్యాగ్‌లైన్‌ను తన పేరు ముందుకు తెచ్చేసుకుంది. ఇకపోతే సోషల్ మీడియాలో లక్ష్మీ రాయ్ సందడి చేస్తోంది. బికినీలో అందాలు ఆరబోస్తూ యూత్‌ను ఆకట్టుకుంటోంది. తాజాగా తన కొత్త ఫొటోను ఈ భామ పోస్టు చేసింది. బాత్ టబ్‌లో బ్లాక్ అండ్ బ్లాక్ టూ పీస్ డ్రెస్‌లో తడి అందాలతో మురిపిస్తోంది లక్ష్మీ రాయ్. ఈ ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

పోటీ

ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

చీకటి గది ఉదంతం ఎక్కడ జరిగింది?



చీకటి గది

ఆంగ్లేయులు -అధికార స్థాపన

- సాదుతుల్లా ఖాన్ తర్వాత పాలకుడు – దోస్త్‌అలీ.
- దోస్త్‌అలీ అల్లుడు – చందాసాహెబ్ (అసలు పేరు హుస్సేన్ దోస్త్‌అలీ).
- మహారాష్ట్రులతో జరిగిన యుద్ధంలో దోస్త్‌అలీ మరణించగా మహారాష్ట్రులచే బంధింపబడిన వాడు – చందాసాహెబ్.
- ఈ సమయంలో హైదరాబాద్ నిజాం, నిజాం – ఉల్– ముల్క్ కర్ణాటక పాలకుడిగా అన్వరుద్దీన్‌ను తన ప్రతినిధిగా నిలిపాడు.
- అన్వరుద్దీన్ కాలంలో మొదటి, రెండవ కర్ణాటక యుద్ధాలు జరిగాయి.

మొదటి కర్ణాటక యుద్ధం (1746–48)

- బ్రిటీష్, ఫ్రెంచ్ వారి మధ్య మొదటి ఆంగ్లో – కర్ణాటక యుద్ధం ప్రారంభానికి కారణం – ఆస్ట్రియా వారసత్వ యుద్ధం.
- బంగాళాకాతంలో గల ఫ్రెంచ్ నౌకలపై దాడిచేసిన బ్రిటీష్ జర్నల్ – బార్నెట్.
- భారతదేశంలో ఫ్రెంచ్ జర్నల్ అయిన డూప్లే మారిషష్‌లో ఉన్న లంబోర్డోనాయిస్‌తో మద్రాసు ఆక్రమించాడు. కాని లంబోర్డోనాయిస్ లంచం తీసుకుని మద్రాసును బ్రిటీష్ వారికి అప్పగించి తిరిగి మారిషస్‌కు వెళ్లిపోయాడు.
- డూప్లే అన్వరుద్దీన్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకొని మద్రాస్‌ను తిరిగి ఆక్రమించాడు. దీంతో మద్రాసును అన్వరుద్దీన్‌కు ఇవ్వాలి కాని డూప్లే మద్రాస్‌ను ఇవ్వడానికి నిరాకరించాడు.
- అన్వరుద్దీన్ పదివేల సైన్యంను మద్రాస్ వైపుకు పంపగా, డూప్లే 500 సైన్యంను ప్యారడైజ్ నేతృత్యంలో కర్ణాటక వైపు పంపాడు.
- 1748లో వీరిద్దరి మధ్య అడయార్ యుద్ధం జరుగగా అన్వరుద్దీన్ సైన్యం ఓడించబడింది.
- ఆధునిక భారతదేశ చరిత్రలో స్వదేశీ, విదేశీ సైన్యాలకు జరిగిన తొలి యుద్ధం.
- 1748లో ఫ్రాన్స్‌లోని పట్టణం అయిన ఎక్స్ – లా – చపెల్ ఒప్పందం ప్రకారం ఆస్ట్రియా వారసత్వ యుద్ధం అంతం కావడంతోనే భారత్‌లో మొదటి కర్ణాటక యుద్ధం కూడా అంతమైంది.

రెండవ ఆంగ్లో – కర్ణాటక యుద్ధం (1749–54)

- 1724లో హైదరాబాద్ రాజ్యాన్ని స్థాపించిన నిజాం – ఉల్ – ముల్క్ 1748లో మరణించడంతో అతని కుమారుడైన నాజర్‌జంగ్ హైదరాబాద్ నవాబ్ అయ్యాడు.
- నాజర్‌జంగ్‌ను తొలగించి ముజఫర్‌జంగ్ హైదరాబాద్ నవాబ్ కావాలనుకున్నాడు. (నిజాం–ఉల్–ముల్క్ మనవడు, బైరున్నీస కుమారుడు)
- డూప్లే చందాసాహెబ్, ముజఫర్‌జంగ్ మద్దతు పలికాడు.
- డూప్లే, చందాసాహెబ్, ముజఫర్‌జంగ్, కడప, కర్నూలు, నవాబులకు నాయకుడైన హిమ్మత్‌ఖాన్‌లు 1749లో అంబూర్ యుద్ధంలో అన్వరుద్దీన్‌ను వధించి చందాసాహెబ్‌ను కర్నాటకకు నవాబ్‌గా ప్రకటించాడు.
- అన్వరుద్దీన్ కుమారుడు మహ్మద్ అలీ తిరుచునాపల్లికి పారిపోయాడు.
- డూప్లే కూటమిచే 1750లో నాజర్‌జంగ్ వధింపబడి ముజఫర్‌జంగ్ హైదరాబాద్ నవాబుగా ప్రకటించబడ్డాడు.
- మచిలీపట్నం, యానాం, దివి ప్రాంతాలకు డూప్లేకు ఇచ్చాడు.
- 1751లో కడపలోని రాయచోటి దగ్గరగల లక్కిరెడ్డిపల్లి వద్ద ముజఫర్‌జంగ్ హిమ్మత్‌ఖాన్ హత్య చేశాడు.
- హైదరాబాద్ ఫ్రెంచ్ అధికారి బుస్సీ సలాపత్‌జంగ్‌ను హైదరాబాద్ నవాబుగా చేశాడు.
- సలాపత్‌జంగ్ 1752లో ఉత్తరసర్కార్‌లో (కొండపల్లి, ఏలూరు, రాజమండ్రి, శ్రీకాకుళం) ఫ్రెంచి వారికి ఇచ్చాడు.
- 1752 రాబర్ట్‌క్లైవ్ (తిరుచునాపల్లి సైనిక అధికారి) 500 సైన్యంతో ఆర్కాట్‌పై దాడి చేసి చందా సాహెబ్‌ను ఓడించి ఆక్రమించి ''ఆర్కాట్ వీరుడు'' అనే బిరుదు పొందాడు.
- మహ్మద్ అలీని కర్నాటక నవాబ్‌గా ప్రకటించి వల్లజా అనే బిరుదునివ్వడంలో మహ్మద్ అలీ వంశం వల్లజా వంశంగా ప్రసిద్ధికెక్కింది.
- ఫ్రెంచి వారి ఓటమితో డూప్లే స్థానంలో గదామో / గాడ్‌హ్యూను ఫ్రెంచి గవర్నర్‌గా భారతదేశానికి పంపింది.
- 1754 గదావో బ్రిటీష్ వారితో ''పాండిచ్చేరి'' ఒప్పందంను కుదుర్చుకోవడంతో 2వ కర్నాటక యుద్ధం అంతమైంది.

మూడవ కర్ణాటక యుద్ధం (1755–63)

- ఐరోపాలో 1756–63 మధ్యకాలంలో జరిగిన ''సప్తవర్ష సంగ్రామం'' కాలంలో భారతదేశంలో జరిగిన యుద్ధం.
- నాటి ఫ్రెంచ్ సేనాని – కౌంట్ – డి –లాలి కాగా బ్రిటిష్ సేనాధిపతి – సర్ బవర్‌కూట్.
- 1757లో కౌంట్ – డి – లాలి నాయకత్వంలో ఫ్రెంచ్ నౌకాదళం భారత్‌కు వచ్చి 1758లో ఆంగ్లేయుల వర్తక స్థావరం అయిన కడలూరును ఆక్రమించింది.
- కౌంట్ – డి – లాలి మద్రాస్ ఆక్రమణలో భాగంగా హైదరాబాద్‌లోని బుస్సిని రమ్మని ఆదేశించాడు.
- బుస్సీ హైదరాబాద్‌ని వీడగానే బ్రిటీష్‌లు ఉత్తరసర్కారును ఆక్రమించారు.
- 1760లో జరిగిన వందవాసి /వాండివాష్ యుద్ధంలో బ్రిటిష్‌సేనాని ఐరకూట్, ఫ్రెంచి జనరల్ కౌంట్–డి–లాలి మరియు బుస్సీలను ఓడించాడు.
- 1761లో జనవరి కౌంట్ – డి – లాలి పూర్తిగా లొంగిపోయాడు. దీంతో భారత్‌లో ఫ్రెంచి వారి ఆధిపత్యం పూర్తిగా అంతమైనది.
- 1763 ''పారిస్'' సంధితో ఐరోపాలో సప్తవర్ష సంగ్రామం అంతమైంది. దీంతో భారత్‌లో 3వ కర్నాటక యుద్ధం అంతైమంది.
- ఫ్రెంచి వారు పాండిచ్చేరికి మాత్రమే పరిమితమైయ్యారు. పాండిచ్చేరి అనగా – పాండిచ్చేరి, కరైకల్, యానాం, మహే అనే నాలుగు ప్రాంతాలు.
- కర్ణాటక నవాబ్ మహ్మద్ అలీ మద్రాస్‌లోని 'చెపాక్ భవంతి'లో విశ్రాంతి పొందుతూ పాలనా బాధ్యతలను బ్రిటిష్‌కు అప్పగించాడు.
- ఈ యుద్ధకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ముఖ్యమైన యుద్ధాలు
- తుమ్మలపాలెం యుద్ధం (1756), బొబ్బిలి యుద్ధం (1757 జనవరి 24), చందూర్తి యుద్ధం (1758 డిసెంబర్ 7), కొండూరు యుద్ధం (1759), వందవాసి యుద్ధం (1760)

బెంగాల్ ఆక్రమణ

- బెంగాల్ రాజ్యస్థాపకుడు – ముర్షీద్ కులీఖాన్
- ఇతని తర్వాత పాలకులు – ఘజాఉద్దీన్, సర్పరాజ్‌ఖాన్, అలీవర్ధీఖాన్‌లు.
- అలీవర్ధీఖాన్ మరణానంతరం అతనికి కుమారులు లేకపోవడంతో 3వ కుమార్తె కుమారుడు సిరాజ్ ఉద్దౌల్లా (అసలుపురు మీర్జమహ్మద్) రాజుగా అయ్యాడు.
- సిరాజ్ ఉద్దౌలా నాయకత్వంను వ్యతిరేకించిన (అతని పెద్దమ్మ ఢాకారాణి – గసిత్‌బేగం కాగా ఆమె కుమారుడు షౌకత్‌జంగ్ (పూర్ణియా యువ రాజు).
- సిరాజ్ బెంగాల్ నవాబ్ అయినపుడు దక్కన్‌లో ప్రారంభమైన యుద్ధం –3వ కర్ణాటక.
- బెంగాల్‌లో గల బ్రిటీష్‌వారు, ఫ్రెంచ్‌వారు తమ స్థావరాల చుట్టూ రక్షణ గోడలను నిర్మించడం ప్రారంభించడంతో ఆ నిర్మాణాలను ఆపివేయవలసిందిగా ఆజ్ఞాపించాడు.
- చంద్రనాగోర్‌లో ఉన్న ఫ్రెంచ్‌వారు నిర్మాణాలను నిలిపివేయగా బ్రిటీష్ వారు కొనసాగించారు.
- షౌకత్‌జంగ్, గసిత్‌బేగం ఈమె సలహాదారుడు రాజావల్లబ్‌లు బ్రిటీష్ వారితో సత్సంబంధాలను కొనసాగించారు.
- దీంతో సిరాజ్‌ఉద్దౌలా షౌకత్‌జంగ్‌పై దండెత్తి 1756లో కాశీం బజార్, కలకత్తాలపై దండెత్తాడు.
- 1756 జూన్ 20న 'పోర్టు విలియం' (3వ విలియం జ్ఞాపకార్థం కలకత్తాలో నిర్మించారు)లో గాలి వెలుతురు లేని చీకటి గదిలో 146మంది బ్రిటీష్ అధికారులను బంధించగా 123 మంది మరణించారు.
- దీనినే చీకటి గది ఉదంతం అని 'హల్‌వెల్' వర్ణించాడు.
- ఈ ఉదంతంను 'Giganti Hoax (A big Joke)'గా వర్ణించినది – జెహెచ్ లిటిల్.
- సిరాజ్‌ఉద్దౌలా కలకత్తాకు 'ఆలీనగర్' అని పేరు పెట్టి మాణిక్‌చంద్‌ను అధికారిగా నియమించాడు.
- చీకటి గది విషాదంతో కంగుతిన్న ఆంగ్లేయులు 1756 డిసెంబర్‌లో రాబర్ట్‌క్లైవ్ (రోడ్డుమార్గం) అడ్మిరల్ వాట్సన్‌లు (జలమార్గం) బెంగాల్‌కు చేరుకున్నారు.
- మాణిక్‌చంద్‌కు లంచం ఇచ్చి కలకత్తాను ఆక్రమించిన ఆంగ్లేయసేనాని – క్లైవ్.

ప్లాసీ యుద్ధం (1757) : (Battle of Plaseey)

- ప్లాసీ ప్రస్తుత పేరు – పలాసి.
- బ్రిటీష్ వారు సిరాజ్‌ఉద్దౌలాను ఎలాగైనా అంతం చేయాలనే ఉద్దేశంతో అమీన్‌చంద్ (వడ్డీవ్యాపారి) ద్వారా మధ్యవర్తిత్వం నడిపారు.
- మధ్యవర్తిత్వం నడిపినందుకుగాను, దోపిడీసొమ్ములో 5% అమీన్‌చంద్‌కు ఇవ్వడానికి క్లైవ్ అంగీకరించాడు. కానీ అమీన్‌చంద్ 30లక్షలు డిమాండ్ చేయడంతో రాబర్ట్‌క్లైవ్ అప్పటి గవర్నర్ డ్రేక్ సంతకం ఫోర్జరీ చేసి అమీన్‌చంద్‌ను ఒప్పించాడు.
- సిరాజ్‌ఉద్దౌలా సైన్యం పెద్దదయినప్పటికీ ఆంగ్లేయుల కుట్ర వల్ల 1757 జూన్ 23న బెంగాల్‌లోని నాడియా జిల్లాలోగల భగీరథీనది ఒడ్డున జరిగిన యుద్ధంలో సిరాజ్‌ఉద్దౌలా ఓడిపోయాడు.
- భారతదేశంలో ఆంగ్లరాజ్యస్థాపనకు పునాదివేసినయుద్ధం – ప్లాసీ యుద్ధం కాగా ఆంగ్ల సామ్రాజ్య విస్తరణకు కారణం – బక్సార్ యుద్ధం.
- ప్లాసీ యుద్ధంలో రాబర్ట్‌క్లైవ్‌కు మద్దతిచ్చినవారు (కుట్రదారులు)

ఎ) మీర్జాఫర్ – సిరాజ్‌ఉద్దౌలాసేనాని
బి) మీరాన్ – సిరాజ్ ఉద్దౌలా కుమారుడు
సి) అమీన్‌చంద్ – వర్తకుడు/మధ్యవర్తి
డి) మాణిక్‌చంద్ – కలకత్తా ఇన్‌ఛార్జీ
ఇ) జగత్‌సేఠ్ –బెంగాల్ సంపన్నుడు
ఎఫ్) రాయ్‌దుర్లబ్, ఖాదీమ్‌ఖాన్ – సిరాజ్ సైనిక అధికారులు

- మీర్‌మదన్, మోహన్‌లాల్‌లు సిరాజ్ తరుపున పోరాడి వీరమరణం పొందాడు.
- ఈ యుద్ధంలో ఆంగ్లేయులు 9మంది మరణించగా, సిరాజ్‌ఉద్దౌలా సైన్యం 500మంది మరణించారు.
- సిరాజ్ ఉద్దౌలా తన భార్య లుఫ్తఉన్నీసాతో కలిసి ముర్షిదాబాద్‌కు పారిపోతుండగా మీరాన్ పట్టుకొని ఉరితీశాడు.
- 1757లో మీర్జాఫర్ ప్లాసీ యుద్ధభూమినుండే బెంగాల్ నవాబ్‌గా ప్రకటించబడ్డాడు.
- మీర్జాఫర్ ఆంగ్లేయులకు కృతజ్ఞతగా బెంగాల్‌లోని 24 పరగణాలపై జమీందారీ హక్కులు, క్లైవ్‌కు కల్పించాడు.

రోడ్లకు ఆస్ఫాట్ వినియోగం తగ్గించే ప్రక్రియ



ఐటి హైదరాబాద్ ప్రొఫెసర్లు ఇద్దరు వారి గ్రాడ్యుయేట్ విద్యార్థులు తక్కువ ఖర్చుతో పర్యావరణ హితమైన రోడ్లు నిర్మించే ప్రక్రియను కనుగొన్నారు. ఆస్ఫాల్టు రోడ్లు కన్నా ఈ రోడ్లు బలంగా ఉంటాయి కూడా. కనుగొన్న కొత్త మెటీరియల్‌ను రిక్లయిమ్ డ్ ఆస్ఫాల్టు పేవ్‌మెంట్ (ఆర్‌ఎపి) అని వ్యవహరిస్తున్నారు. ఈ ఆర్‌ఎపితో ఫైయాష్‌ను కలిపి రోడ్ల నిర్మాణానికి వినియోగిస్తే రోడ్లు చాలా దృఢంగా ఉంటాయి. ఈ కొత్త కాంక్రీట్ వల్ల అసలు ఆస్ఫాల్టు వినియోగం **30** శాతం వరకు తగ్గుతుంది. ఈ కాంక్రీట్ మెటీరియల్‌ను జాతీయ రహదారి నిర్మాణాల్లో ఉపయోగించి చూశారు. ఆంధ్రప్రదేశ్‌లో స్టేట్‌హైవే తో నూజివీడు, మైలవరం అనుసంధానమయ్యే రోడ్ల నిర్మాణంలో ప్రయోగాత్మకంగా వినియోగించారు. ఈ రోడ్డుపై ట్రాఫిక్ చాలా ఎక్కువగా ఉంటుంది. రోజుకు 1213 వాణిజ్య వాహనాలు తిరిగేలా ఈ రోడ్డును డిజైన్ చేశారు. రిక్లెమ్‌డ్ ఆస్ఫాల్ట్ కాంక్రీట్ రోడ్లు వేయడానికి తగినంత బలం కలిగినదేం కాదు. అనేక ఇతర మిశ్రమాలు కలిపితేనే బలం ఉంటుంది. సున్నపురాయి, ఫ్లై యాష్ వంటి పారిశ్రామిక వ్యర్థాలు కలిస్తే బలం మరింత పెరుగుతుంది. తక్కువ కాల్షియం ఉన్న ఫ్లైయాష్‌ను భారత దేశం ఉత్పత్తి చేస్తోంది. అయతే సిమెంటీకరణ కోసం మరికొన్ని పదార్థాలను కలపవలసి వస్తుందని పరిశోధకులు తెలిపారు. ఈ ప్రక్రియలో పరిశోధకులు ఫైయాష్‌ను సోడియం హైడ్రాక్సయిడ్‌తో కలిపి ట్రీట్ చేశారు. ఆ తరువాత ఆర్‌ఎపి మెటీరియల్‌కు దీన్ని కలిపారు. ఫలితంగా ఇది జియోపోలిమర్‌గా రూపొందింది. దీనివల్ల ఆర్‌ఎపి మెటీరియల్ చాలా బలంగా తయారైంది. సాధారణంగా ఫైయాష్‌కు బదులు సిమెంట్ వాడితే గట్టిగా బలంగా ఉంటుంది. కానీ ఎక్కువ ఖర్చు అవుతుంది.

– సైన్స్ విభాగం

పంట అధిక దిగుబడుల సాధనకు జన్యు మార్పు ప్రక్రియ

పంట దిగుబడి పెంచడానికి జన్యుపరంగా మార్పు సాధ్యమా కాదా అన్నదానిపై అమెరికా లోని యూనివర్శిటీ ఆఫ్ ఇల్లినాయిస్ పరిశోధకులు గత కొన్నేళ్లుగా పరిశోధనలు కావిస్తున్నారు. ఈమేరకు పొగాకు పంటమొక్కల జన్యుపరంగా షార్టుకట్ మార్పు చేయడంలో 40 శాతం సాధించినట్టు వారు నిర్ధారించారు. ఈ పరిశోధనల ఫలితాలు సైన్స్ మేగజైన్‌లో ప్రచురించారు. ఎక్కువగా పొగాకు ఉత్పత్తి చేయకూడదన్నదే లక్ష్యం. కానీ ఈ టెక్నిక్‌ను గోధుమ, లేదా సొయాబీన్స్ లో ఉపయోగించి మానవ జాతి ఆహార కొరతను లేదా డిమాండ్‌ను తీర్చడానికి సంకల్పించారు. ఈ పని అంతర్జాతీయ ప్రాజెక్టు లో ఒక భాగం. బిల్ మెళిందా గేట్స్ ఫౌండేషన్ తోపాటు బ్రిటిష్ ప్రభుత్వం దీనికి ఆర్థికంగా సహకరిస్తోంది. పంటల్లో అధిక దిగుబడులు సాధించడానికి రైతులు ఎరువులు, క్రిమిసంహారక మందులు, వినియోగించడంతోపాటు ఇతర పద్ధతులు వినియోగిస్తుంటారు. అయితే ఈ టెక్నిక్ ఉపయోగించడం వల్ల ఎక్కువ దిగుబడులు సాధించ గలిగే అవకాశం ఉండడం విశేషం. అయితే జినోమిక్ బయోలజీకి చెందిన శాస్త్రవేత్తలు కిరణజన్య సంయోగ క్రియను మరింత సమర్థమైనదిగా చేయడానికి మార్గాన్ని కనుగొన్నట్టు తెలిపారు. కిరణజన్య సంయోగ క్రియలో మొక్కలు సూర్యకాంతిని వినియోగించి కార్బన్ డయాక్సైడ్‌ను, నీటిని శక్తిగా మారుస్తాయి. వాతావరణం లోని కార్బన్‌డైయాక్సైడ్‌ను సేంద్రియ సమ్మేళనంగా మార్చడంలో ఎంజైమ్ రుబిస్కో కీలక పాత్ర వహిస్తుంది. ఈ ప్రక్రియను కార్బన్ స్థిరీకరణ అని అంటారు. అదే ఎంజైమ్ వాతావరణ ఆక్సిజన్ స్థిరీకరణలో కూడా పాత్ర వహిస్తుంది. ఆక్సిజన్ విషపూరిత పదార్థంగా తయారు కాడానికి దోహదం చేస్తుంది. ఈ విషపూరిత పదార్థాలను తొలగించుకోడానికి ముక్క చాలా తగినంత శక్తిని వినియోగించ వలసి వస్తుంది. అదే లేకుంటే మొక్క పెరుగుదలకు ఆ శక్తి ఎంతో వినియోగమయ్యేది. ఈ ప్రక్రియను ఫోటో రెస్పిరేషన్ అని పిలుస్తారు. ఇల్లినాయిస్ పరిశోధక బృందం పొగాకు కణాల్లో ఆల్గే డిఎన్ఎ పోగులను ప్రవేశ పెట్టి బయోలాజికల్ షార్టుకట్ పద్ధతిని ఉపయోగించి ఫోటో రెస్పిరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రయత్నించారు. ఎప్పుడైతే మొక్క తక్కువ శక్తిని ఫోటోరెస్పిరేషన్‌కు వినియోగిస్తుందో మొక్క పెరుగుదలకు బాగా మిగతా శక్తి వినియోగమవుతుంది. అంతేకాదు పంట ఉత్పత్తి కూడా పెరుగుతుంది. ఈ అధ్యయనం మంచి గుర్తింపు పొందింది. ప్రయోగశాలలో అధ్యయనం చేయకుండా ఆరుబయలు ప్రదేశంలో మొక్కల తోనే ప్రయోగాలు చేయడం ఫలితాలు రావడం శాస్త్రవేత్తల చర్చకు అవకాశం కల్పించింది. ఫోటో రెస్పిరేషన్‌ను పరిమితం చేయడానికి మిగతా టెక్నిక్‌లు అనుసరించగా అవి మొక్కల ఇతర విధులలో వ్యతిరేక ఫలితాలను అందించాయి. అయితే ఇప్పుడు కొత్తగా కనుగొన్న ప్రక్రియ పారిశ్రామికంగా భారీ ఎత్తున వినియోగించడానికి ఇంకా అందుబాటులో లేదనే చెప్పాలి. ఈ పరిశోధక బృందం సొయాబీన్స్, బఠానీలు, బంగాళాదుంపల్లో కూడా ఫలితాలు సాధించాలన్న పట్టుదలతో ఉంది.



– సైన్స్ విభాగం

వృద్ధాప్య లక్షణాలను తగ్గించే బొడ్డు తాడు రక్తం

మనిషి బొడ్డు తాడు రక్తం లోని ప్రొటీన్‌ను వయస్సు మళ్లిన ఎలుకలో చొప్పించి జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యం లోపాలను శాస్త్రవేత్తలు తారుమారు చేయగలిగారు. ఈ ప్రయోగ ఫలితాలు వృద్ధాప్యంలో క్షీణించే జ్ఞాపక శక్తిని, గ్రహణ శక్తిని తిరిగి ఈ చికిత్స ద్వారా పెంపొందించ గలమన్న ఆశలను రేకెత్తించాయి. అయితే పరిశోధకులు అనేక అధ్యయనాలు, మనుషులపై ప్రయోగాలు చాలా అవసరమవుతాయని అప్పుడే వైద్య పరంగా ఈ చికిత్సను వినియోగించడానికి వీలవుతుందని చెబుతున్నారు. బలహీనమైన ఎలుకలపై పరీక్షలు చేయగా ఈ ప్రొటీన్ థెరపీ మెదడు లోని హిప్పోక్యాంపస్ అనే భాగాన్ని తిరిగి పునరుద్ధరించ గలిగింది. ఈ హిప్పోక్యాంపస్ జ్ఞాపక శక్తి రూపొందదానికి కీలకమైన భాగం. వృద్ధాప్యంలో ఈ భాగం క్షీణించడం జరుగుతుంది. ఈ చికిత్సను పొందే వృద్ధ ఎలుక వరుస ప్రవర్తన పరీక్షలతో యువ ఎలుకలా ప్రవర్తించడం జరిగిందని కాలిఫోర్నియా లోని స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీకి చెందిన పరిశోధకులు చెప్పారు. ఇదివరకటి కన్నా వేగంగా చిక్కుల నుంచి ఎలుక తప్పించుకోగలిగింది. జ్ఞాపకాలు చక్కగా పదిలమయ్యాయి. గూళ్లు తిరిగి కట్టుకోవడం ప్రారంభించింది. సాధారణంగా ఈ నైపుణ్యం జంతువుల్లో వృద్ధాప్యంలో ఉండదు. టోనీ వొస్సీ కొరే ఆధ్వర్యం లోని పరిశోధకులు మానవ బొడ్డు తాడు రక్తం సాధారణంగా ప్రొటీన్ టిఐఎంపి2 అత్యధిక స్థాయిల్లో ఉంటుందని గుర్తించారు. ఈ ప్రొటీన్ వృద్ధుల రక్తంలో చాలా తక్కువగా ఉంటుంది. ఈ ప్రొటీన్‌ను ఎలుకలో ఇంజెక్టు చేయగా ఒక గ్రూపు జన్యువులను చైతన్యం చేస్తుంది. ఆ చైతన్యం హిప్పోకాంపస్‌ను ఉత్తేజ పరుస్తుంది. కొత్తగా సమాచారాన్ని గ్రహించే శక్తి ఏర్పడుతుంది. యువరక్తం లోని మోలిక్యూల్స్ వృద్ధుల మెదడులను కండరాలను చైతన్యం వంతం చేసి తిరిగి కొత్తదనాన్ని కలిగిస్తాయని ఇటీవలి అధ్యయనాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఈ బొడ్డుతాడు ప్రొటీన్ థెరపీ ప్రాధాన్యత గుర్తింపు పొందుతోంది. ఈ థెరపీలు సమర్థంగా ప్రభావం చూపిస్తే జ్ఞాపక శక్తి కోల్పోయి వృద్ధాప్యంలో అల్జీమర్స్‌తో బాధపడే రోగులకు ఎంతో మేలు జరుగుతుంది. అల్జీమర్స్ ఉన్న ఎలుకపై జరిపిన ప్రయోగాల ఫలితం అన్ని జంతువులకు వర్తిస్తుంది. అయితే మనుషులపై ఇంతవరకు దీని గురించి ఎలాంటి ప్రయోగాలు జరగడం లేదు. ఈ ప్రొటీన్ థెరపీ మెదడు వృద్ధాప్యాన్ని మార్చ లేకపోవచ్చు లేదా అల్జీమర్స్ వ్యాధిని ఆపలేక పోవచ్చు కానీ ఆరోగ్యకరమైన మెదడు ఎలా ఉండాలో అదే విధంగా ప్రోత్సహించే అవకాశం ఉంది. వృద్ధాప్యానికి దారి తీసే లక్షణాలను చాలావరకు నివారించే వీలుంది. ఫలితాలు ఆసక్తికరంగా ఉంటే ఇది మనుషులకు అనువర్తింప చేసే థెరపీగా వీలైనంత త్వరలో అమలు చేయడానికి సాధ్యమౌతుందని పరిశోధకులు వివరించారు.



– సైన్స్ విభాగం

బయటపడిన ట్రీ ఫ్రాగ్ (చెట్టు కప్ప) తెగలు



వాషింగ్టన్ : శాస్త్రవేత్తలు ట్రీఫ్రాగ్ (చెట్టు కప్ప) తెగలను కనుగొన్నారు. ఇప్పుడు వెలుగు లోకి వచ్చిన ఈ తెగల కప్పల బొటన వేళ్లకు తెడ్డుల వంటి ఆకారం కలిగిన చర్మం అతికించి ఉంది. యాండెస్‌లోని టేని టాప్ పర్వతం వద్ద ఇవి జీవించి ఉన్నాయి. తూర్పు యాండెస్‌లో పర్వతారోహణ చేసినప్పుడు ఈ కప్పలు బయటపడ్డాయి. ఈ కప్ప ఇదివరకు ఏ తెగకు చెందనిదిగా గుర్తింపు పొందినా ఇప్పుడు దానికి హైలోసిర్టస్ హిల్లిసి తెగగా గుర్తించినట్టు శాస్త్రవేత్తలు చెప్పారు. 1980లో ఇదే జన్యు తెగకు చెందిన మూడు కప్పల తెగలను డాక్టర్ డేవిడ్ హిల్లిస్ కనుగొన్నారు.

– సైన్స్ విభాగం

ఎన్నికల పొత్తుకు ఎస్‌పి, బిఎస్‌పి రెడీ



లక్నో: రాబోయే లోక్‌సభ ఎన్నికలకోసం సమాజ్ వాదీ పార్టీ (ఎస్‌పి), బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) పొత్తు కుదుర్చుకునేందుకు అంగీకరించాయని ఎస్‌పి నాయకుడొకరు శనివారం తెలిపారు. ఉత్తరప్రదేశ్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ రెండు పార్టీల 'గతబంధన్'పై ఈ నెలలో లాంఛనంగా ప్రకటన వెలువడవచ్చని ఎస్‌పి జాతీయ ప్రతినిధి రాజేంద్ర చౌదరి చెప్పారు. ఈ పరిణామంపై భారతీయ జనతాపార్టీ 'అవకాశవాదం', ప్రజావ్యతిరేకం అని వ్యాఖ్యానించింది. ఎన్నో పర్యాయాలు చర్చలు జరిపిన తర్వాత సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, బిఎస్‌పి అధినేత్రి మాయావతి కూటమిగా ఏర్పడేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారు. శుక్రవారం కూడా ఇద్దరు నాయకులూ మరోసారి చర్చించారు. కొన్ని చిన్న పార్టీలను కూడగట్టుకునేందుకు కూడా సంప్రదింపులు జరుగుతున్నాయి. ఉత్తరప్రదేశ్ పశ్చిమ ప్రాంతంలో పట్టున్న రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డి) కూడా జతకట్టవచ్చు అని ఆ ప్రతినిధి చెప్పారు. 'కాంగ్రెస్ కూడా కూటమిలో చేరే అవకాశముందా?' అని అడగ్గా ...'అఖిలేష్ యాదవ్, మాయావతి నిర్ణయిస్తారు' అని సమాధానమిచ్చారు. అమేథీలోనూ, రాయ్‌బరేలీలోనూ కూటమి అభ్యర్థుల్ని నిలబెట్టదని, ఆ రెండు లోక్‌సభ నియోజక వర్గాల్నీ కాంగ్రెస్ పార్టీకే వదిలేస్తామని చెప్పారు.

లోయలో పడ్డ స్కూల్ బస్సు

ఆరుగురు చిన్నారులు, డ్రైవర్ దుర్మరణం

సిమ్లా : స్కూల్ బస్సు ప్రమాదవశాత్తూ లోయలో పడి ఆరుగురు చిన్నారులు, ఒక డ్రైవర్ దుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటన హిమాచల్‌ప్రదేశ్‌లోని సర్‌మౌర్ జిల్లాలో శనివారం ఉదయం సంభవించింది. ఈ ఘటనలో సంగ్రా టౌన్‌కు చెందిన 12మంది స్కూల్ పిల్లలకు గాయాలయ్యాయి. ఈ మేరకు జిల్లా ఎస్‌పి రోహిత్ మల్పాని ధ్రువీకరించారు. ఘటన స్థలంలోనే సమీర్ (5), ఆదర్శ్ (7), కార్తీక్ (14), డ్రైవర్ రామ్ స్వరూప్ (40)లు మృతిచెందారని వివరించారు. అభిషేక్, అతని సోదరి సంజనా, నైతిక్ చౌహాన్‌లకు గాయాలు కాగా నహన్ మెడికల్ కాలేజీ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారని ఎస్‌పి తెలిపారు. గాయాలైన 12 మందిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఈ ప్రమాద ఘటనపై విచారణ చేపట్టి 15 రోజుల్లోగా వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని జిల్లా డిప్యూటీ కమిషనర్ లలిత్ జైన్‌ను సంగ్రా సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ రాజేశ్ దిమాన్ కోరారు.

కత్తి దాడి కేసు: విశాఖ వచ్చిన ఎన్ఐఏ

అమరావతి: గత ఏడాది అక్టోబర్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై కత్తితో జరిపిన దాడి గురించి దర్యాప్తు చేసేందుకు జాతీయ దర్యాప్తు ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు శనివారం విశాఖపట్నం చేరుకున్నారు. ఎన్ఐఏ అధికారుల రాకతో ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్‌ల మధ్య తాజాగా మాటల యుద్ధం రగిలింది. కోర్టు ఉత్తర్వు కానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి లిఖితపూర్వకమైన ఆదేశం కానీ లేకుండా ఈ కేసు దర్యాప్తు బాధ్యతను ఎన్ఐఏ కి అప్పగించేందుకు విశాఖ పట్నం పోలీసులు తిరస్కరించారని పోలీస్ శాఖలో ఉన్నత వర్గాలు చెప్పాయి. హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఎన్ఐఏ ఈ కేసుపై జనవరి 1న ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. శనివారం విశాఖ వచ్చిన ఎన్ఐఏ ఇన్‌స్పెక్టర్ ఒకరు ఈ కేసు వివరాలు తెలుసుకునేందుకు విశాఖపట్నం నగర పోలీసుశాఖలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) కలుసుకున్నారు. దర్యాప్తుకు సహకరించవలసిందిగా కోరారు. కానీ సిట్ అందుకు నిరాకరించినట్టు తెలిసింది. ఇలా ఉండగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ..రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తు చేస్తుంటే ఎన్ఐఏను పంపించి కేంద్రం పెత్తనం చేయాలనుకుంటోందని విమర్శించారు. కాగా, వైఎస్సార్‌సి ఎంఎల్‌ఏ రోజా బాబు వ్యాఖ్యల్ని తప్పుపట్టారు. ఈ కేసును ఎన్ఐఏకు అప్పగించేందుకు ఎందుకు వెనకాడుతున్నారో బాబు చెప్పాలని రోజా డిమాండ్ చేశారు.

ప్రధానిపై రాఫెల్ ప్రశ్నలు సంధించండి

దేశ ప్రజలకు రాహుల్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ : ప్రధాని మోడీపై తన రాఫెల్ ప్రశ్నలను తీవ్రస్థాయిలో సంధించాలని దేశ ప్రజలకు కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. రాఫెల్ డీల్‌పై తాను అడిగిన ప్రశ్నలకు ప్రధాని జవాబు చెప్పడం లేదని ఆయన విమర్శించారు. రాఫెల్‌పై తాను పార్లమెంట్‌లో కీలక ప్రశ్నలు వేసిన విషయాన్ని రాహుల్ శనివారం ప్రస్తావించారు. ప్రధాని కానీ , ఆయన మంత్రి వర్గ సహచరులు కానీ ఎక్కడికి వచ్చినా ఈ ప్రశ్నలు అడగాలని ఆయన సూచించారు. ఈ మేరకు తాను ప్రతి ఒక్క భారతీయుడిని కోరుతున్నానని చెప్పారు. ఫ్రాన్స్‌తో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న రాఫెల్ డీల్‌లో భారీ అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో దాడికి దిగుతోంది. ఇప్పుడు ఈ రాఫెల్ సమరాన్ని రాహుల్ మరింత తీవ్రతరం చేశారు. ఆర్‌ఎం అంటే రక్షణ మంత్రి రెండు గంటల పాటు మాట్లాడారు. అయితే కనీసం రెండు నిమిషాల పాటు కూడా తన ప్రశ్నలకు జవాబులు చెప్పలేదని రాహుల్ గుర్తు చేశారు. పార్లమెంట్‌లో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు తాను రెండు ప్రశ్నలు వేస్తున్నట్లు తెలిపే వీడియోను కూడా రాహుల్ తమ ట్విట్టర్‌లో పొందుపర్చారు. ఇవి క్లిష్టమైనవి కావని, తేలికపాటివని తేల్చిచెప్పారు. అనిల్ అంబానీకి ఉన్నట్లుండి రాఫెల్ కాంట్రాక్టు ఎవరు కట్టబెట్టారు? డీల్ సాఫల్యానికి ప్రధాని బైపాస్ సర్జరీ తరహాలో అత్యవసర చర్యలు తీసుకున్నప్పుడు రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారా? లేదా? అనే రెండు ప్రశ్నలను రక్షణ మంత్రికి వేశానని తెలిపారు. వీటికి అవును లేదా కాదు అని తెలిపితే చాలునని చెప్పానని గుర్తు చేశారు. తన తాజా ట్వీట్‌కు ఇప్పుడు రాహుల్ గాంధీ 2 సవాల్ దో జవాబు అనే శీర్షిక పెట్టారు.

ఓటర్ల జాబితాలో తప్పులకు ఇసిదే బాధ్యత: హైకోర్టు

హైదరాబాద్: తప్పుల తడకగా ఓటర్ల జాబితాలకు రాష్ట్ర ఎన్నికల సంఘానిదే బాధ్యత అని హైకోర్టు పేర్కొంది. పంచాయతీ ఎన్నికలను నిర్వహించేస్తే చిత్తశుద్ధి చాటుకున్నట్లు కాదని, ఆ ఎన్నికల్లో అర్హులందరూ ఓటర్ల జాబితాలో ఉన్నప్పుడే ఎన్నికల సంఘం పూర్తి స్థాయిలో సమర్థంగా పనిచేసినట్లు అవుతుందని ప్రకటించింది. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పన చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ఎన్నికల సంఘంపై ఉందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ చెప్పారు. నల్లగొండ జిల్లా గుర్రంపాడు గ్రామంలోని చామలోనిబావికి చెందిన 1319 నెంబరు గల ఇంటిలోని వారిని వేరు వేరు వార్డుల్లో ఓటర్లుగా పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా ఉండటంపై దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు శుక్రవారం విచారించింది. ఆ ఇంట్లోని మంతిపల్లి దుర్గయ్య, ఆయన భార్యకుమార్తెలు యాదవమ్మ, మమతలు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. ఈ విధంగా ఓటర్ల జాబితా రూపొందిందంటే ఎన్నికల సంఘం వైఫల్యం చెందడమే అవుతుందని ఘాటుగా వ్యాఖ్యానించింది. మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు కాబట్టి ఆ గ్రామ ఓటర్ల జాబితాను సరిచేసి రెండు లేదా మూడో దశలోనైనా ఎన్నికలు నిర్వహించాలని, ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను మార్పు చేయాలని హైకోర్టు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటికీ ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసి అర్హులందరికీ జాబితాలో చోటు ఉండేలా చేసే అధికారాన్ని ఎన్నికల సంఘం సద్వినియోగం చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ విధంగా చేయడంలో ఎన్నికల సంఘం విఫలమైందని వ్యాఖ్యానించింది. అర్హులైన వారందరికీ ఓట్లు ఉన్నప్పుడే ఓటర్ల జాబితాకు అర్థం ఉంటుందని హైకోర్టు పేర్కొంది. అందరికీ ఓట్లు లేకుండా జాబితాను వెలువరిస్తే దానికి అర్థం లేదని వ్యాఖ్యానించింది. సరైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయకుండానే ఎన్నికల నోటిఫికేషన్ వెలువరిస్తే దానికి అర్థం ఉండదని అభిప్రాయపడింది.

కన్నూర్‌లో ఆగని హింసాకాండ

నాయకుల ఇళ్లు, దుకాణాలపై బాంబు దాడులు
ఆర్‌ఎస్‌ఎస్ ఆఫీస్‌కు నిప్పు
'శబరిమల'పై కేరళలో తీవ్ర ఉద్రిక్తత
సంఘటనల దర్యాప్తునకు బిజెపి డిమాండ్
పరస్పర విమర్శల్లో పార్టీల నాయకులు
సాధారణ జీవనానికి అంతరాయం



కన్నూర్/ తిరువనంతపురం: శబరిమల వివాదంపై కేరళలో హింస కొనసాగుతోంది. రాజకీయంగా ఉద్రిక్త ప్రాంతంగా పేరున్న కన్నూరు జిల్లాలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, సిపిఎం కార్యకర్తల ప్రమేయంతో హింసాకాండ చెలరేగింది. ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తల ఇళ్లు, దుకాణాలపై దాడులు జరిగాయి. ఆందోళనకారులు అనేకచోట్ల బాంబులు విసిరారు. మదపీడికాయిల్‌లో సిపిఎం ఎంఎల్‌ఏ ఎ.ఎన్. షంసీర్, వడియిల్ పీడికియలో బిజెపి నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వి. మురళీధరన్, తలస్సెరీలో సిపిఎం కన్నూరు జిల్లా మాజీ కార్యదర్శి పి. శశి ఇళ్లపైన శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బాంబు దాడులు జరిగాయి. అయితే ఈ దాడుల్లో ఎవరూ గాయపడలేదని పోలీసులు తెలిపారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, సిపిఎం నాయకులు ఇక్కడ ఒక సమావేశానికి హాజరైన సమయంలో షంసీర్, శశి ఇళ్లపై బాంబులు విసిరిన కొన్ని గంటల తర్వాత బిజెపి ఎంపికి చెందిన పురాతన గృహంపై దాడి జరిగింది. దాడి జరిగినప్పుడు నా సోదరి, బావమరిది, వారి కుమార్తె ఇంట్లోనే ఉన్నారని, కానీ అదృష్టవశాత్తు ఎవరూ గాయపడలేదని మురళీధరన్ తెలిపారు. ఇద్దరు మహిళల ఆలయప్రవేశం వెనక పోలీసుల కుట్ర ఉందని, ఆ సంఘటనపై ఎస్ఐఎతో దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

సాధారణ జీవనానికి అంతరాయం

దాడుల కారణంగా సాధారణ జీవనానికి అంతరాయం కలిగింది. సున్నిత పరిస్థితులున్న ఈ జిల్లాలో ఒక సంవత్సరం విరామం తర్వాత రాజకీయ హింస చోటు చేసుకుంది. ఈనెల రెండో తేదీన ...రుతుక్రమ వయసులో ఉన్న ఇద్దరు మహిళలు అయ్యప్ప ఆలయంలో ప్రవేశించి ప్రార్థనలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కు చెందిన మితవాద సంస్థలు జరిపిన హింసాత్మక నిరసనలవల్ల కేరళ అట్టుడికిపోతోంది. కన్నూరులోనే కాక, కోజికోడ్ పక్కనే ఉన్న పెరంబర, మలప్పురం, అయ్యప్ప ఆలయం ఉన్న పతనంతిట్టలోని ఆరూరులలో కూడా శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున వరస దాడులు, విధ్వసంకాండ జరిగాయి.

రాష్ట్రం అప్రమత్తం

కన్నూరులో, ఇతర ప్రాంతాల్లో చెలరేగిన హింసాకాండతో సాధారణ జీవనం దెబ్బతినడంతో కేరళ పోలీస్ చీఫ్ లోక్‌నాథ్ బెహరా రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తం చేశారు. పార్టీల నాయకుల ఇళ్లపై దాడులకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసుల్ని ఆదేశించారు. గత రెండు రోజులుగా కన్నూరులో జరుగుతున్న హింసాకాండకు సంబంధించి ఇంతవరకూ 250 మందిని అరెస్ట్ చేశారు. జిల్లాలో గస్తీని, సోదాలను ముమ్మరం చేసినట్టు ఒక అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు శనివారం తలస్సెరీలో రూట్ మార్చ్ నిర్వహించారు. 33 మందిని అరెస్ట్ చేశారు. 19 మందిని ముందు జాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంతవరకూ 1700 మందిని అరెస్ట్ చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆఫీస్‌కు నిప్పు

పరియారం ప్రాంతంలో శనివారం ఉదయం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయానికి నిప్పు పెట్టారు. తలస్సెరీలో పాతిక మంది సిపిఎం కార్యకర్తలు ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు కె చంద్రశేఖరన్ పై దాడి జరిగింది. ఆయన ఇంటిని దోచుకున్నారు. ఇరిట్టిలోని పెరుంబరలో సిపిఎం కార్యకర్తపై దాడి జరిగింది.

పరస్పర ఆరోపణలు

ఒకవైపు ఉద్రిక్త పరిస్థితులు ఆందోళన కలిగిస్తుంటే మరోవైపు ...హింసకు కారణం మీరంటే మీరని సిపిఎం, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. శాంతి చర్చలను భగ్నం చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్ అల్లర్లకు పాల్పడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ విలేకరులకు చెప్పారు. తమ నిర్వహణలో ఉన్న ఆలయాలు, విద్యాసంస్థలను ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఆయుధశాలలుగా మార్చాయని ఆయన ఆరోపించారు. సంఘ్ పరివార్ హింసను విడనాడాలని సిపిఎం కన్నూరు జిల్లా కార్యదర్శి పి జయరాజన్ పిలుపునిచ్చారు. ఈ ఆరోపణల్ని ఖండిస్తూ బిజెపి నాయకుడు వి. మురళీధరన్ ...శబరిమలలో సంప్రదాయాల ఉల్లంఘనపై జరుగుతున్న నిరసనలు, ఆందోళనల నుంచి దృష్టి మరల్చేందుకు అధికార పార్టీ సిపిఎం ప్రయత్నిస్తోందని విమర్శించారు

ఆయన తంత్రి కాదు.. రాక్షస బ్రాహ్మణుడు: కేరళ మంత్రి

రుతుస్రావ వయసులో ఉన్న ఇద్దరు మహిళలు ఆలయంలోకి ప్రవేశించినందుకు 'సంప్రోక్షణ' కార్యక్రమాన్ని నిర్వహించినందుకు శబరిమల ఆలయ ప్రధాన పూజారి(తంత్రి)ని "రాక్షస బ్రాహ్మణుడు" అంటూ కేరళ మంత్రి ఒకరు నిందించారు. గత బుధవారం కేరళకు చెందిన కనకదుర్గ(44), బిందు(42) అనే ఇద్దరు మహిళలు శతాబ్దాల నాటి ఆలయ సంప్రదాయానికి విరుద్ధంగా శబరిమల ఆలయ దర్శనం చేశారు.
ఇందుకు ప్రతిగా ఆలయ తంత్రి కందారు రాజీవరు గర్భాలయాన్ని మూసివేసి ఆలయంలో 'సంప్రోక్షణ' నిర్వహించారు. దీనిపై కేరళ పిడబ్ల్యూడి మంత్రి, సీనియర్ సిపిఎం నాయకుడు జి సుధాకరన్ శనివారం నాడిక్కడ స్పందిస్తూ ఒక సోదరిని 'అపవిత్రం'గా పరిగణించిన వ్యక్తిని మనిషిగా భావించగలమా అని ప్రశ్నించారు.

లైంగిక హింస బాధితులకు బాసటగా నిలవాలి

మీడియా ఆకాడమీ చైర్మన్ అల్లం నారాయణ



మన తెలంగాణ/హైదరాబాద్: లైంగిక హింసకు గురైన బాధితులు తమను తాము నిలబెట్టుకునేందుకు దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నారని వారికి మానవత్వమున్న ప్రతి ఒక్కరూ బాసటగా నిలవాలని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ శనివారం మహిళలు, చిన్నారులపై లైంగిక హింసకు వ్యతిరేకంగా నిర్వహించిన డిగ్నిటీ మార్చ్ కార్యక్రమానికి అల్లం నారాయణ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మృగాల దాడికి గురైన బాధితులు న్యాయం కోసం పోరాడుతున్న క్రమంలో వారు పోలీసులు, కోర్టుల చుట్టూ తిరుగుతూ మరింత వ్యధకు గురవుతున్నారు. బాధితులు అటు ఆసుపత్రులలో రిపోర్టుల కోసం, ఆపై న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ మనో వేదనకు గురవుతున్నారన్నారు. గతంలో ఓ డిఐజి స్థాయి అధికారి బాధితుల పక్షాన బాసటగా నిలువకుండా నిందితుల గొడుగుపట్టిన ఘటనను గుర్తు చేసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాల్సిన వారు రాబంధువులుగా వ్యవహరించన తీరు తాను మరిచపోలేనని వివరించారు. లైంగిక దాడిలో బాధితులుగా మిగిలిన మహిళలు, చిన్నారులను పదేపదే చూపిస్తూ టివి చానల్స్ తమ రేటింగ్‌ను పెంచుకోవడం విచారకరమన్నారు. బాధితుల ఫోటోలను చూపించరాదని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసినా టివి చానళ్లు తమ రేటింగ్‌ల కోసం అమానవీయంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం శాంతా సిన్హా మాట్లాడుతూ లైంగిక బాధితుల కలిసికట్టుగా తమకు జరిగిన అన్యాయాన్ని దేశ వ్యాప్తంగా పర్యటించి వివరిస్తుండడం అభినందనీయమన్నారు.
బాధితులకు మేమున్నామని ధైర్యం చెపుతుండటం శుభ పరిణామన్నారు. సర్వం కోల్పాయమని భావిస్తున్న బాధితులకు బాసటగా గరిమా అభియాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాల వల్ల చైతన్యం వస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. సామాజిక కార్యకర్త దేవి మాట్లాడుతూ లైంగిక దాడుల ఘటనలో బాధితులకు జరిగిన అన్యాయం వింటుంటేనే బాధగా ఉం దని, ఆ బాధను భరించినవారి పరిస్థితి గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. అనంతరం రాష్ట్రీయ గరిమా అభియాస్ కన్వీనర్ ఆసిఫ్‌షేక్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా లైంగిక దాడులకు గురైన వారు లక్షలాది మంది ఉన్నారన్నారు. అయితే వారిలో 6 శాతం బాధితులు మాత్రమే న్యాయం కోసం పోరాటం చేస్తున్నారని వివరించారు. ముఖ్యంగా దేశంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, గోవా, ముంబై, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలో లైంగిక దాడులు అధికంగా జరుగుతున్నాయన్నారు. తమ సంస్థ ద్వారా గడచిన 10 సంవత్సరాలలో ఇప్పటికి 50వేల మందిని ప్రత్యక్షంగా కలిసి వారి తరపున న్యాయం కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 24 రాష్ట్రాలను తాము పర్యటించి అక్కడి బాధితులకు భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతున్నామని వివరించారు. తదుపరి లైంగిక దాడికి గురైన లలిత(మధ్యప్రదేశ్), కాశీబాయి(లలిత్‌పూర్), గీత(ఝాన్సీజిల్లా) తదితరులు తమపై జరిగిన లైంగిక దాడి గురించి వివరించారు. గరిమా అభియాస్ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ పి.నవీన్ కుమార్ కూడా పాల్గొన్నారు.

చంద్రబాబు ట్రాప్‌లో పడొద్దు

జనసేన కార్యకర్తలకు పవన్‌కళ్యాణ్ సూచన



మన తెలంగాణ/హైదరాబాద్ : జనసేన కార్యకర్తలను గందరగోళంలో పడేయడానికి ఏపి సిఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆరోపించారు. శనివారం పలు జిల్లాల్లోని పార్టీ ముఖ్య నేతలతో సమావేశమైన పవన్ భవిష్యత్ కార్యాచరణ, ఎన్నికల సంసిద్ధతపై చర్చించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ తనతో కలిసి రావాలని చంద్రబాబు కోరడంపై పవన్ సంచలన ఆరోపణలు చేశారు. కార్యకర్తలను అయోమయానికి గురి చేయడంలో భాగంగానే చంద్రబాబు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని పవన్ ఆరోపించారు. చంద్రబాబు ట్రాప్‌లో కార్యకర్తలు పడవద్దని ఆయన సూచించారు. ఈ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని పవన్ సూచించారు.

రాజకీయాల్లో ఎదగాలంటే 25 ఏళ్లు ఓపిక పట్టాలి

ప్రజారాజ్యం పార్టీ పెట్టడానికి చిరంజీవికి ప్రేరణ కలిగించిన వారిలో తాను ఒకడినని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. ఓపిక లేని నాయకులు పార్టీలో చేరడం వలన ప్రజారాజ్యం విఫలమయ్యిందని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాలు వ్యాపారంగా మారిపోయాయని సమస్యలను పరిష్కరించే ఓపిక కూడా నేతల్లో లేదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజారాజ్యం అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ కమిటీల నియామకాల విషయంలో తొందరపడనన్నారు. రాజకీయాల్లో ఎదగాలంటే కనీసం 25 ఏళ్లు ఓపిక పట్టాలని ఆయన తెలిపారు.

మిషెల్‌కు ఫిబ్రవరి 27 వరకు జ్యుడీషియల్ కస్టడీ

న్యూఢిల్లీ: అగస్టా వెస్ట్‌లాండ్ వివిఐపి హెలికాప్టర్ల కేసులో అరెస్టయిన మధ్యవర్తి క్రిస్టియన్ మిషెల్‌ను ఢిల్లీ కోర్టు శనివారం జ్యుడీషియల్ కస్టడీని పంపించింది. మిషెల్‌ను స్పెషల్ జడ్జి అరవింద్ కుమార్ ఎదుట హాజరుపరిచారు. నగదు అక్రమ రవాణా కేసులో దర్యాప్తునకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)మిషెల్‌కు జ్యుడీషియల్ కస్టడీ విధించాల్సిందిగా కోరింది. ఇడి కేసు దర్యాప్తుకోసం మిషెల్‌కు ఫిబ్రవరి 26వరకు, సిబిఐ కేసులో ఫిబ్రవరి 27 వరకు కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. మిషెల్‌పై దర్యాప్తు ఫలితాలనిస్తోందని ఇడి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు డిపి సింగ్, ఎన్‌కె మట్టా కోర్టుకు తెలిపారు. హవాలా, అనేక బ్యాంకు ఖాతాల ద్వారా నగదు ఏవిధంగా బదిలీ అయిందో మేము దర్యాప్తు చే శాం. ఇతర రక్షణ ఒప్పందాల సమాచారాన్ని కూ డా తెలుసుకున్నాం. అక్కడికి డబ్బు ఇలా చేరిందో దర్యాప్తు చేయాల్సి ఉంది. వాళ్లు ఇటలీ కోర్టును తప్పుదారి పట్టించినట్టు తెలిపే డాక్యుమెంట్లు ఉన్నాయి' అని ఇడి వివరించింది. ఇలా ఉండ గా, ఇడి కస్టడీలో ఉన్నప్పుడు మిషెల్ తన లాయర్లను కలుసుకోకూడదని కోర్టు ఆదేశించింది.


పారికర్‌ను చంపొచ్చు.. అదనపు భద్రత కల్పించండి

రాష్ట్రపతి కోవింద్‌కు కాంగ్రెస్ లేఖ

న్యూఢిల్లీ : గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్‌పై హత్యా యత్నం జరగవచ్చని కాంగ్రెస్ పార్టీ శనివారం ఆందోళన వ్యక్తం చేసింది. ఆయన భద్రతను పెంచాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్ర ప్రతిపక్షం కోరింది. పారికర్‌కు రక్షణ పెంచాలని కోరుతూ గోవా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. చోదంకర్ రాష్ట్రపతికి రాసిన లేఖ ఒక టీవీ ఛానల్ సంపాదించింది. గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ పడక గదిలో రాఫెల్ ఒప్పందం ఫైల్స్ ఉన్నాయని రాష్ట్ర ఆరోగ్యమంత్రి విశ్వజిత్ రానే ఎవరికో ఫోన్‌లో చెబుతున్న సంభాషణ ఆడియో లీకైన సంగతి మీరు తెలుసుకోవాలి. ముఖ్యమంత్రి పారికర్ కేబినెట్ మీటింగ్‌లో కూడా స్వయంగా చెప్పారు. రాఫెల్ ఒప్పందంలోఅవినీతి నిజమేననే సంగతి తెలుస్తుంది కనుక అసలు వివరాలు కావలసిన వారు ప్రత్యక్షంగా బయటికి రారు. కానీ ఆ ఫైల్స్ కోసం సిఎంను చంపవచ్చు...అని కాంగ్రెస్ పార్టీ ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేసింది.

ఓటమికి సమష్టి బాధ్యత

- అసెంబ్లీ ఎన్నికల వరకే ప్రచార కమిటీ
- పార్లమెంట్ కోసం మళ్ళీ మరొకటి
- చిట్‌చాట్‌లో కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క




మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓటమికి సమష్టి బాధ్యత వహిస్తుందని ఆ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క అన్నారు. ఇందులో ఎవరినీ ప్రత్యేకంగా వేలు పెట్టి చూపించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. కేవలం టిడిపితో పొత్తు పెట్టుకున్న కారణంగానే కాంగ్రెస్ ఓడిపోయిందనడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. చంద్రబాబునాయుడు ప్రచారంతో కొన్ని నియోజకవర్గాల్లో మా పార్టీకి మేలు కూడా జరిగిందన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో కొద్దిసేపు చిట్‌చాట్ చేశారు. కాంగ్రెస్‌లోని ముఖ్య నాయకులను ఓడించేందుకు సిఎం కెసిఆర్ ఆరు నెలల ముందు నుంచే దృష్టి సారించారన్నారు. దీని కారణంగా కాంగ్రెస్ ఖచ్చితంగా గెలుస్తుందని భావించిన నియోజకవర్గాల్లోనూ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలోని అసెంబ్లీ ఎన్నికలు టిఆర్‌ఎస్ వర్సెస్ చంద్రబాబునాయుడు అన్న తరహాలో కెసిఆర్ మార్చారన్నారు. కూటమి పార్టీల మధ్య పొత్తులు సకాలంలో తేలని కారణంగానే కూడా కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. అయితే పార్టీ ఓటమికి ఇప్పుడు ఎవరినో తప్పు పట్టడం కూడా మంచిది కాదన్నారు. విజయం అయినా, అపజయం అయినా సమిష్టి బాధ్యతగానే తీసుకోవాలని భట్టి అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల ముందు వేసిన ప్రచార కమిటీ ఆ ఎన్నికలకే పరిమితమన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం మళ్ళీ కమిటీ ఉంటుందన్నారు. త్వరలోనే ఈ కమిటీని ప్రకటించే అవకాశాలు ఉన్నాయని ఆయన సూచన ప్రాయంగా వెల్లడించారు. పార్టీలో తనకు ఎటువంటి బాధ్యతలు అప్పగించినా నిర్వహిస్తానని తెలిపారు.

కూటమి వద్దని ఆనాడే చెప్పా : కోమటిరెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓడిపోవడానికి పొత్తులే ప్రధాన కారణమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రచారంలో తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, టిడిపి అధినేత చంద్రబాబునాయుడులు కలిసి చేసిన ప్రచారం కూడా కాంగ్రెస్‌కు నష్టం వాటిల్లిందన్నారు. అసలు రాష్ట్రంలో కూటమి వద్దు అని అసెంబ్లీ ఎన్నికలకు ముందే తాను తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పానని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. ఈరోజు కూడా అదే చెబుతున్నానని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎలాంటి కూటమిలు అవసరం లేదని అన్నారు. పొత్తుల వల్ల రెండు నెలల సమయం నష్టపోయామన్నారు. బోఫోర్స్ గురించి మాట్లాడే హక్కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి. హనుమంతరావు వ్యాఖ్యానించారు. రాఫెల్ కుంభకోణంపై సమాధానం చెప్పలేక ఆమె బోఫోర్స్‌ని తెరమీదకు తెచ్చేందుకు యత్నించడం సిగ్గుచేటని ఆయన వ్యాఖ్యానించారు.

రాఫెల్‌పై పార్లమెంట్‌లో మోడీ మాట్లాడాలి: దేవెగౌడ




బెంగళూరు: రాఫెల్ ఒప్పందం విషయంలో సరాసరి ప్రధానమంత్రిపైనే ఆరోపణలు వచ్చాయి కాబట్టి నరేంద్ర మోడీ పార్లమెంటులో ఈ అంశంపై మాట్లాడాలని జనతాదళ్ (ఎస్) అధినేత దేవెగౌడ శనివారం విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో శుక్రవారం రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగాన్ని మాజీప్రధాని దేవెగౌడ ప్రశంసించారు. కానీ ఆ ప్రసంగం మాత్రమే సరిపోదన్నారు. రాఫెల్ ఒప్పందంపై అంశాలవారీగా మాట్లాడిన నిర్మలా సీతారామన్ ఈ ఒప్పందాన్ని వెనకేసుకు రావడమే కాక, కాంగ్రెస్ పార్టీపై ఎదురు దాడికి దిగారు. 'రక్షణమంత్రి ఈ ఒప్పందంపై బాగా వాదించారు. ఆ సంగతి అలా ఉంచితే, ప్రధాని సభకు వచ్చి ఎందుకు సమాధానం ఇవ్వడం లేదు? ప్రధానిపైనే ఆరోపణ వచ్చింది. ప్రధాని స్థాయి వ్యక్తి కావచ్చు, మరెవరైనా కావచ్చు. ప్రధానమంత్రి తప్పు ఉండవచ్చు, లేకపోవచ్చు. కానీ ఆరోపణ వచ్చాక ఆ వ్యక్తి సభకు రావాలి' అని దేవెగౌడ విలేకరులతో అన్నారు. మోడీ సమాధానం ఇవ్వకపోవడంవల్ల ప్రజల్లో ఆయనపై అనుమానాలకు ఆస్కారం కలుగుతోంది అని జెడి (ఎస్) అధినేత అభిప్రాయపడ్డారు.



ప్రొ కబడ్డీ చాంపియన్

బెంగళూరు



ముంబయి: ప్రొ కబడ్డీ సీజన్ ఆరు ట్రోఫీను బెంగళూరు బుల్స్ సొంతం చేసుకుంది. శనివారం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో బెంగళూరు 38–33 తేడాతో గుజరాత్ ఫార్చ్యూన్ జెయిం ట్స్‌ను ఓడించింది. బెంగళూరు ఈ టైటిల్‌ను సాధించడం ఇదే తొలిసారి. మరోవైపు గుజరాత్‌కు ఇది ఫైనల్లో వరుసగా రెండో ఓటమి కావడం విశేషం. కిందటి సీజన్‌లో కూడా గుజరాత్ రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. ఈసారి కూడా ఫైనల్లో ఓటమి పాలైంది. ఇక, బెంగళూరు ఇంతకు ముందు ఒకసారి రన్నరప్‌గా నిలిచింది. ఈ సీజన్‌లో అసాధారణ ఆటతో బెంగళూరు ప్రకంపనలు సృష్టించింది. గుజరాత్ కూడా కిందటి సారిలాగే ఈ ఏడాది కూడా వరుస విజయాలతో టైటిల్ పోరుకు దూసుకొచ్చింది. కాగా, శనివారం జరిగిన ఫైనల్ సమరం అభిమానులను కనువిందు చేసింది. అభిమానులు కోరుకున్న విధంగానే రెండు జట్లు విజయం కోసం సర్వం ఒడ్డాయి. దీంతో పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. గుజరాత్ అసాధారణ ఆటను కనబరిచినా చివర్లో తడబడింది. ఒత్తిడిని తట్టుకోవడంలో విఫలం కావడంతో ఓటమి తప్పలేదు. బెంగళూరు మాత్రం చివరి వరకు నిలకడగా ఆడుతూ మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. బెంగళూరు విజయంలో పవన్ కీలక పాత్ర పోషించాడు. కాగా, ప్రథమార్థంలో స్పష్టమైన ఆధిక్యం సాధించిన గుజరాత్ ద్వితీయార్థంలో మాత్రం ఆశించిన స్థాయిలో ఆడ లేక పోయింది. దీంతో గెలవాల్సిన మ్యాచ్‌లో ఓటమి పాలుకాక తప్పలేదు.



భారత్ పైచేయి

చెలరేగిన కుల్దీప్, జడేజా

రాణించిన హారిస్, ఆస్ట్రేలియా 236/6, చివరి టెస్టు

సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న చివరి టెస్టులో టీమిండియా పట్టు బిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో 622 పరుగుల భారీ స్కోరు సాధించిన భారత్ ఇప్పటికే పటిష్టస్థితిలో చేరింది. 24/0 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం మూడో రోజు బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. వెలుతురు లేని కారణంగా ఆటను నిర్ణీత సమయం కంటే ముందుగానే నిలిపి వేయాల్సి వచ్చింది. కాగా, భారత్ మొదటి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే ఆస్ట్రేలియా మరో 386 పరుగులు చేయాలి. ఇప్పటికే కీలక ఆటగాళ్లందరూ పెవిలియన్ చేరడంతో కంగారూలకు ఇబ్బందులు ఖాయంగా కనిపిస్తున్నాయి. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ మూడు, రవీంద్ర జడేజా రెండు వికెట్లు తీసి జట్టుకు పైచేయి అందించారు. ఈ సిరీస్‌లో టీమిండియా ఇప్పటికే 2–1 ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ డ్రాగా ముగించినా భారత్‌కు సిరీస్ సొంతం మవుతోంది.

శుభారంభం

మూడో రోజు బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియాకు ఓపెనర్లు మార్కస్ హారిస్, ఉస్మాన్ ఖ్వాజా శుభారంభం అందించారు. ఇద్దరు భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే అడపాదడపా బౌండరీలతో స్కోరు నడిపించారు. ఇదే క్రమంలో ఇద్దరు తొలి వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని కూడా నమోదు చేశారు. కుదురుగా ఆడుతున్న ఉస్మాన్ ఖ్వాజా మూడు ఫోర్లతో 27 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. కుల్దీప్‌కు ఈ వికెట్ దక్కింది. తర్వాత వచ్చిన మార్నస్ లబుస్చాంగే అండతో హారిస్ పోరాటం కొనసాగించాడు. ఇద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. వీరి మధ్య ఇదే క్రమంలో అర్ధ సెంచరీ పార్ట్‌నర్‌షిప్ కూడా నమోదైంది. కాగా, కీలక ఇన్నింగ్స్ ఆడిన హారిస్ 8 ఫోర్లతో 79 పరుగులు చేసి ఔటయ్యాడు. అతన్ని జడేజా క్లీన్‌బౌల్డ్ చేశాడు. మరోవైపు స్టార్ ఆటగాడు షాన్ మార్ష్ ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. రెండు ఫోర్లతో 8 పరుగులు చేసి వెనుదిరిగాడు. ఈ వికెట్ కూడా జడేజా ఖాతాలోకే వెళ్లింది. ఆ వెంటనే మార్నస్ ఏడు ఫోర్లతో 38 పరుగులు కూడా ఔటయ్యాడు. షమి ఈ వికెట్ పడగొట్టాడు. ఈ దశలో ట్రావిస్ హెడ్, హాండ్స్‌కొంబ్ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. ఇద్దరు జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను పటిష్టపరిచేందుకు ప్రయత్నించారు. ఈ జోడీని విడగొట్టేందుకు భారత బౌలర్లు చాలా సేపు వేచి చూడాల్సి వచ్చింది. అయితే 56 బంతుల్లో రెండు ఫోర్లతో 20 పరుగులు చేసిన హెడ్‌ను కుల్దీప్ వెనక్కి పంపాడు. కొద్ది సేపటికే కెప్టెన్ టిమ్ పైన్‌ను కూడా కుల్దీప్ ఔట్ చేశాడు. పైన్ ఐదు పరుగులు మాత్రమే చేశాడు.



కమిన్స్ పోరాటం

ఈ దశలో హాండ్స్‌కొంబ్‌తో జత కలిసిన పాట్ కమిన్స్ మరో వికెట్ పడకుండా చూశాడు. ఒక వైపు కమిన్స్, మరోవైపు హాండ్స్‌కొంబ్ జాగ్రత్తగా ఆడడంతో భారత్‌కు మరో వికెట్ లభించ లేదు. హాండ్స్‌కొంబ్ ఆత్మరక్షణకే ప్రాధాన్యత ఇచ్చాడు. కమిన్స్ మాత్రం కాస్త దూకుడును ప్రదర్శించాడు. ఈ జోడీని విడగొట్టేందుకు భారత బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. ఇదే సమయంలో వెలుతురు మందగించడంతో ఆటను నిలిపి వేయాల్సి వచ్చింది. అప్పటికే ఆస్ట్రేలియా 83.3 ఆరు వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. మారథాన్ ఇన్నింగ్స్ ఆడిన హాండ్స్‌కొంబ్ 91 బంతుల్లో మూడు ఫోర్లతో 28 పరుగులు చేసి క్రీజులో నిలిచాడు. ధాటిగా ఆడిన కమిన్స్ 41 బంతుల్లో ఆరు ఫోర్లతో 25 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు.



పట్టు దొరికినట్టే

ఇప్పటి వరకు జరిగిన ఆటను పరిశీలిస్తే ఈ మ్యాచ్‌లో టీమిండియాకు పట్టి చిక్కినట్టే కనిపిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే ఆస్ట్రేలియాకు ఫాలోఆన్ ఆడించడం ఖాయం. అదే జరిగితే ఒత్తిడిని తట్టు కోవడం ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్‌కు కష్టమవుతోంది. భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే ఆస్ట్రేలియా మరో 386 పరుగులు చేయాలి. ఈ లక్ష్యాన్ని అందుకోవడం అంత తేలికకాదు. చివరి రెండు రోజులు పిచ్ బౌలింగ్‌కు అనుకూలంగా మారడం ఖాయం. ఇలాంటి పరిస్థితుల్లో ఆస్ట్రేలియా ఓటమిని తప్పించు కోవడం సులువు కాదు. దీనికి సర్వం ఒడ్డి పోరాడక తప్పదు. అలా జరిగితే కూడా డ్రాతో గట్టెక్కె అవకాశాలే ఉంటాయి. అంతే తప్ప మ్యాచ్‌లో విజయం సాధించడం మాత్రం దాదాపు అసాధ్యంగానే చెప్పాలి. ఇదే జరిగితే ఆస్ట్రేలియా గడ్డపై భారత్ తొలి టెస్టు సిరీస్ సాధించడం ఖాయమైనట్టే.



స్కోరు బోర్డు:

భారత్ మొదటి ఇన్నింగ్స్: మయాంక్ అగర్వాల్ (సి) స్టార్క్ (బి) నాథన్ లియాన్ 77, లోకేశ్ రాహుల్ (సి) షాన్ మార్ష్ (బి) హాజిల్‌వుడ్ 9, చటేశ్వర్ పుజారా 130 (సి) అండ్ (బి) లియాన్ 193, విరాట్ కోహ్లి (సి) పైన్ (బి) హాజిల్‌వుడ్ 23, అజింక్య రహానె (సి) పైన్ (బి) స్టార్క్ 18, హనుమ విహారి (సి) మర్నాస్ (బి) లియాన్ 42, రిషబ్ పంత్ నాటౌట్ 159, రవీంద్ర జడేజా (బి) లియాన్ 81, ఎక్స్‌ట్రాలు 20, మొత్తం 167.2 ఓవర్లలో 622/7 డిక్లేర్డ్.
బౌలింగ్: మిచెల్ స్టార్క్ 26–0–123–1, జోష్ హాజిల్‌వుడ్ 35–11–105–2, పాట్ కమిన్స్ 28–5–101–0, నాథన్ లియాన్ 57.2–8–178–4, మార్నస్ లబుస్చాంగే 16–0–76–0, ట్రావిస్ హెడ్ 4–0–20–0, ఉస్మాన్ ఖ్వాజా 14–0–4–0.
ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్: మార్కస్ హారిస్ (బి) రవీంద్ర జడేజా 79, ఉస్మాన్ ఖ్వాజా (సి) పుజారా (బి) కుల్దీప్ యాదవ్ 27, మార్నస్ లబుస్చాంగే (సి) రహానె) షమి 38, షాన్ మార్ష్ (సి) రహానె (బి) రవీంద్ర జడేజా 8, ట్రావిస్ హెడ్ (సి) అండ్ (బి) కుల్దీప్ యాదవ్ 20, పీటర్ హాండ్స్‌కొంబ్ (బ్యాటింగ్) 28, టిమ్ పైన్ (బి) కుల్దీప్ యాదవ్ 5, పాట్ కమిన్స్ (బ్యాటింగ్) 25, ఎక్స్‌ట్రాలు 6, మొత్తం 83.3 ఓవర్లలో 236/6.
బౌలింగ్: మహ్మద్ షమి 16–1–54–1, జస్‌ప్రీత్ బుమ్రా 16–4–43–0, రవీంద్ర జడేజా 27.3–9–62–2, కుల్దీప్ యాదవ్ 24–6–71–3.



గెలుపు బాటలో దక్షిణాఫ్రికా

కేప్‌టౌన్: పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు గెలుపు బాటలో ప్రయాణిస్తోంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే సౌతాఫ్రికా 41 పరుగులు మాత్రమే చేయాలి. పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో 294 పరుగులకు ఆలౌటైంది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సాధించిన సౌతాఫ్రికాకు రెండో ఇన్నింగ్స్‌లో విజయం కోసం 41 పరుగులు మాత్రమే కావాలి. ఆదివారం నాలుగో రోజే సౌతాఫ్రికా ఈ లక్ష్యాన్ని ఛేదించడం ఖాయం. పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడింది. ఓపెనర్ షాన్ మసూద్, అసద్ షఫిక్‌లు అద్భుత పోరాట పటిమను కనబరచడంతో పాకిస్థాన్ కోలుకున్నట్టే కనిపించింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన మసూద్ 9 ఫోర్లతో 61 పరుగులు చేశాడు. షఫిక్ 12 ఫోర్లు, సిక్స్‌తో 88 పరుగులు చేశాడు. మరోవైపు బాబర్ ఆజమ్ 15 ఫోర్లతో వేగంగా 72 పరుగులు సాధించాడు. వీరు తప్ప మిగతావారు విఫలం కావడంతో పాక్ ఇన్నింగ్స్ 294 పరుగుల వద్దే ముగిసింది. ఒక దశలో 3 వికెట్ల నష్టానికి 190 పరుగులతో పటిష్ట కనిపించిన పాక్ తర్వాత కుప్ప కూలింది. డేల్ స్టెయిన్, రబడా నాలుగేసి వికెట్లతో పాక్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు అంతకుముందు సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 431 పరుగులకు ఆలౌటైంది.



మహారాష్ట్ర ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పురుషుల డబుల్స్ టైటిల్ గెలుచుకున్న భారత్‌కు చెందిన రోహన్ బోపన్న–దివిజ్ శరణ్ జోడీ

పెరీరా మెరుపులు వృథా

కివీస్‌దే సిరీస్



మౌంట్ మౌంగానుయి: తిసారా పెరీరా(140) విధ్వంసకర సెంచరీ సాధించినా శ్రీలంకను గెలిపించలేక పోయాడు. శనివారం జరిగిన రెండో వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మరో మ్యాచ్ మిగిలివుండగానే 2–0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 319 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన లంక 298 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. స్టార్ ఆల్‌రౌండర్ తిసారా పెరీరా విధ్వంసక సెంచరీ సాధించినా ఫలితం లేకుండా పోయింది. ఆకాశమే హద్దుగా చెలరేగి పోయిన పెరీరా 74 బంతుల్లోనే 13 భారీ సిక్సర్లు, మరో 8 ఫోర్లతో 140 పరుగులు చేశాడు. ఓపెనర్ గుణతిలక (71) తప్ప మిగతావారు విఫలం కావడంతో లంకకు ఓటమి తప్పలేదు. అంతకుముందు న్యూజిలాండ్ జట్టులో ఓపెనర్ కొలిన్ మున్రో 77 బంతుల్లో 12 ఫోర్లు, రెండు సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. సీనియర్ ఆటగాడు రాస్ టైలర్ 90 పరుగులు సాధించాడు. మరోవైపు నిషామ్ మరోసారి విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగి పోయాడు. లంక బౌలర్లను హడలెత్తించిన నిషామ్ ఐదు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 37 బంతుల్లోనే 64 పరుగులు చేశాడు. దీంతో కివీస్ స్కోరు 319కి చేరింది.

మన తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 6, జనవరి 2019
www.manatelangana.news

ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాద ఘటన కర్నాటకలోని కొప్పాల్ ప్రాంతంలో చోటుచేసుకుంది. భర్త, భార్య, వారి నలుగురు కూతుళ్లు తమ ఇంట్లో చనిపోయి కనిపించారు. కుటుంబమంతా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతులను శేఖరయ్య బీద్నల్(42), అతడి భార్య జయమ్మ(39), కుమార్తెలు బసమ్మ(23), గౌరమ్మ(20), సావిత్రి (18), పార్వతి (16)గా గుర్తించారు.

విశాల

బెంగళూరు సెంట్రల్ నుంచి ప్రకాశ్‌రాజ్



బెంగళూరు: ఇప్పటికే క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించిన విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తాను ఎక్కడి నుంచి పోటీచేయనున్నారో స్పష్టం చేశారు. కర్నాటక లోని బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తానని ప్రకటించారు. తన కొత్త ప్రయాణానికి మద్దతుగా నిలుస్తున్న వారికి ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు. త్వరలోనే అన్ని వివరాలను మీడియాకు వెల్లడించనున్నట్లు ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు.

రివార్డు అడిగినందుకు మంత్రి చివాట్లు

బంగారు పతకం విజేతకు చేదు అనుభవం



న్యూఢిల్లీ : కామన్‌వెల్త్ గేమ్స్‌లో రెండు బంగారు పతకాలు సాధించడంతోపాటు గత ఏడాది జరిగిన యూత్ ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలుచుకున్న షూటింగ్ సెన్సేషన్ మనూ భకర్‌కు హర్యానా ప్రభుత్వం నుంచి చేదు అనుభవం ఎదురైంది. హర్యానా ప్రభుత్వం తనకు ప్రకటించిన రూ.2కోట్ల నగదు రివార్డును గురించి గుర్తు చేసినందుకు ఆమెకు ప్రభుత్వం నుంచి చివాట్లు పడ్డాయి. ఝజ్జర్ జిల్లాలోని గోరియా గ్రామానికి చెందిన 16 ఏళ్ల మనూ శుక్రవారం తన ట్విట్టర్ ఖాతా నుంచి ట్వీట్ చేస్తూ ప్రభుత్వం తనకు ప్రకటించిన బహుమానం తాలూకు పోస్టల స్క్రీన్‌షాట్లు పోస్ట్ చేయడంతోపాటు "నాకు ప్రకటించిన బహుమానం నిజమేనా లేక కేవలం బూటకపు వాగ్దానమా..దయచేసి నిర్ధారించండి" అంటూ ట్వీట్ చేశారు. దీనికి వెంటనే స్పందించిన హర్యానా క్రీడల శాఖ మంత్రి అనీల్ విజ్ బహిరంగంగా నిలదీసే ముందు మనూ భకర్ క్రీడల శాఖను సంప్రదించి ఉండవలసిందని హితబోధ చేశారు. "సోషల్ మీడియాకు ఎక్కేముందు క్రీడల శాఖతో మనూ భకర్ నిర్ధాంచుకుని ఉండాల్సింది. దేశంలోనే అత్యున్నత అవార్డులను అందచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కించపరచడం అసహ్యంగా ఉంది. ఆ సమయంలో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం భకర్‌కు రూ. 2 కోట్లు అందుతాయి. క్రీడాకారులకు క్రమశిక్షణ చాలా అవసరం. ఈ వివాదాన్ని సృష్టించినందుకు భకర్ చింతించాలి. ఆమెకు ఎంతో ఉజ్వలమైన భవిష్యత్తు ఉంది. ఆమె క్రీడలపై తన దృష్టిని నిమగ్నం చేయాలి" అంటూ మంత్రి అనీల్ విజ్ ట్వీట్ల ద్వారా చివాట్లు పెట్టారు.

మూగబోనున్న ఆకాశవాణి 'నేషనల్ స్టేషన్'!



న్యూఢిల్లీ: సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రతి గంటకోసారి వార్తలను ప్రసారం చేయడంతో పాటు వినోద, సంగీత కార్యక్రమాలతో గడచిన 31 సంవత్సరాలుగా శ్రోతలను అలరిస్తున్న ఆకాశవాణి జాతీయ రేడియో స్టేషన్ ఇక మూగబోనున్నది. 1987 నుంచి ప్రసారమవుతున్న ఆల్ ఇండియా రేడియో నేషనల్ చానల్‌ను తక్షణమే మూసివేయాలని ప్రసార భారతి ఆదేశాలు జారీచేసింది. హేతుబద్ధీకరణ, ఖర్చులు తగ్గించుకోవడం వంటి కారణాలతో ఈ రేడియో స్టేషన్‌ను వెంటనే నిలిపివేయాలంటూ ఎఐఆర్ డైరెక్టర్ జనరల్ తరపున జారీచేసిన ఉత్తర్వులో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రోగ్రామ్ ఎకె బలూనీ గురువారం ఆదేశించారు. దీంతోపాటు అహ్మదాబాద్, హైదరాబాద్, లక్నో, షిల్లాంగ్, తిరువనంతపురంలో సిబ్బంది శిక్షణ పొందిన రీజినల్ అకాడమీస్ ఆఫ్ బ్రాడ్‌కాస్టింగ్, మల్టీమీడియా(ఆర్ఎబిఎం)ను కూడా మూసివేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

మా వాళ్లూ ప్రధాని అవుతారు : ఫడ్నవీస్



నాగపూర్: భారతదేశానికి అద్భుతమైన పరిపాలన అందించింది మహారాష్ట్రీయులేనని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. శుక్రవారం నాడిక్క డ16వ జగతిక్ మరాఠీ సమ్మేళన్‌లో ఆయన ప్రసంగిస్తూ 2050 నాటికి ఒకరు కాదు చాలామంది మహారాష్ట్రీయులు ప్రధాన మంత్రి పదవిని చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటివరకు మహారాష్ట్రకు చెందిన ఏ ఒక్కరూ ప్రధాని పదవిని చేపట్టకపోవడం గమనార్హం. 18వ శతాబ్దంలో మరాఠా సైన్యం ఆక్రమించుకున్న ప్రస్తుత పాకిస్తాన్‌లోని అటోక్ ప్రాంతాన్ని ప్రస్తావిస్తూ మహారాష్ట్ర ప్రజలకు అటోక్‌ను చేరుకునే సామర్థ్యం ఉందని, అలాంటిది ఒకరు కాదు చాలామంది మహారాష్ట్రీయులు 2050లోపు ప్రధాని పదవిని చేపట్టగలరని ఫడ్నవీస్ చెప్పారు.

10 మంది మహిళలు దర్శనం చేసుకున్నారట!

తిరువనంతపురం: సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఇప్పటివరకు 50 సంవత్సరాల వయసు లోపు మహిళలు 10 మంది శబరిమలలో అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకున్నారని మీడియాలో వార్తలు వచ్చాయి. ఆ మహిళల వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయనప్పటికీ సుప్రీంకోర్టు ఎదుట ఉంచాలని నిర్ణయించుకున్నట్లు కేరళ పోలీసు అధికారులను ఉటంకిస్తూ ఒక మలయాళ దినపత్రిక వెల్లడించింది. శబరిమలలో అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకునేందుకు విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు వచ్చారని, వీరిలో మలేసియాకు చెందిన ముగ్గురు మహిళలు మూడు రోజుల క్రితం అయ్యప్ప దర్శనం చేసుకున్నారని పోలీసులు వెల్లడించినట్లు పత్రిక తెలిపింది. ఈ దర్శనం వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. బిందు, కనకదుర్గ అనే ఇద్దరు కేరళ మహిళలు దర్శనం చేసుకున్న విషయాన్ని కూడా పోలీసులు సోషల్ మీడియా ద్వారా తరువాత వెల్లడించారు. అయితే, శ్రీలంక మహిళ దర్శనం విషయంలో మొదట భిన్నకథనాలు వచ్చినప్పటికీ ఆమెను సురక్షితంగా బేస్ క్యాంప్ పంపకు తీసుకురావడం కోసమే పోలీసులే ఈ గందరగోళం సృష్టించినట్లు తెలుస్తోంది. అయితే హిందూ సంస్థలు మాత్రం ఈ వాదనను కొట్టివేస్తున్నాయి. శ్రీలంక మహిళ దర్శనం చేసుకోలేదని వారు చెబుతున్నారు.

ఆటాడుకున్న మమతా బెనర్జీ!



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంచి కవయిత్రి, చిత్రకారిణి అని చాలా మందికి తెలుసు. ఆమెలో ఎవరూ చూడని ఇంకో ప్రతిభ ఉందని ఆమె స్వయంగా బయటపెట్టేవరకు ఎవరికీ తెలియదు. రాజకీయాలలో తన ఎత్తులతో చిత్తు చేయగల సత్తా ఉన్న మమత మంచి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అని ఇప్పుడే బయటపడింది. శాలువా కప్పుకుని బ్యాడ్మింటన్ కోర్టులో తన ప్రత్యర్థికి ధీటు జవాబిస్తూ షాట్ల మీద షాట్లు కొడుతూ ఒక పాయింట్ తేడాతో ఓడిపోయిన మమత ఆటకు సంబంధించిన 31 నిమిషాల వీడియోను ముఖ్యమంత్రే స్వయంగా పోస్ట్ చేశారు. "మేము క్రీడలను ప్రేమిస్తాం. గ్రామంలో ఇది మాకు సహజమైన ఆట..." అంటూ మమత ట్వీట్ చేశారు.



టునా చేపా.. మజాకా..!

జపాన్‌లో ఓ చేప ధర ఏకంగా రూ. 21కోట్లు పలికింది. సముద్ర చేపల్లో అత్యంత రుచిరకరమైనదిగా పేరుగాంచిన టునా చేపకు ఇంత ధర దక్కింది. అయితే ఈ చేపలు తక్కువ సంఖ్యలో లభ్యమవుతుంటాయి. దీంతో వీటిని వేలం వేస్తారు. టోక్యోలోని ప్రపంచ ప్రఖ్యాతి పొందిన సుకిజీ చేపల మార్కెట్లో ఏటా నూతన సంవత్సరం సందర్భంగా పెద్ద ఎత్తున టునా చేపల వేలం కార్యక్రమం జరుగుతుంది. గతేడాది ఈ చేపల మార్కెట్‌ను సుకిజీ నుంచి టొయోసుకు మార్చారు. ఈ ఏడాది టొయోసు మార్కెట్లో జరిగిన వేలంలో 278 కిలోల భారీ బ్లూఫిన్ టునా చేప ఏకంగా రూ. 21కోట్లు పలికింది. టునా చేపలను విరివిగా కొనుగోలు చేసే స్థానిక సుషీ రెస్టారెంట్ల యజమాని కియోషీ కిమురానే ఈ సారి కూడా బ్లూఫిన్ టునాను దక్కించుకోవడం విశేషం.

కాలిఫోర్నియాలో కాల్పులు
ముగ్గురు మృతి

కాలిఫోర్నియా: అమెరికాలోని కాలిఫోర్నియాలో కాల్పుల కలకలం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి టోరెన్స్ నగరానికి చెందిన బౌలింగ్ అల్లేలోని గేబుల్ బౌల్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. నలుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. కాల్పుల శబ్దం విన్న వెంటనే పోలీస్ అధికారులు వెంటనే స్పందించినట్లు తెలిపారు. గేబుల్ హౌజ్ లోపల పలువురు బాధితులు బులెట్ గాయాలతో కనిపించారన్నారు. కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనను బౌలింగ్, లేజర్ ట్యాగ్, పూర్తి ఆర్కేడ్‌కు ఆట వేదికగా తన వెబ్‌సైట్‌లో గేబుల్ హౌజ్ అభివర్ణించింది.

ఐఎఎస్ చంద్రకళ ఇళ్లలో సోదాలు

- ఏక కాలంలో యుపి, ఢిల్లీలో 12చోట్ల సిబిఐ దాడులు
- అక్రమ ఇసుక తవ్వకాల కేసులో చర్యలు
- చంద్రకళది తెలంగాణలోని కరీంనగర్ జిల్లా



న్యూఢిల్లీ : అక్రమ ఇసుక తవ్వకాలకు సంబంధించి సిబిఐ శనివారం ఐఎఎస్ అధికారి బి చంద్రకళ , ఇతరుల నివాసాలపై దాడులు నిర్వహించింది. ఉత్తరప్రదేశ్, ఢిల్లీల్లోని ఈ తాజా దాడులను ఏకకాలంలో 12 చోట్ల నిర్వహించారు. అక్రమంగా ఇసుక తవ్వకాలకు సంబంధించి ఇప్పుడు సిబిఐ దాడులకు గురయిన చంద్రకళ యుపి కేడర్ ఐఎఎస్ అధికారిణిగా ఉన్నారు. ఆమె తెలంగాణకు చెందిన వారు. ఉత్తర ప్రదేశ్‌లో వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు అక్రమ ఇసుక తవ్వకాల కార్యకలాపాలకు సహకరిస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు సిబిఐ తాజా సోదాలు నిర్వహించింది. ఢిల్లీ, లక్నో, కాన్పూర్, హమీర్పూర్, జలౌన్ వంటి పలు ప్రాంతాలలోని నివాసాలపై సిబిఐ దాడులు జరిగాయని వార్తాసంస్థలు తెలిపాయి. అవినీతికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమం ద్వారా చంద్రకళ పోరు సల్పుతూ ప్రచారం పొందారు. శనివారం ఉదయం కాన్పూర్‌లోని చంద్రకళ నివాసానికి హుటాహుటిన 11 మందితో కూడిన సిబిఐ బృందం చేరుకుంది. పలు కీలక పత్రాలను స్వాధీనపర్చుకుంది. 2012 ప్రాంతంలో హమీర్పూర్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఆమె విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలకు అక్రమ లైసెన్సులు ఇచ్చినట్లుగా ఆరోపణలు వచ్చాయి. నిబంధనలను బేఖాతరు చేసినట్లుగా తెలియడంతో దీనిపై సిబిఐ రంగంలోకి దిగింది. ఇసుక అక్రమ తవ్వకాల కేసుకు సంబంధించే బిఎస్‌పి నేత సత్యదేవ్ దీక్షిత్ , ఎస్‌పి ఎమ్మెల్సీ రమేష్ మిశ్రాల నివాసాలపై కూడా ఇప్పుడు దాడులు జరిగాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఐదు జిల్లాల్లో భారీ స్థాయిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లుగా వచ్చిన ఆరోపణలపై ఇప్పుడు సిబిఐ దర్యాప్తు జరుపుతోంది. ప్రభుత్వ అధికారులు, రాజకీయ నేతల ప్రోద్బలంతో అక్రమ తవ్వకాలు సాగుతున్నట్లు వచ్చిన వార్తలను ఆధారంగా చేసుకుని యుపి హైకోర్టు ఇటీవలే స్పందించింది. దీనిపై దర్యాప్తు చేపట్టాలని సిబిఐని ఆదేశించింది. అవినీతి అధికారులను ఎప్పటికప్పుడూ బహిరంగంగా తిడుతూ సోషల్ మీడియాలో ప్రచారంతో రాష్ట్రం అంతటా సంచలనం సృష్టించిన ఈ అధికారిణి సిబిఐ దాడులకు గురి కావడం ఇప్పుడు యుపిలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఐఎఎస్ వర్గాలలో కలవరానికి దారితీసింది.

అఖిలేష్‌కూ బిగుస్తున్న ఉచ్చు



అక్రమ ఇసుక తవ్వకాలు వ్యవహారంలో సిబిఐ త్వరలోనే యుపి మాజీ సిఎం, ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్‌పై కూడా దర్యాప్తు జరుపుతుందని వెల్లడైంది. ఈ విషయాన్ని యుపి అధికార వర్గాలు శనివారం నిర్ధారించాయి. అయితే ఎప్పుడు ఏ స్థాయిలో అఖిలేష్‌పై దర్యాప్తు జరుగుతుందనేది స్పష్టం చేయలేదు. సిఎంగా ఉన్నప్పుడు 2012 –13 మధ్యకాలంలో అఖిలేష్ అదనంగా గనుల మంత్రిత్వ శాఖను కూడా నిర్వహించారు. ఈ సమయంలో మంత్రులుగా ఉన్న వారందరి పాత్ర గురించి దర్యాప్తు జరుగుతుందని, అదే విధంగా అక్రమ తవ్వకాలకు వీలు కల్పించినట్లుగా ఆరోపణలు వచ్చిన వారిని కూడా విచారిస్తారని వెల్లడయింది

అండమాన్‌కు 'పబుక్' తుపాను



- కేంద్రం 'ఎల్లో ఎలర్ట్' జారీ
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

న్యూఢిల్లీ : అండమాన్, నికోబార్ దీవులకు 'ఎల్లో ఎలర్ట్' పేరుతో తుఫాను హెచ్చరిక జారీచేసినట్టు కేంద్ర హోంమంత్రిత్వశాఖ శనివారం తెలిపింది. ఒక తుఫాను అక్కడి ఆర్చి పెలాగో వైపు కదులుతోంది. అండమాన్ దీవుల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుంది. పబుక్ అనే తుఫాను వల్ల అండమాన్ సముద్రం, తీరాన్ని ఆనుకుని ఉండే ఈస్ట్ సెంట్రల్, ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతం జనవరి 7 వరకు ఉద్రిక్తంగా, ఆటుపోట్లతో ఉంటుందని వాతావరణ సమాచార లేఖను పేర్కొంటూ హోంమంత్రిత్వ శాఖ అధికారి ఒకరు తెలిపారు. థాయ్‌లాండ్ గల్ఫ్ తీరం, దాని పొరుగున ఉన్న ప్రాంతంలో పుట్టిన పబుక్ తుఫాను గంటకు పది కిలోమీటర్ల వేగంతో వాయవ్య దిశగా కదిలి థాయ్‌లాండ్, దాని పొరుగు ప్రాంతంలో కేంద్రీకృతమైంది. ఆగ్నేయ దిశలో, ఈస్ట్ సెంట్రల్ బంగాళాఖాతం, అండమాన్ దీవులు, అండమాన్ సముద్ర ప్రాంతంలో జనవరి 8 నాటికి ఉధృతమవుతుంది. ఆదివారం దాకా నికోబార్ దీవుల్లో సముద్రం తీవ్రమైన ఆటుపోట్లకు లోనవుతుంది. సురక్షిత ప్రాంతాల్లో మాత్రమే ఉండాలని అండమాన్ దీవుల ప్రజలకు సలహా ఇస్తున్నాం...అని ఆ అధికారి తెలిపారు.

లక్ష కోట్ల రుణమాఫీకి దిగొచ్చు కానీ..

కాంగ్రెస్ విధానాలపై మోడీ మండిపాటు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ రైతాంగాన్ని తప్పుదోవ పట్టిస్తోందని, రుణమాఫీలపై సాధ్యం కాని వాగ్దానాలతో పబ్బం గడుపుతోందని ప్రధాని మోడీ విమర్శించారు. కేంద్రం తల్చుకుంటే లక్ష కోట్ల రూపాయల మేరకు రుణ మాఫీకి దిగవచ్చునని, అయితే వాస్తవికతను పరిగణనలోకి తీసుకోవల్సి ఉంటుంది అని ప్రధాని స్పష్టం చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల దశలో కాంగ్రెస్ చేసిన రుణ మాఫీ హామీల గురించి ప్రధాని శనివారం ప్రస్తావించారు. కాంగ్రెస్‌కు రైతులు ఓటు బ్యాంకులు, అయితే తమకు వారు అన్నదాతలు అని కాంగ్రెస్, బిజెపిల మధ్య కొట్టొచ్చినట్లుగా ఉండే తేడా ఇదేనని ప్రధాని వ్యాఖ్యానించారు. రైతాంగ సంక్షేమానికి కేంద్రం పలు చర్యలు సమగ్ర ప్రణాళికలకు అనుగుణంగా పాటుపడుతోందని, ప్రత్యేకించి సాగునీటి ప్రాజెక్టులు పునరుద్ధరణ ద్వారా పంట దిగుబడి పెంచేందుకు చర్యలు తీసకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే పిఎం ఇరిగేషన్ స్కీంను తీసుకువచ్చినట్లు, చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసినట్లు వివరించారు. రైతుల ఓట్లను రాబట్టుకోవడానికి ఇప్పటికిప్పుడు తాను రూ లక్ష కోట్ల మేర రుణాల మాఫీ ప్రకటనకు దిగవచ్చుని, చెప్పడం తేలికే అయితే ఇటువంటి చర్యలకు తాము దిగదల్చుకోలేదని పాత వ్యవస్థను మార్చివేసేందుకు సిద్ధం అయినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రాష్ట్రాలలో రుణ మాఫీ కేవలం ప్రకటనలకే పరిమితం అయిందని, ఇవన్నీ కూడా లాలీపాప్ వంటివని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రాష్ట్రాలలో రైతులు ఎరువులు, విత్తనాల కోసం క్యూలలో పడిగాపులు పడాల్సి వస్తోందని, వారిపై లాఠీచార్జిలు జరుగుతున్నాయని మోడీ తెలిపారు. ఇక కూటమి అధికారంలో ఉన్న కర్నాటక గురించి ప్రస్తావిస్తూ వారు ఏదో విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసుకోగలిగారు. ఇది దొడ్డిదారి ప్రవేశమే. ఇక అధికారంలోకి వచ్చిన తరువాత అక్కడ మొక్కుబడిగా ఆ ప్రభుత్వం కేవలం 800 మంది రైతులకు రుణమాఫీ చేసిందని విమర్శించారు.

ప్రతిభావంతులై దేశాన్ని వీడుతున్నారు

- హాస్యాస్పద ఇమ్మిగ్రేషన్‌తో గొప్ప మేధావులను కోల్పోతున్నాం
- ఇక్కడే ఉండి అమెరికా అభివృద్ధికి తోడ్పడండి
- విదేశీ విద్యార్థులకు అధ్యక్షుడు ట్రంప్ పిలుపు



వాషింగ్టన్: దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థలలో చదువుకున్న ప్రతిభావంతులైన విదేశీ విద్యార్థులు చదువు ముగిసిన తర్వాత అమెరికా విడిచి వెళ్లిపోతున్నారని అమెరికా అధక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిభావంతులైన విదేశీ విద్యార్థులు అమెరికాలోనే ఉండి కంపెనీలో పురోభివృద్ధికి తోడ్పడాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికాలో ఉన్న "హాస్యాస్పదమైన" ఇమిగ్రేషన్ విధానం కారణంగా దేశం 'గొప్ప మేథో సంపద'ను కోల్పోతోందని వ్యాఖ్యానించారు. చట్టపరమైన ఇమిగ్రేషన్ విధానంలోని లోపాలను తొలగించాలన్నది తన అభీష్టమని, దీని వల్ల ప్రతిభ ఆధారంగా మరింత మందిని ఆకట్టుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. విదేశీ విద్యార్థులు ప్రతిభపై చట్టబద్ధంగా దేశంలోకి రావాలని తన ప్రభుత్వం కోరుకుంటోందని ట్రంప్ చెప్పారు. "దేశంలోకి చాలా కంపెనీలు వస్తున్నాయి. మనకు చాలామంది ఉద్యోగులు అవసరం. అయితే వారంతా ప్రతిభ ప్రాతిపదికన ఇక్కడకు రావాలని మేము ఆకాంక్షిస్తున్నాము. గతంలో వచ్చినట్లుగా మాత్రం కాదు," అని ట్రంప్ సూచించారు. తనకు చాలా టెక్ కంపెనీల నుంచి ఫోన్లు వస్తున్నాయని, దేశంలోని ఉత్తమ విద్యా సంస్థలలో ప్రథమ శ్రేణిలో ఉన్న విద్యార్థులు తమకు కావాలని, కాని వారిని మనం దేశంలో ఉండడానికి అనుమతించలేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. "దీంతో వారంతా చైనా, జపాన్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర దేశాలకు వెళ్లిపోతున్నారు. వారిని మనం ఉండనివ్వడం లేదు. మన దేశంలోని అత్యుత్తమ స్కూళ్లలో వారు చదువుకుంటారు. వివిధ కారణాల వల్ల వారిని ఇక్కడే మనం కొనసాగనివ్వడం లేదు. దీనివల్ల మనం చాలా గొప్ప మేధావులను కోల్పోతున్నాము. మనం అలా చేయకూడదు" అని ట్రంప్ అభిప్రాయపడ్డారు. దేశంలో విద్యను అభ్యసించిన విదేశీ విద్యార్థులు అమెరికాలోనే ఉండి ఉద్యోగం చేసుకోవడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ట్రంప్ ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం వైట్ హౌస్‌లో డెమొక్రాట్ నాయకులతో జరిగిన సమావేశంలో ఈ సమస్యను చర్చించామని, వారు కూడా తన అభిప్రాయంతో ఏకీభవించినట్లే కనపడుతోందని ట్రంప్ అన్నారు.

అవసరమైతే అత్యవసర పరిస్థితి
షట్‌డౌన్ ఎన్నేళ్లైన కొనసాగుతుంది: ట్రంప్

వాషింగ్టన్: మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి పార్లమెంట్ (కాంగ్రెస్) నిధులు ఇచ్చేందుకు నిరాకరించినట్లైతే గత రెండు వారాలుగా కొనసాగుతున్న ప్రభుత్వ పాక్షిక మూసివేత(షట్‌డౌన్) ఎన్నేళ్లైన కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో కాంగ్రెస్ నేతలతో సమావేశం అనంతరం సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి జాతీయ అత్యయిక పరిస్థితి విధించే అవకాశం తనకు ఉందని పేర్కొన్నారు. షట్‌డౌన్ కొనసాగిస్తానని ట్రంప్ బెదిరించినట్లు డెమోక్రాట్లు విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రభుత్వం ఉండాలని అధ్యక్షుడిని తాము కోరినప్పటికీ ఆయన ప్రతిఘటించారని సెనేట్ మైనార్టీ నేత చక్ షుమార్ తెలిపారు. సుదీర్ఘ కాలం ప్రభుత్వాన్ని మూసివేస్తానని, నెలలు, సంవత్సరాల తరబడి మూసివేస్తానని చెప్పారన్నారు. పలు వివాదాస్పద అంశాల గురించి తాము చర్చించినట్లు షుమార్ పేర్కొన్నారు. దేశంలోకి అక్రమ వలసలు, మానవుల అక్రమ రవాణా, డ్రగ్స్ వంటివి అరికట్టవచ్చని పేర్కొన్నారు. జాతీయ అత్యయిక పరిస్థితి ప్రకటించి గోడ నిర్మించే అవకాశం తనకు ఉందన్నారు. అయితే అలా ఎప్పటికీ చేయనన్నారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666